- ముడా భూములు వెనక్కిచ్చిన సిద్ధూ భార్య
- వాణిజ్య సిలిండర్‌పై రూ.48.5 పెంపు
- బుల్డోజర్ కూల్చివేతలపై మార్గదర్శకాలు: సుప్రీం
- ఈ ఏడాది 1.4 లక్షల టెక్ ఉద్యోగాల కోత
- ఫేక్ సుప్రీం విచారణతో 7 కోట్లు టోకరా

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

బుధవారం WEDNESDAY 2.10.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 12+4 + 8 Pages NIPUNA supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 118 ‖ వెల (Price) రూ.6.50 | గాంధీ జయంతి

బుధవారం, సూర్యోదయం: 6-06, సూర్యాస్తమయం: 6-04. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం తిథి: అమావాస్య రాత్రి 12-19 వరకు. నక్షత్రం: ఉత్తరఫల్గుణి పగలు 12-19 వరకు, తదుపరి హస్త. వర్జ్యం: రాత్రి 9-54 నుంచి రాత్రి 11-42 వరకు. రాహుకాలం: పగలు 12-05 నుంచి పగలు 1-34 వరకు. దుర్ముహూర్తం: పగలు 11-41 నుంచి పగలు 12-29 వరకు. అమృతకాలం: లేదు. మహాలయ (పెత్తర) అమావాస్య, ఎంగిలిపూల బతుకమ్మ.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

బతుకే కూలింది.. ఇక బతుకమ్మ ఎక్కడిది?



కేసీఆర్ సారు చీరలిచ్చిండు.. రేవంత్ ఇల్లు కూలగొట్టిండు

మార్పు.. మార్పు.. అని చెప్తే నమ్మి ఓటేస్తే ఈ రేవంత్‌రెడ్డి మమ్మల్ని నడిమిట్ల బొందపెట్టిండు. రెక్కలు ముక్కలు జేసి కట్టుకున్న ఇంటిని కూలగొట్టేసిండు. మా బతుకే కూలిపాయె.. ఇగ బతుకమ్మ ఎట్లాడాలె? తెలంగాణ అచ్చినప్పటి సంది ఈ దినం అచ్చిదంటే అందరం ఈ చెరువుకాడనే బతుకమ్మ ఆడేది. కేసీఆర్ సారు చీరలు పంచేది. పది దినాలు సంబురాలు ఉంటుండె. రేవంత్‌రెడ్డి అచ్చినకాడినుంచి రాష్ట్రాన్ని సర్వనాశనం జేత్తున్నడు. కేసీఆర్ సారు లెక్క రైతుబంధు ఇయ్య చేతగాదు. రుణమాఫీ చెయ్య ముఖం లేదు. దరిద్రమైన పనులు జేయమంటే ఫస్ట్ ఉంటడు. ఇంతమంది పేదోళ్ల ఏడుపు మంచిది గాదు.. ఇంతకింత అనుభవిస్తడు.

- తార, సున్నం చెరువు హైడ్రా బాధితురాలు

థేమ్స్ థీమ్స్

ఒక్క ఇల్లూ కూల్చలేదు

- పకడ్బందీ ప్రణాళిక, సీవరేజ్ ట్రీట్మెంట్‌తో నదికి కొత్తరూపు › 2
- వరదల నియంత్రణకు పక్కా సిస్టం
- కూల్చివేతలే తప్ప మూసీపై ఎక్కడా కనిపించని 'థేమ్స్ యాక్షన్ ప్లాన్'



లండన్ నగరానికి మరింత వన్నెతెస్తూ థేమ్స్ నదికి ఇరువైపులా పరుచుకున్న భవనాలు, నిర్మాణ సముదాయాలు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీపై చెప్తున్నట్టు ఎఫ్‌టీఎల్, బఫర్ అంటూ పోతే లండన్ ఉనికే ప్రశ్నార్థకమయ్యేది!

కల రాలింది.. ఎన్ని రాళ్లు పేరిస్తే ఇల్లవుతుంది?



మూసీలో కూల్చివేతలు.. 150 ఇండ్లు నేలమట్టం

- పేదల ఆక్రందనలు పట్టని రేవంత్ సర్కార్
- పోలీస్ బందోబస్తు మధ్య ఇండ్లు కూల్చివేత
- ఇరుకు గల్లీల్లోకి రాని బుల్డోజర్లు, జేసీబీలు
- 50 మంది కూలీలను తెచ్చి కూల్చివేతలు
- మా ఇండ్లను బలవంతంగా కూలుస్తున్నరు
- సామాన్లూ తీసుకోనియ్యలేదు: బాధితులు › 2

ఓటేస్తే మా జీవితాలను బర్బాద్ చేసిండు. ఐదు రోజుల నుంచి నీళ్లు లేవు, తిండిలేదు, ఇండ్లలో పాచిపనులు చేసి ఓ ఇల్లు కట్టుకున్నం. దానినీ కూల్చివేసిండు. ఇప్పుడు మమ్మల్ని రోడ్లమీద నిలబెట్టిండు. మా బతుకులను ఆగం జేసిండు. ఇప్పటికైనా మా ఇల్లు మాకు ఇస్తే, ఎంత కష్టమైనా మళ్లీ కట్టుకుంటం. ఇంకెక్కడికీ పోయేది లేదు.

- చాంద్‌బీ, శంకర్‌నగర్ బాధితురాలు



అంబర్‌పేటలోని న్యూ తులసీరాంనగర్‌లో మూసీ కూల్చివేతలపై ఆందోళనకు గురవుతున్న వృద్ధురాలికి భరోసా ఇస్తున్న కేటీఆర్

బస్తీలకు బీఆర్‌ఎస్ భరోసా

ఇండ్లు కూల్చాలని ఇందిరమ్మ చెప్పిందా?

- సామాన్యులను బజారున పడేసి మూసీలో రిసార్టులు కడ్తరా?
- గరీబోళ్ల ఇండ్లు కూల్చుడు కాదు.. గ్యారెంటీలు అమలుచెయ్
- రేవంత్‌రెడ్డీ.. నీ తాటాకు చప్పుళ్లకు భయపడం.. తాట తీస్తం
- నియంత పాలనను సవాల్‌చేసే నా స్ఫూర్తిని గూండాలు ఆపలేరు
- కేటీఆర్ హెచ్చరిక.. అంబర్‌పేట్ న్యూ తులసీరాంనగర్‌లో పర్యటన
- కేసులకు భయపడొద్దని మూసీ కూల్చివేతల బాధితులకు భరోసా
- కేసులు పెడితే సుప్రీంకోర్టు దాకా వెళ్లి కొట్లాడుతామని స్పష్టీకరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : 'ఇందిరమ్మ రాజ్యం పేరిట ఇండ్లు కూలగొట్టుమని ఇందిరమ్మ చెప్పిందా? సోనియమ్మ చెప్పిందా?' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. పేదల ఇండ్లు కూల్చి రిసార్టులు కడితే ఒరిగేదేమిటి రేవంత్? అంటూ నిలదీశారు. అంబర్‌పేట్ నియోజకవర్గంలోని మూసీ పరీవాహక ప్రాంతాలైన న్యూ అంబేద్కర్ నగర్, న్యూ తులసీరాంనగర్ ప్రాంతాల్లో కేటీఆర్ మంగళవారం పర్యటించి బాధితులకు భరోసా కల్పించారు. పేదల ఇండ్లను కూల్చాలనుకుంటున్న రేవంత్ ముందుగా ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 'ఇందిరమ్మ రాజ్యం పేరిట అందరికీ ఇండ్లు కట్టించాల్సింది పోయి.. పేదల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చేందుకు వస్తున్నరు.. రాష్ట్ర బడ్జెట్‌లో సగం డబ్బును మూసీ పేరిట ఖర్చు చేసేలా రేవంత్ ప్లాన్ చేసిండు.. మల్లయ్య లాంటి పేదల ఇంటిని కూల్చి, రిసార్టులు, రిక్రియేషన్ జోన్లు నిర్మిస్తే ఒరిగేదేమిటి?' అని ప్రశ్నించారు. 'మీరు గెలిపించిన కిషన్‌రెడ్డి పదవులు పొంది.. మీ కష్టాల్లో తోడు లేకుండా పారిపోయారు.. తప్పించుకు తిరిగేటోడు నాయకుడెట్లయితడు?' అని కిషన్‌రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గరీబోళ్ల కోసం పనిచేస్తానని › 3వ పేజీలో

కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ దాడి

- అంబర్‌పేట పర్యటనలో దారికాచి వీరంగం
- మూసీ బాధితులకు భరోసా ఇచ్చేందుకు వెళ్తుండగా అటకాయించిన కార్యకర్తలు
- కారుపైకి ఎక్కి అద్దాల ధ్వంసానికి యత్నం
- నిలువరించకుండా పోలీసుల ప్రేక్షకపాత్ర

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) అంబర్‌పేట/చిక్కడపల్లి : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. కాన్వాయ్‌ని వెంబడించి మరీ దారికాచి అటకాయించి వీరంగం సృష్టించారు. ఏకంగా కేటీఆర్ ఉన్న కారుపైకి ఎక్కి అద్దాలను వెంటతెచ్చుకున్న ఆయుధాలతో ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకునేందుకు కేటీఆర్ భద్రతా సిబ్బంది.. బీఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నించగా పలువురు › 3వ పేజీలో

అన్నీ వాళ్లకు చెప్పి చేయాలా?

హైకమాండ్‌పై ముఖ్యమంత్రి రుసరుస

- క్యాబినెట్ భేటీలో సహచరులపై చిటపట
- గత 20న హైడ్రాపై తీవ్ర వాదోపవాదాలు
- అభ్యంతరాలపై తనతో చెప్పకుండా ఢిల్లీకి తరచూ ఫిర్యాదులు ఏమిటని సీఎం ప్రశ్న
- గడియకోసారి ఢిల్లీకి పిలిపించి వివరణ అడుగుతున్నారని పార్టీ పెద్దలపై అసహనం
- అభ్యంతరాలపై చర్చించే అవకాశం తమకు ఎక్కడ ఇస్తున్నారని ప్రశ్నించిన మంత్రులు
- గ్రేటర్ ఎన్నికలకు ముందు కూల్చివేతలేంది?
- ఇట్లయితే పార్టీ, ప్రభుత్వం పరిస్థితి ఏం కావాలనుకుంటున్నారని మంత్రుల ఆగ్రహం
- ముఖ్యమంత్రి వ్యాఖ్యలు మళ్లీ ఢిల్లీకి చేరవేత
- మళ్లీ పిలిచి వివరణ అడిగిన అధిష్ఠానం
- ఖర్గేకు పరామర్శ నెపంతో ఢిల్లీకి రేవంత్ › 6
- హైడ్రాపై పార్టీ సీనియర్లను కలిసి వివరణ



హైడ్రా కూల్చివేతలు, మూసీ రెడ్‌మార్కింగ్.. కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతున్నది. కాంగ్రెస్ అధిష్ఠానంపై సీఎం రేవంత్ రుసరుసలాడుతుంటే.. ముఖ్యమంత్రి ఏకపక్ష ధోరణిపై కొందరు మంత్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రేవంత్ వైఖరిపై అధిష్ఠానానికి ఫిర్యాదులు అందాయని, దానిమీదే సీఎంను పిలిచి వివరణ అడిగినట్టు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

- 'సూర్యలత' కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కేవీ గెలుపు
- సీఎం ఇలాకాలో విజయంపై బీఆర్‌ఎస్ సంబురాలు › 7

నేటినుంచి స్కూళ్లకు దసరా సెలవులు

› 7

కాంగ్రెస్ హామీలకు 300 రోజులు



- సీజన్ ముగిసినా 'రైతు భరోసా' ఇయ్యలే
- 2 లక్షల రుణమాఫీ రైతులందరికీ దక్కలే
- ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ తూచ్
- రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు ఏమాయె?
- వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లనూ పెంచలే
- మహిళలకు ఇస్తామన్న 2,500 హుళక్కే
- కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని 6 గ్యారెంటీల్లోని 13 హామీలు అసంపూర్తిగా అమలు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తియ్యటి మాటలు చెప్పారు.. 420 హామీలు ఇచ్చారు.. అధికారం చేపట్టిన 100 రోజుల్లో హామీలు అమలుచేస్తామన్నారు.. దేవుళ్లపై ఒట్లు వేశారు.. కానీ, పాలనాపగ్గాలు చేపట్టి 300 రోజులైనా హామీల అమలును పట్టించుకోవడం లేదు. ఇదీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, ఉద్యమకారులు, ఆటోడ్రైవర్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, కులవృత్తులు.. ఇలా సబ్బండవర్ణాల ప్రజల ఓట్లను దృష్టిలో పెట్టుకొని 420 హామీలతో మ్యానిఫెస్టోను విడుదల చేసింది కాంగ్రెస్ పార్టీ. వాటిని › 6వ పేజీలో



రైతులందరికీ రుణమాఫీ చేయకపోవడాన్ని నిరసిస్తూ పెద్దపల్లిలో మంగళవారం కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, రైతుల సంఘాల నేతలు › 7

రుణమాఫీ ఇంకా పూర్తికాలె

- భూమి ఉన్న ప్రతి రైతుకూ మాఫీ.. కొనసాగుతున్న ప్రక్రియ
- కుటుంబ నిర్ధారణ పూర్తయ్యాకే రైతుల ఖాతాల్లో డబ్బులు
- మా ప్రభుత్వానికిది తొలి ఏడాదే.. దానికీ 2 నెలలున్నయ్
- 2 లక్షల పైన రుణం ఉన్న రైతులకు షెడ్యూల్ ప్రకటిస్తాం
- మంత్రి తుమ్మల ప్రకటన.. డెడ్‌లైన్‌పై స్పష్టత కరువు › 7



రజాకార్లతో పోరాడినట్టే.. మూసీ వ్యతిరేకులతో పోరాటం



కూల్చివేతల ఆందోళనలపై మంత్రి కోమటిరెడ్డి మండిపాటు › 3

మూసీ కూల్చివేతలపై కోర్టుకెళ్తా

- పైసా తీసుకోకుండా కేసు నడిపిస్తా
- అధిష్ఠానం దృష్టికి ఈ అన్యాయాన్ని తీసుకెళ్తా: మధుయాష్కీ › 6



కడుపుకాలి తిడితే.. 70 ఏండ్ల వృద్ధుడిపై కేసు

- ఇండ్ల కూల్చివేతలకు అధికారుల సర్వే › 2
- బాధితుల ఆవేదనపై పోలీసుల ఉక్కుపాదం
- సీఎంను దుర్భాషలాడాడని 3 సెక్షన్లు నమోదు





ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం

- సుమారు 500 మిస్సైల్స్, రాకెట్ల ప్రయోగం
- అమెరికా హెచ్చరించిన కొద్ది గంటల్లోనే దాడి
- బాంబుల మోతతో దద్దరిల్లిన టెల్ అవీవ్ › 10
- ఇజ్రాయెల్‌కు మద్దతుగా రంగంలోకి అమెరికా
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం
- లెబనాన్‌లో ఇజ్రాయెల్ భూతల దాడులు



హైదరాబాద్‌లో డీజేలపై నిషేధం

- ర్యాలీల్లో ఫైర్ క్రాకర్స్‌పైనా బ్యాన్ › 7
- పోలీస్ కమిషనర్ ఆనంద్ ఉత్తర్వులు
- ఉల్లంఘిస్తే ఐదేండ్ల జైలు, లక్ష ఫైన్

రాష్ట్రానికి వరదసాయం 416 కోట్లు

- నిధులు విడుదల చేసిన కేంద్ర హోంశాఖ
- ఎన్డీఆర్‌ఎఫ్ నిధుల్లో మళ్లీ మొండిచేయి
- ఏపీ కేటాయింపుల్లో సగం కూడా ఇవ్వలె › 8
- 8మంది ఎంపీలను ఇస్తే.. ఇదేం అన్యాయం?
- బీజేపీపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

థేమ్స్.. థీమ్స్.. ఒక్క ఇల్లూ కూల్చలేదు

- థేమ్స్ నదికి రెండు వేల ఏండ్లకు పైగా ఘన చరిత్ర
- కాలుష్యం నుంచి స్వచ్ఛ నదిగా కొత్త రూపు
- నది ఒడ్డున నిర్మాణాలు కూల్చకుండానే పనులు
- పకడ్బందీ ప్రణాళిక, సీవరేజ్ ట్రీట్మెంట్‌తో సుసాధ్యం
- ఆకస్మిక వరదల నియంత్రణకు 'ఫ్లడ్ కంట్రోల్ సిస్టం'
- ఎఫ్‌టీఎల్, బఫర్ అంటే లండన్ ఉండేదా?
- మూసీ ప్రాజెక్టులో కనిపించని 'థేమ్స్ యాక్షన్ ప్లాన్'
- కూల్చివేతతో బడుగుల జీవితాలు బుగ్గి

మూసీ అభివృద్ధికి 'థేమ్స్ యాక్షన్ ప్లాన్'ను అమలు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి.. దాన్ని పక్కనబెట్టి బడుగుల ఇండ్లను కూల్చడమే లక్ష్యంగా తన 'యాక్షన్ ప్లాన్'ను ముందుకు తీసుకుపోతున్నట్టు అనుమానాలు కలుగుతున్నాయి. ఈ కూల్చివేత చర్యలను చూస్తే జనవరిలో లండన్ పర్యటనలో సీఎం అసలు 'థేమ్స్ నది పునరుజ్జీవ ప్లాన్'పై నిజంగానే అధ్యయనం చేశారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. థేమ్స్‌ను శుద్ధిచేయడానికి నది ఒడ్డున నివసిస్తున్న ఏ ఒక్కరినీ తరలించలేదు. ఒక్క ఇంటిని కూడా కూల్చలేదు. అయితే, ఇక్కడ మూసీనదీ పరీవాహకప్రాంతాల్లో ఇండ్ల తొలగింపు నిత్యకృత్యంగా మారింది. ఈ ఒక్క విషయమే కాదు సీవరేజ్ ట్రీట్మెంట్, ఫ్లడ్ కంట్రోల్ కార్యాచరణ తదితర విషయాల్లోనూ 'థేమ్స్ ప్లాన్'ను మన ప్రభుత్వం ఎక్కడా అనుసరించినట్టు కనిపించట్లేదు.



థేమ్స్ నది ఒడ్డున భారీ నిర్మాణాలు, వాణిజ్య సముదాయాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): మూసీ అభివృద్ధికి థేమ్స్ నది ప్లాన్‌ను అమలు చేస్తామని జనవరిలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. దీని కోసం లండన్‌లో ఆయన మూడురోజుల పాటు ప్రత్యేకంగా పర్యటించారు కూడా. అయితే, క్షేత్రస్థాయిలో థేమ్స్ నది ప్లాన్‌ను మూసీకి అన్వయిస్తున్నట్టు కనిపించడంలేదు. మూసీ సుందరీకరణ పేరిట బడుగు వర్గాలు కట్టుకున్న ఇండ్లను కాంగ్రెస్ సర్కారు నిర్ధాక్షిణ్యంగా కూల్చేస్తుండటమే దీనికి రుజువు.

> "లండన్ పర్యటనలో ఉన్నప్పుడు థేమ్స్ నది నిర్వహణ తీరు, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధిపై అధ్యయనం చేశా. థేమ్స్ రివర్ ప్రాజెక్టు తరహాలో హైదరాబాద్‌లోని మూసీనది పునరుజ్జీవ ప్రాజెక్టు చేపడతాం.
>
> - జనవరి 19న సీఎం రేవంత్ రెడ్డి

కాలుష్యానికి చిరునామాగా..

శతాబ్దాల చరిత్ర కలిగి, ఒకప్పుడు కాలుష్యానికి చిరునామాగా ఉండే థేమ్స్ నది.. ఇప్పుడు స్వచ్ఛమైన జీవనధారగా మారింది. ఏండ్లకేండ్లు చిత్తశుద్ధితో కూడిన పకడ్బందీ చర్యలతోనే ఇది సాకారమైంది. 346 కిలోమీటర్ల పొడవైన థేమ్స్‌నది ఇంగ్లండ్‌కు నైరుతి దిశగా ఉన్న గ్లౌసెస్టర్‌షైర్ రాష్ట్రంలోని థేమ్స్‌హెడ్ పర్వతాల్లో ప్రారంభమౌతుంది. టెడ్డింగ్టన్, స్టెయిన్స్ అపాన్ థేమ్స్, హెన్లే ఆన్ థేమ్స్, ఆక్స్‌ఫర్డ్, రీడింగ్, మైడెన్‌హెడ్, విండ్‌సోర్, లండన్ తదితర నగరాల గుండా ప్రవహించి ఉత్తర సముద్రంలో కలుస్తుంది. క్రీస్తుశకం 45వ సంవత్సరం నుంచే థేమ్స్ నది ఒడ్డున పట్టణ నాగరికత పరిఢవిల్లినట్టు చరిత్ర చెప్తున్నది. 18వ శతాబ్దంలో ఐరోపావ్యాప్తంగా పారిశ్రామికీకరణ ఊపందుకోవడం, నగర జనాభా పెరిగిపోవడంతో ఇంగ్లండ్ పట్టణాల గుండా ప్రవహిస్తున్న థేమ్స్ నదిలో వ్యర్థాలు కలవడం పెరిగింది. దీంతో అప్పటివరకూ స్వచ్ఛమైన నీటితో అలరారే థేమ్స్ కాలుష్యానికి చిరునామాగా మారింది.



క్వీన్ విక్టోరియా కూడా..

థేమ్స్ నది ఒడ్డున నివాసాలు, పరిశ్రమలు పెరిగిపోవడంతో నదిలో కలిసే వ్యర్థాల మోతాదు పెరిగిపోయింది. 'థేమ్స్‌కంపు కొడుతున్నది. నది ఒడ్డున నిలబడలేని స్థితి' అంటూ 1858 జూన్ 29న క్వీన్ విక్టోరియా తన కుమార్తెకు పంపిన లేఖలో రాశారంటే నది పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. థేమ్స్‌ను ప్రక్షాళన చేయకపోతే, భవిష్యత్తు తరాల మనుగడకే ముప్పు అని గ్రహించిన అప్పటి ప్రభుత్వం తాత్కాలిక చర్యలను ముమ్మరం చేసింది. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు థేమ్స్‌లో కలవనీయకుండా ప్రత్యేక మార్గాల్లో డిస్పోజ్ చేయడం వంటి పనులు చేపట్టింది. అయితే, కొద్ది కాలం వరకు మాత్రమే ఇవి సత్ఫలితాలను ఇచ్చాయి. జనాభా పెరిగిపోవడం, ఫ్యాక్టరీ వ్యర్థాల మోతాదు పరిధిని మించిపోవడంతో శాశ్వతమైన యాక్షన్ ప్లాన్ అవసరమైంది. దీంతో 'థేమ్స్ యాక్షన్ ప్లాన్' తెరమీదకు వచ్చింది.

కాలుష్య నియంత్రణ

థేమ్స్ నదిని కాలుష్యానికి దూరంగా ఉంచాలంటే తొలుత మురుగు నియంత్రణే మార్గమని 1858లో సివిల్ ఇంజినీర్ సర్ జోసెఫ్ బెజెల్‌గెట్ భావించారు. ఇందుకోసం నది ప్రవహించే మార్గానికి రెండువైపులా భూగర్భంలో సొరంగాలను నిర్మించారు. ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక మురుగునీటి నిర్వహణ ట్యాంకును ఏర్పాటుచేశారు. 'సీవరేజ్ నెట్‌వర్క్'గా పిలిచే ఈ ట్యాంకులకు ఆ సొరంగాలను పైపులతో అనుసంధానించారు. ఇండ్లు, పరిశ్రమల్లోని వ్యర్థాలు పైపుల గుండా డైరెక్టుగా మురుగునీటి నిర్వహణ ట్యాంకులకు చేరుతాయి. నదిలో కలవవు. అలా నదిలో కాలుష్య వ్యర్థాలు కలవకుండా కట్టడి జరిగింది. దశాబ్దాలు గడిచినప్పటికీ ఈ టెక్నిక్‌నే ఇప్పటికీ పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ (పీఎల్‌ఏ) అమలు చేస్తున్నది. ఆ తర్వాత 25 కిలోమీటర్ల పొడవైన 'థేమ్స్ టైడ్‌వే టన్నెల్'ను ఏర్పాటుచేశారు. దీని సాయంతో వ్యర్థాలతో కూడిన నీరు థేమ్స్ నదిలో కలవకుండా ప్రత్యేక మార్గం ద్వారా సీవరేజ్ ట్యాంకుల్లో శుద్ధి అవుతున్నది. ఈ శుద్ధి అయిన నీటిని థేమ్స్ పరీవాహంలో పెంచుతున్న ప్రత్యేకమైన ఉద్యానవనాల్లోని మొక్కలకు వినియోగిస్తున్నారు. అలా థేమ్స్ నది కాలుష్యంబారిన పడకుండా రక్షించబడింది. ఇండ్లను, వాణిజ్య సముదాయాలను కూల్చకుండానే, ప్రజలను తరలించకుండానే 'థేమ్స్ టైడ్‌వే టన్నెల్' నిర్మాణం ఇటీవలే జరగడం విశేషం.

వరదల నియంత్రణ

'థేమ్స్ యాక్షన్ ప్లాన్'లో రెండోది వరదల నియంత్రణ. లండన్ వంటి జనాభా ఎక్కువగా ఉన్న నగరాల గుండా నదీప్రవాహం ఉన్నప్పుడు ఎప్పుడైనా వరదలు సిటీని ముంచెత్తవచ్చు. దీనికి చెక్ పెట్టడానికి వరదల నియంత్రణ కోసం థేమ్స్ నది నగరంలోకి ప్రవేశించే మార్గంలో 'థేమ్స్ బ్యారియర్' పేరిట ప్రభుత్వం ఓ భారీ నిర్మాణాన్ని చేపట్టింది. 3.2 కిలోమీటర్ల వెడల్పుతో పెద్దపెద్ద నియంత్రణ గేట్లను నదికి అడ్డంగా అమర్చారు. ప్రవాహ ఉధృతి పెరగడాన్ని ముందే అంచనా వేసే ఈ అత్యాధునిక వ్యవస్థ 1984 నుంచి ఇప్పటివరకూ థేమ్స్ నదికి 200కు పైగా వరదలు వచ్చినప్పటికీ సమర్థంగా నియంత్రించగలిగింది. ప్రవాహానికి సంబంధించి ముందస్తు రీడింగ్స్ తెలియజేయడం, కాలువల్లోకి నీటిని మళ్లించడంతో వరదలను బ్యారియర్ కట్టడి చేస్తుంది.

నిర్మాణాలు కూల్చకుండానే..

థేమ్స్ నది ఒడ్డున కోటికి పైగా ఇండ్లు, ఫ్యాక్టరీలు, వాణిజ్య సముదాయాలు ఉంటాయని అధికారుల అంచనా. అయితే, మురుగునీటి నిర్వహణ పేరిట నిర్మించిన 'సీవరేజ్ నెట్‌వర్క్' కోసంగానీ, వరదల నియంత్రణ కోసం నిర్మించిన 'థేమ్స్ బ్యారియర్' కోసంగానీ ఇప్పటివరకూ ఏ ఒక్క నిర్మాణాన్ని కూడా కూల్చేయలేదని పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ రికార్డులను బట్టి తెలుస్తున్నది. మురుగునీటి కోసం నిర్మించిన సొరంగాలను రోడ్డుకు మధ్యలో ఒక మీటరు వెడల్పుతో ఏర్పాటు చేశామని, మురుగునీటి నిర్వహణ ట్యాంకులను ప్రభుత్వానికి చెందిన ఖాళీ ప్రదేశంలో నిర్మించినట్టు అధికారులు తెలిపారు. వరదల నియంత్రణకు తీసుకొచ్చిన 'థేమ్స్ బ్యారియర్'ను నది మధ్యలో నిర్మించినట్టు వివరించారు. ఇక, ఇండ్లల్లో ఉండే ప్రజలకు, వాణిజ్య కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవకుండా రాత్రిళ్లు, సెలవు దినాల్లోనే ఈ పనులను చేపట్టామని, ప్రజలను ఎక్కడికీ తరలించలేదని వివరించారు.

లండన్ ఉనికే ప్రశ్నార్థకమయ్యేది

మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు ఉన్నాయంటూ రేవంత్ ప్రభుత్వం పేదల ఇండ్లను బుల్డోజర్లతో కూలదోస్తున్నది. అయితే, ఈ నియమాలనే థేమ్స్ నది ఒడ్డున అమలు చేస్తే, లండన్‌లోని దాదాపు 40 శాతం నిర్మాణాలు కనిపించకుండా పోతాయని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన స్కాలర్ ఒకరు తెలిపారు. లండన్‌లో ప్రఖ్యాతిగాంచిన హ్యాంప్టన్ కోర్టు ప్యాలెస్, టేట్ బ్రిటన్, టేట్ మాడర్న్, ప్యాలెస్ ఆఫ్ వెస్ట్‌మినిస్టర్, లండన్ ఐ, టవర్ బ్రిడ్జి, హెచ్‌ఎంఎస్ బెల్‌ఫాస్ట్, టవర్ ఆఫ్ లండన్, గ్రీన్‌విచ్ పార్క్ తదితర కట్టడాలు, నిర్మాణాలు బఫర్ జోన్‌లోనే ఉన్నాయని గుర్తు చేశారు. ఇక, ఇంగ్లండ్‌లో థేమ్స్ నది ఒడ్డున ఒకవిధంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏకంగా ఏడు నగరాలు నిర్మితమయ్యాయంటే షాక్ అవకుండా ఉండలేం. ప్రపంచ టూరిస్టులను ఆకర్షిస్తున్న మార్లో, మైడెన్‌హెడ్, విండ్‌సోర్, ఈటోన్, రీడింగ్, హెన్లే ఆన్ థేమ్స్, కింగ్‌స్టన్ అపాన్ థేమ్స్ తదితర నగరాలు థేమ్స్ నది ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయి. రేవంత్ సర్కారు ఎఫ్‌టీఎల్ నిబంధనలు అక్కడగనుక అమలు చేస్తే, ఈ నగరాలన్నింటినీ నేలమట్టం చేయాల్సిందే.


కూల్చాల్సిన పనిలేదు..

ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధి పేరిట, వరదలు ముంచెత్తుతాయన్న కారణంతో నది ఒడ్డున ఉన్న నిర్మాణాలను కూల్చేయాల్సిన పనిలేదని పీఎల్‌ఏ అధికారులు చెప్తున్నారు. 'థేమ్స్ బ్యారియర్' సాయంతో థేమ్స్ నది ప్రవాహ ఉధృతిని ఎప్పటికప్పుడు నియంత్రించడంలో తాము సక్సెస్ అయిన విధానాన్ని గుర్తుచేస్తున్నారు. 'థేమ్స్ బ్యారియర్'తో థేమ్స్ నది ఒడ్డున ఉన్న కట్టడాలకు వరద ముప్పు లేకుండా పోయిందని చెప్తున్నారు. 'థేమ్స్ యాక్షన్ ప్లాన్'లో భాగంగా చేపట్టిన ఈ చర్యలతో పురాతన కట్టడాలు ఇప్పటికీ కనుమరుగవ్వలేదు. పర్యాటకరంగం కూడా భారీగా పుంజుకొన్నది. ప్రతీ పదేండ్లకోసారి థేమ్స్ యాక్షన్ ప్లాన్‌ను ఆధునీకరిస్తామని, కొత్త సాంకేతికతతో వినూత్న విధానాలను అందిపుచ్చుకొంటామని పీఎల్‌ఏ అధికారులు తెలిపారు. అందుకే, థేమ్స్ ఇప్పటికీ, స్వచ్ఛతను కోల్పోలేదని పేర్కొన్నారు.

780 ఏండ్ల కిందటే యాక్షన్ ప్లాన్‌కు బీజం

13వ శతాబ్దంలో ఇంగ్లండ్‌లో గతంలో ఎన్నడూచూడని నీటి కరువు తాండవించింది. దీంతో అప్పటి ప్రభుత్వం 1245 సంవత్సరంలో 2.7 మైళ్ల పొడవుతో ఓ పెద్ద సొరంగాన్ని థేమ్స్ నదీ గర్భంవరకూ నిర్మించింది. థేమ్స్‌లో ప్రవహిస్తున్న నీటిలో కొంత ప్రవాహాన్ని పక్కకు తరలించడమే ఈ సొరంగం ప్రధాన ఉద్దేశం. అలా పక్కకు సేకరించిన నీటిని పైపుల ద్వారా మళ్లించి శుద్ధిచేసి సుదూర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ఆ తర్వాతి కాలంలో ఈ పైపుల సంఖ్యను పెంచారు. థేమ్స్ పునరుజ్జీవ కార్యక్రమంలో దీన్ని తొలి ఘట్టంగా చెప్తారు.

లోకం పోకడ



కడుపుకాలి తిడితే.. 70 ఏండ్ల వృద్ధుడిపై కేసు

సీఎంను దుర్భాషలాడాడని కేసు నమోదు

కేసులు పెట్టాలని ఆదేశించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువు సమీపంలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారి ఇంటి స్థలం కొలతలు తీసుకుంటున్న అధికారులను గత శుక్రవారం కాలనీవాసులు అడ్డుకున్నారు. తాము ఎన్నో ఏండ్లుగా ఇక్కడ గుడిసెలు వేసుకుని, భవనాలు కట్టుకుని జీవిస్తున్నామని అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినా అధికారులు వినలేదు. హైడ్రా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తాము కట్టుకున్న ఇండ్లను కూల్చేస్తుందేమోనని వారు భయంతో ఆందోళనకు గురయ్యారు. ఆ ఆవేదనలో కొందరు కాలనీవాసులు సీఎం రేవంత్‌ను దుర్భాషలాడారు. దీంతో వృద్ధుడు గంగన్నతోపాటు మరికొందరిపై 65(2),5,6, బీఎన్ఎస్ పోక్సో కింద కేసులు నమోదు చేసినట్టు ఆదిలాబాద్ వన్ టౌన్ ఎస్సై ఇసాక్ తెలిపారు.

కేసులు నమోదు చేయండి : మంత్రి పొన్నం

హైడ్రా బాధితుల వీడియోలు, వారి భావోద్వేగాలు, కన్నీటి కథనాలు సోషల్ మీడియాలో ప్రచారం చేసినా, ఆ వీడియోలో పోస్టు చేసినా వెంటనే కేసులు పెడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ గత గురువారం హెచ్చరించారు. వ్యక్తిగత దూషణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను తిట్టకుండా కోర్టులకు వెళ్లాలని, వచ్చే ఎన్నికల్లో బ్యాలెట్ ద్వారా మీ ఆగ్రహం చూపెట్టాలని ఆ వీడియోలో సలహా ఇచ్చారు.

కాంగ్రెస్ మళ్ల గెలిస్తే గుండు కొట్టించుకుంట



కేసీఆర్ పదేండ్ల పాలనలో పేదలు బంగారంలా బతికిండ్రు. గరీబోళ్లకు ఆపదలో ఆదుకుని అన్నం పెట్టి అండగా ఉన్నాడు. కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ అమలు కాకపోగా మా ఇండ్లను కూలగొట్టి పేదల బతుకులు ఆగం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నడు. పేదల ఇండ్లు కూలగొట్టి మా బతుకులు ఆగం చేస్తున్న కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రాదు. వస్తే నేను గుండుకొట్టించుకుని ఊరంతా తిరుగుత.

– బొడిగం గంగన్న, ఖానాపూర్, ఆదిలాబాద్

ప్రభుత్వ వాదన విన్నాకే ఉత్తర్వులు

హైకోర్టు స్పష్టీకరణ, 15న తదుపరి విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం అలియాపూర్ గ్రామంలోని 119/21, 22 సర్వే నంబర్లలో ఉన్న నిర్మాణాలను హైడ్రా కూలగొట్టడంపై డీ లక్ష్మి అనే మహిళ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. హైడ్రా ఏర్పాటుపై ప్రభుత్వ వాదన వినకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పారు. హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటో తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేశారు.

లా అండ్ 'ఆర్డర్' ఎక్కడ?



హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : 'ఇప్పుడు ఆలోచన చేసి.. ఓ మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోకపోతే.. తెలంగాణను మళ్లీ కుక్కలు చింపిన విస్తరి చేస్తారు. శాంతిభద్రతలు అదుపు తప్పుతాయి. రౌడీ మూకలు రాజ్యమేలుతాయి' అని ఎన్నికల సమయంలో కేసీఆర్ చెప్పిన మాటలు నేడు అక్షర సత్యంగా కనిపిస్తున్నాయి. పది నెలల పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పడంతో ఓ డీజీపీ, హైదరాబాద్‌కు ఇద్దరు సీపీ లు మారాల్సి వచ్చింది. అయినా.. మళ్లీ తెలంగాణలో లా అండ్ ఆర్డర్ నిజంగా ఆర్డర్‌లోనే ఉన్నదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఇప్పటికే ఆందోళనలు, నిరసనలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు 'పోలీస్ యాక్ట్'ను ప్రయోగిస్తున్నది. అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనలు, నిరసనలు, సభ లు, సమావేశాలు, పబ్లిక్ మీటింగులు, రాస్తారోకోలు చేస్తే చర్యలు తీసుకుంటామని పో లీసులు హెచ్చరిస్తున్నారు. సిద్దిపేట కమిషనరే ట్, మెదక్ జిల్లా, నిర్మల్ జిల్లా, సంగారెడ్డి వంటి పలు జిల్లాల్లో పోలీసు యాక్ట్ అమల్లో ఉన్న ది. ప్రజా ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఫరిఢవిల్లుతున్నదని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎక్కడికక్కడ ప్రజల హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్యాన్ని బుల్డోజర్లతో ఖూనీ చేస్తున్నదని పౌరసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపక్ష నేతలకు భద్రత కరువు

ఓవైపు పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నదని చెప్తూనే ప్రతిపక్ష నేతల పరామర్శల కార్యక్రమానికి పోలీసులు రక్షణ కల్పించలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష నేతలు, బీఆర్ఎస్ కార్యకర్తలపై ఎక్కడో ఓ చోట కాంగ్రెస్ కార్యకర్తల దౌ ర్జన్యం కనిపిస్తూనే ఉన్నది. శాంతిభద్రతలను పోలీసులే గాలికి వదిలేస్తుంటే.. డీజీపీ, ఏడీజీ ఏం చేస్తున్నారని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.



చాదర్‌ఘాట్ ప్రాంతంలోని శంకర్‌నగర్‌లో అధికారులు కూల్చిన ఇంట్లో బాధితుడు



కూల్చివేత నేపథ్యంలో తన ఇంటి నుంచి భయంభయంగా చూస్తున్న మహిళ



శంకర్‌నగర్‌లో మంగళవారం అధికారులు కూల్చేసిన తన ఇంటిని చూపిస్తూ ఆవేదన చెందుతున్న బాధితురాలు



సైదాబాద్ మండలం చాదర్‌ఘాట్‌లోని శంకర్‌నగర్‌లో ఖాళీ చేయించిన ఇండ్లను మంగళవారం కూల్చుతున్న సిబ్బంది

150 ఇండ్లు నేలమట్టం

- మూసీ ఒడ్డున ఇండ్ల కూల్చివేతలు షురూ
- పేదల ఆక్రందనలు పట్టని రేవంత్ సర్కార్
- పోలీసుల బందోబస్తుతో ఇండ్లు కూల్చివేత
- చిన్న గల్లీల్లోకి రాని బుల్డోజర్లు, జేసీబీలు
- 50 మంది లేబర్లతో ఇండ్లు భూస్థాపితం

హైదరాబాద్ సిటీబ్యూరో/మలక్‌పేట్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): మూసీ నిర్వాసితుల రోదన సీఎం రేవంత్‌రెడ్డి రాతి గుండెను కదిలించలేకపోయింది. అనుకున్నట్టుగానే మూసీ నిర్వాసితుల నివాసాలను కబలించి వారి బతుకులను చీకట్లోకి నెట్టేసే కుట్రకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే హైదరాబాద్‌లో మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ మార్క్ చేసిన ఇండ్లను మంగళవారం కూల్చివేశారు. అడుగడుగునా బాధితులు అడ్డుకునే ప్రయత్నం చేసినా పోలీసుల పహారాలో ఇండ్లను భూస్థాపితం చేశారు. సైదాబాద్ మండలం మూసీ పరివాహక ప్రాంతంలో 150 ఇండ్లను అధికారులు నేలమట్టం చేశారు. కూల్చివేతలు ఇప్పట్లో లేనట్టేనని సన్నాయి నొక్కులు నొక్కినా అధికారులు అందుకు విరుద్ధంగా మూసీలో కూల్చివేతలు ప్రారంభించి నిర్వాసితుల్లో భయాందోళనలు నింపారు. మళ్లీ ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించారు. క్షణక్షణం తమ ఇండ్లను ఎక్కడ కూల్చివేస్తారోనని మిగిలిన నిర్వాసితులు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఇప్పటి వరకు అధికారులు 1,595 నిర్మాణాలను రివర్‌బెడ్‌లో గుర్తించారు. ఇందులో 940 ఇండ్లకు ఆర్‌బీ ఎక్స్ మార్క్ చేసినట్టు ఆర్డీవో మహిపాల్ తెలిపారు. కాగా, మంగళవారం 150 ఇండ్లను మలక్‌పేట ఎమ్మెల్యే సమక్షంలో కూల్చివేసినట్టు అధికారులు తెలిపారు.



చాదర్‌ఘాట్‌లోని శంకర్‌నగర్‌లో ఖాళీ చేయించిన ఇంటిని కూల్చుతున్న సిబ్బంది

గూడు నేలమట్టం

కాయకష్టం చేసుకుని కట్టుకున్న ఇండ్లు అవి. పైసా పైసా పోగుచేసి నిర్మించుకున్న గూళ్లు. పేదోడి బతుకుకు ఆధారంగా నిలిచిన నివాసాలు. ఏండ్ల తరబడి అందులో జీవించిన నిర్వాసితులు. ఏ వరదా వారిని కదిలించలేదు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆ ఇండ్లల్లోనే వారి బతుకు అని అనుకున్నరు. వాటితో పేగు బంధం ఏర్పాటు చేసుకున్నరు. అలాంటిది.. వారి ఇండ్లను వాళ్లే కూల్చుకుంటున్నారని అధికారులు ప్రకటించడం విడ్డూరంగా ఉన్నది. మలక్‌పేట ఎమ్మెల్యే సమక్షంలో నిర్వాసితులు తమ ఇండ్లను కూల్చుకున్నారని అధికారులు చెప్తున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. తమ ఇండ్లను కూల్చొద్దంటూ బాధితులు పెద్దఎత్తున నిరసన చేశారు. వారందరినీ పోలీసులు బెదిరించి అడ్డుకున్నారు. 50 మంది లేబర్లు పెద్దపెద్ద సుత్తెలు, రాడ్లతో ఇండ్లపై దెబ్బలు వేస్తూ పడగొట్టారు. సైదాబాద్ మూసీ పరివాహక ప్రాంతం చిన్న చిన్న గల్లీలు కావడంతో అక్కడికి బుల్డోజర్లు, జేసీబీలు వెళ్లలేకపోయాయి. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేకు వివరించడంతో తాను చూసుకుంటానని అధికారులకు మాటిచ్చి పడగొట్టించారని అధికారులు అంటున్నారు. కాగా, స్థానిక ఎంఐఎం ఎమ్మెల్యేపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తరఫున ఉంటామని మాటలు చెప్పి ఇప్పుడు అధికారులతో కలిసిపోవడం ఏమిటని కొంతమంది మహిళలు నిలదీశారు. మరోవైపు రెడ్ మార్క్ ఉన్న కొన్ని ఇండ్లను కూల్చకుండా బాధితులు అడ్డుకోవడంతో అక్కడి నుంచి అధికారులు నిష్క్రమించారు. బుధవారం గాంధీ జయంతి కావటంతో కూల్చివేతలకు బ్రేక్ ఉండనున్నట్టు సమాచారం. మళ్లీ మిగిలిన రెడ్ మార్క్ ఇండ్లను గురువారం నుంచి కూల్చేందుకు అధికారులు సిద్ధం కానున్నారు.

శంకర్‌నగర్‌లో ఉద్రిక్తత

కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ పాత మలక్‌పేట డివిజన్‌లోని శంకర్‌నగర్‌లోని మూసీ రివర్ బెడ్‌లో పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు చేపట్టిన కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీశాయి. షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, వెస్ట్ మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన కూల్చివేతలు బస్తీవాసులకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి. డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు ఇచ్చి నివాసాలను ఖాళీ చేయించిన అధికారులు మంగళవారం శంకర్‌నగర్‌లో కూల్చివేతలు చేపట్టేందుకు వెళ్లగా శంకర్‌నగర్ బస్తీవాసులు అధికారులను అడ్డుకోవటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

మాతోనే మా ఇండ్లు కూల్చి వేయించారు!

అధికారులు ముందుగా తాత్కాలిక కూల్చివేతలు (లేబర్‌తో ఇంటి పైకప్పులు, దర్వాజలను తొలగింపు పనులు) చేపట్టడంతో తమ సామాన్లు తీసుకునే అవకాశం కల్పించాలని కొందరు బాధితులు అధికారులను కోరటంతో సరేనన్నారు. దాంతో కొందరు పనివాళ్లు కూల్చివేస్తుంటే సామాన్లను తీసుకోగా, కొందరు తామే తీసుకుంటామని, తాము తీసుకున్న తర్వాత కూల్చివేతలు చేపట్టాలని కోరటంతో అధికారులు అవకాశం కల్పించారు. రేకులు, తలుపులు, వాటి ఫ్రేమ్‌లు, కిటికీలు, గ్రిల్స్ తదితర సామగ్రిని బాధితులు తీసుకొని వాహనాల్లో తరలించుకుపోయారు. చెమటోడ్చి.. రూపాయి, రూపాయి పోగేసి ఇండ్లు కట్టుకుంటే తమతోనే తమ ఇండ్లు కూల్చి వేయిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మా ఉసురు తగిలిపోతాడు



నాకు భర్త లేడు. 8 మంది కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నలుగురికి పెండ్లిళ్లు చేసిన. మిగతావారికి చేయాల్సి ఉన్నది. మేమంతా ఒకే ఇంట్లో కలిసి ఉంటున్నం. ఇంట్లో ఐదు గదులు ఉన్నాయి. ఇంత పెద్ద ఇంటిని కూల్చివేసి డబ్బాలాంటి డబుల్ బెడ్రూం ఇచ్చారు. అందులో మేమెలా ఉండేది? వాడికి మా ఉసురు తగిలిపోతాడు.

- ఫాతిమా బీ, శంకర్‌నగర్ బాధితురాలు

మా కుటుంబాన్ని విడదీశాడు



ఇక్కడ మేం 20 ఏండ్ల నుంచి ఉంటున్నాం. మొత్తం ఏడుగురం ఉంటున్నం. ఈ ఇంటిని కూల్చివేసి చంచల్‌గూడలో డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చారు. అందులో సగం మందే పడుతున్నారు. మిగతావారి కోసం ఓ పోర్షన్ అద్దెకు తీసుకున్నాం. కుటుంబాన్ని విడదీశాడు.

- అబ్దుల్ రహీం, శంకర్‌నగర్ బాధితుడు

మార్కింగ్ చేశారు.. ఇల్లు ఇవ్వలేదు



ఈ ఇల్లు మా నాన్న ఇచ్చాడు. నాలుగేండ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. అధికారులు మా ఇంటికి వచ్చి ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు అన్నీ తీసుకున్నారు. ఇల్లు ఇస్తామని చెప్పి ఆర్‌బీ ఎక్స్ అని ఇంట్లో గోడపై మార్కింగ్ చేశారు. కానీ ఇల్లు ఇవ్వలేదు. ఇంటిముందు గోడ కూలింది. దాన్ని సాకుగా చూపి ఇల్లు ఇవ్వటం లేదు.

– అస్మా బేగం, మూసానగర్ బాధితురాలు



అంబర్‌పేట నియోజకవర్గం పరిధి గోల్నాకలో మూసీ నిర్వాసితుల గోడు వింటూ ధైర్యం చెప్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, సుధీర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, పార్టీ నేత కార్తీక్‌రెడ్డి తదితరులు



అధైర్యపడొద్దని, అండగా ఉంటామని అంబర్‌పేట నియోజకవర్గం పరిధి గోల్నాకలో మాట్లాడుతూ మూసీ నిర్వాసిత బాధితులకు భరోసా కల్పిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

తాటాకు చప్పళ్లకు భయపడ



కేటీఆర్ కాన్వాయ్‌పై దాడికి తెగబడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

- గుర్తు పెట్టుకో.. ఇది ఉద్యమ పిడికిలి
- రేవంత్‌రెడ్డికి కేటీఆర్ హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): 'నీ పిల్లి కూతలకు భయపడేటోళ్లు.. నీ తాటాకు చప్పుళ్లకు వణికేటోళ్లు ఎవరూ లేరిక్కడ.. ఉద్యమాల పిడికిలి ఇది.. గుర్తుపెట్టుకో మీ తాట తీసేందుకే వచ్చిన' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. మంగళవారం తన కాన్వాయ్‌పై కాంగ్రెస్ నాయకులు దాడి చేసిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డికి గట్టి వార్నింగ్ ఇచ్చారు. 'బడుగు, బలహీనుల గొంతులను నీ బుల్డోజర్లు తొక్కిపెట్టలేవ్.. గూండా రాజ్యాన్ని, నియంతృత్వ పాలనను సవాల్ చేసే నా స్ఫూర్తిని నీ గూండాలు ఆపలేరు' అంటూ విరుచుకుపడ్డారు. 'నీ గుండాలు నా వాహనంపై చేసిన దాడి నాకు మరింత శక్తినిస్తుంది' అని ఇలాంటి వాటితో తనను ఆపలేరని కేటీఆర్ స్పష్టంచేశారు. 'సీఎంకూల్చిన ఇండ్ల శిథిలాల్లో బాధితులు తమ జీవితాలను వెతుక్కుంటున్నారు. ఇప్పుడు మీ మంత్రులను వచ్చి చెప్పుమనండి.. వీళ్లు కూడా డబ్బులు తీసుకున్నారని! మీరొచ్చి ఆ చిట్టి తల్లులకు చెప్పండి.. మీ ఇండ్లు కూల్చి, మాల్స్ కడుతున్నం, మీ బతుకులు బాగుపడతాయని.. ఇదేనా మీరు చెప్పిన ప్రజాపాలన' అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఎవర్ని ఫూల్ చేస్తున్నారు రాహుల్?

అదానీ, బుల్డోజర్ విషయంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎవరిని ఫూల్ చేస్తున్నారంటూ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ 'అదానీతో ఢిల్లీలో నీది కుస్తీ, దావోస్‌లో రేవంత్ దోస్తీ! ఎవరు రైట్? ఎవరు రాంగ్?' అంటూ నిలదీశారు. 'బుల్డోజర్ రాజ్ యూపీలో తప్పు.. హైదరాబాద్‌లో ఒప్పా?.. ఫిరాయింపులపై హిమాచల్‌లో నీతులు.. తెలంగాణలో గోతులు! ఇలా ఒకే అంశంపై ఒకే వైఖరి ఉండదా మీ దిక్కుమాలిన పార్టీకి? ' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

ప్రజలకు దసరాలా లేకపాయె

'ఢిల్లీకి చక్కర్లు కొడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ గల్లీల్లో తిరిగి చూసే ఓపిక లేదా?' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఒకటి కాదు, రెండు కాదు, మూడు కాదు, ఏకంగా 23 సార్లు హైద్రాబాద్ – ఢిల్లీకి తిరిగారని కానీ గల్లీలో మాత్రం తిరగడం లేదని దుయ్యబట్టారు. ఐదు లక్షలమంది రైతులు రెండు లక్షల రుణమాఫీ కోసం, 67 లక్షల మందికి రైతన్నలు రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నారని, వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంతో 43 లక్షల మంది పత్తి రైతులు దళారుల చేతిలో దగాపడి అల్లాడుతున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 'రైతు వ్యతిరేక పాలన పుణ్యమా? అని ఈ సారి తెలంగాణ ప్రజలకు దసరాలానే లేకపాయె' అంటూ వాపోయారు.

..కాంగ్రెస్ దాడి

మొదటిపేజీ తరువాయి...

గాయపడ్డారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంపై అనుమానాలు కలుగుతున్నాయి.

అంబర్‌పేట కాంగ్రెస్ లీడర్ల పనే!

అంబర్‌పేట నియోజకవర్గంలో మూసీ నిర్వాసిత బాధితులకు మద్దతుగా నిలిచేందుకు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మంగళవారం గోల్నాకలోని న్యూతులసీరాంనగర్(లంక)కు కేటీఆర్ వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తున్న క్రమంలో అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు కాన్వాయ్‌ని వెంబడించారు. అంబర్‌పేట ఛే నంబర్ నుంచి తిలక్‌నగర్, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్, విద్యానగర్ .. హిందీ మహావిద్యాలయ కూడలి నుంచి వీఎస్టీ మీదుగా వెళ్తున్న క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్ తన గ్యాంగ్‌తో కాన్వాయ్‌ని అటకాయించారు. హిందీ మహావిద్యాలయ చౌరస్తాకు రాగానే మూకుమ్మడిగా కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. కేటీఆర్ ఉన్న కారు పైకి ఎక్కి అద్దాలు ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా మరింత రెచ్చిపోయి ఏకంగా కాన్వాయ్ ధ్వంసానికి సిద్ధమయ్యారు. ఈ దాడిలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు గాయపడ్డారు. ముషీరాబాద్ బీఆర్‌ఎస్ నాయకుడు హుస్సేన్‌ను రౌండప్ చేసి కొట్టడంతో అతడి చేతికి గాయాలయ్యాయి. భద్రత కల్పించాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే కాంగ్రెస్ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా దాడికి తెగబడ్డారని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడుతున్నారు. ఈ ఘటనలో పోలీసుల తీరు పలు అనుమానాలకు తావిస్తున్నది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గుంపులుగా వస్తున్నా ఎందుకు అడ్డుకోలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పక్కా ప్లాన్ ప్రకారమే!

దాడికి వెనుక అంబర్‌పేటకు చెందిన కాంగ్రెస్ నాయకుల ప్రమేయం ఉన్నదని.. పక్కా ప్లాన్ ప్రకారం చేశారని బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టంచేస్తున్నారు. కేటీఆర్ మంగళవారం గోల్నాకకు వస్తున్నాడని తెలిసి మోత రోహిత్ అడ్డుకోవాలని ప్లాన్ చేశాడని, మొదట బర్కత్‌పుర, తర్వాత ఫీవర్ హాస్పిటల్ చౌరస్తాలో ప్రయత్నించినా కుదరలేదని, గోల్నాక నుంచి తిరిగి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఇంటికి వెళ్తున్న సమయంలో అడ్డుపడి దాడికి దిగారని చెప్తున్నారు.

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడ్డ హుస్సేన్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం సాయంత్రం నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడికి తెగబడినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

..ఇందిరమ్మ చెప్పిందా?

మొదటిపేజీ తరువాయి...

గద్దెనెక్కిన రేవంత్.. గద్ద లెక్క వచ్చి పేదల ఇండ్లు కూలగొడుతున్నాడని విరుచుకుపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో రూ.16 వేల కోట్లతో మూసీ ప్రక్షాళనకు ప్రణాళికలు రూపొందిస్తే కాంగ్రెస్ పదిరెట్లు పెంచిందని, ఒకేసారి లక్షన్నర కోట్లకు ఎలా పెరిగిందని అడిగితే సమాధానం చెప్పేటోడు లేడని మండిపడ్డారు. కూల్చివేతల విషయంలో హైకోర్టు నిన్ననే చెప్పిందని, ఇండ్లు కూలగొడతామంటే తాము ఊరుకునేది లేదని స్పష్టం చేసిందని, అయినా సిగ్గులేకుండా శంకర్‌నగర్‌లో ఇండ్లు కూలగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'గరీబోళ్ల ఇండ్లను కూల్చుడు కాదు.. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి.. ఆడపిల్లలకు ఇస్తానన్న రూ.2500 ఇవాలి. ముసలోళ్లకు రూ.4 వేలు, రైతులకు రుణమాఫీ, రైతుబంధు కింద రూ.15వేలు ఇవ్వాలి. ఆటో డ్రైవర్ల బోర్డు పెట్టాలి.. దమ్ముంటే గరీబోళ్లకు 2 లక్షల డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టాలి' అని డిమాండ్ చేశారు. బుల్డోజర్లను సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఒక్క కాల్ కొడితే తామంతా వస్తామని చెప్పారు. ఆర్‌బీ-ఎక్స్ పేరిట ఇంటిపై వేసే మార్కింగ్‌ను తుడిచేసి కేసీఆర్ అని రాసుకోవాలని చెప్పారు. 'కేసులకు భయపడొద్దు.. మీపై పెట్టే కేసులకు మేము నిలబడి కొట్లాడుతం' అని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ గూండారాజ్ ఇక చెల్లదు

- నిప్పులు చెరిగిన హరీశ్‌రావు



హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): మూసీ పరీవాహక ప్రాంతాల్లోని బడుగు, బలహీనవర్గాలకు మద్దతు తెలిపి వస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించక తప్పదని బీఆర్‌ఎస్ హెచ్చరించింది. దాడిని మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి సహా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఖండించారు. దాడికి పాల్పడినవారిని అరెస్టు చేసి చట్టప్రకారం శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే దాడులు చేయడమా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ శ్రేణులకు రాహుల్ గాంధీ చెప్పింది ఇదేనా? ప్రతిపక్షాల మీద దాడులు చేయడమేనా ప్రజాపాలన అంటే? ఇదేనా అని ప్రశ్నించారు. కాన్వాయ్‌పై దాడికి తెగబడిన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు కేటీఆర్ వెళ్తే ప్రభుత్వానికి భయమెందుకు? అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడి ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌పై జరుగుతున్న వరుస దాడులు కాంగ్రెస్ పార్టీ అభద్రతా భావాన్ని తెలియజేస్తున్నని చెప్పారు. ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే బదులివ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని, బరితెగింపులకు పాల్పడుతున్నదని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు.

పోలీసుల సమక్షంలోనే దాడి

- మారణాయుధాలతో వచ్చిన కాంగ్రెస్ గూండాలు
- భయపెట్టి పాలించాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నడు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 1 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్‌పై పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ గూండాలు మారణాయుధాలతో దాడికి దిగారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనపై డీజీపీ లేదా సీపీ వెంటనే స్పందించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, ఎమ్మెల్యేలపై వరుసగా దాడులు జరుగుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల దాడులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 50-60 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ట్రాఫిక్ సిగ్నల్‌ను ఆపి కేటీఆర్ కాన్వాయ్‌పై మారణాయుధాలతో దాడికి దిగారని, ఇందుకు పోలీసులు సహకరించారని ఆరోపించారు. కేటీఆర్ కారుపైకి ఓ రౌడీ ఎక్కి అద్దాలు పగులగొట్టేందుకు ప్రయత్నించాడని చెప్పారు. రక్షణగా ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలపైనా దాడిచేశారని, ఈ దాడిలో హుస్సేన్, పవన్ గాయపడ్డారని వివరించారు.

మూడు నెలలుగా వరుస దాడులు

మూడు నెలలుగా బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులపై కాంగ్రెస్ వరుస దాడులు చేస్తున్నదని జగదీశ్‌రెడ్డి తెలిపారు. రేవంత్‌రెడ్డి ఎప్పుడూ కాంగ్రెస్‌తో ఉండే వ్యక్తి కాదని, కాంగ్రెస్‌ను రేవంత్ స్పెషల్ పర్పస్ వెహికిల్‌గా మార్చుకున్నాడని, ఆ పార్టీని పాత నాయకులే రక్షించుకోవాలని చెప్పారు.

కాంగ్రెస్ కార్యకర్తలా ఖమ్మం సీపీ

ఖమ్మం పోలీస్ కమిషనర్ కాంగ్రెస్ కార్యకర్తలా పనిచేస్తున్నారని, తమపైనే దాడిచేసి తమ పార్టీ కార్యకర్తలపైనే కేసులు పెడుతున్నారని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడి జరిగిన ప్రతిచోటా కాంగ్రెస్ వాళ్లే తమవద్దకు వచ్చారని, తాము వారి దగ్గరికి వెళ్లలేదనే విషయాన్ని పోలీసులు, ప్రజలు గుర్తించాలని చెప్పారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దమ్ముంటే మూసీ నిర్వాసితులతో మాట్లాడాలని సవాల్ విసిరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బుల్డోజర్లతో కూల్చుడేనా ప్రజాపాలన?

గ్యారెంటీలపై నిలదీస్తారని.. మూసీని ముందరేసుకున్నరు: మర్రి జనార్దన్‌రెడ్డి ఫైర్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 1: హైడ్రా.. ఒక పెద్ద డ్రామా అని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన అంటే బుల్డోజర్లతో పేదల ఇండ్లను కూల్చడమేనా అని ప్రశ్నించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలన కొనసాగిస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి.. పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను పంపడమేమిటని ప్రశ్నించారు. రేవంత్ సర్కార్ తీరుతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌కు ఓటువేసి తప్పుచేశామని మధనపడుతున్నారని అన్నారు. 15 వేలకోట్లు సంపాదించాలనే కూలదోసుడుకు పూనుకున్నారని ఆరోపించారు.

రజాకార్లతో పోరాడినట్టే.. మూసీ వ్యతిరేకులతో పోరాటం: కోమటిరెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): రజాకార్లు, సీమాంధ్రులతో పోరాడినట్టే, మూసీ వ్యతిరేకులతో నల్లగొండ ప్రజలు పోరాడాల్సి వస్తదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మూసీ మురుగు కారణంగా నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. నల్లగొండ జిల్లా పోరాటాల గడ్డ అని, రజాకార్లు, సీమాంధ్రులతో పోరాడినట్టే నల్లగొండ ప్రజలంతా పోరాటం చేసే రోజు దగ్గర్లోనే ఉన్నదని పేర్కొన్నారు. మంగళవారం ఆయన జూబ్లీహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుతో నల్లగొండ సహా మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రజల ఇబ్బందులు తీరిపోతాయని పేర్కొన్నారు.

గతంలోనే సరిహద్దులు..

గతంలోనే మూసీకి సరిహద్దులు నిర్ధారించారని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2021లో అప్పటి సీఎం సమావేశాలు నిర్వహించి, మూసీకి 50మీటర్ల దూరంలో బఫర్ జోన్‌ను నిర్ణయించారని తెలిపారు.

దసరా బొనాంజా శుభారంభం

- నేటి నుంచి షాపింగ్ ధమాకా!
- అమీర్‌పేట కేఎల్‌ఎం షాపింగ్‌మాల్‌లో ఆరంభం
- ఈ నెల 9 వరకు 50 ఔట్‌లెట్లలో షాపింగ్ కూపన్లు
- దసరా కొనుగోలుదారులకు రోజూ బహుమతులు
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో పదేండ్లుగా పాఠకులు, కస్టమర్లకు మధురానుభూతి



దసరా బొనాంజాను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కేఎల్‌ఎం ఫ్యాషన్ మాల్, స్ట్రాటజీ హెడ్ సీవీ రావు, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ప్రకటనల విభాగం జీఎం ఎన్ సురేందర్‌రావు

అమీర్‌పేట్, అక్టోబర్ 1: దసరా పండుగ వేళ చేసే షాపింగ్‌తోపాటు సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తే బహుమతులను ఇంటికి తీసుకొస్తే..ఆ ఆనందం పండుగ సంతోషాలను రెట్టింపు చేస్తుంది. ప్రతి ఏటా మాదిరిగానే నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికలు సమర్పిస్తున్న దసరా అతిపెద్ద షాపింగ్ బొనాంజా శుభారంభమైంది. ఈ ఏడాది కూడా అంతే ఉత్సాహంతో కొనుగోలుదారుల కలలను నిజం చేసేందుకు మంగళవారం అమీర్‌పేట్‌లోని కేఎల్‌ఎం ఫ్యాషన్ మాల్‌లో కొనుగోలుదారులు, అభిమానుల సమక్షంలో దసరా షాపింగ్ బొనాంజా వైభవంగా ప్రారంభమైంది. జ్యోతి ప్రజ్వలనతో జరిగిన ఈ ఆవిష్కరణలో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికల ప్రకటనల విభాగం జీఎం ఎన్ సురేందర్‌రావు, కేఎల్‌ఎం ఫ్యాషన్ మాల్ స్ట్రాటజీ హెడ్ సీవీ రావు, నమస్తే తెలంగాణ ప్రకటనల విభాగం ఏజీఎంలు పీ రాములు, రాజిరెడ్డి, డిప్యూటీ మేనేజర్ సందీప్ జోషి పాల్గొన్నారు. ఈ బొనాంజకు సంబంధించి నగరంలోని ఎంపిక చేయబడిన ఔట్‌లెట్ల వివరాలతో కూడిన సమాచారం నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే పత్రికల్లో రోజూ ప్రచురితమవుతాయి. ఈ అతిపెద్ద బొనాంజాకు కేఎల్‌ఎం షాపింగ్‌మాల్ మెయిన్ స్పాన్సర్‌గా, పవర్డ్ బై ఆల్మండ్ హౌస్, గిఫ్ట్ స్పాన్సర్‌గా బిగ్ సీ, టీవీ పార్ట్‌నర్‌గా టీ న్యూస్, డిజిటల్ పార్ట్‌నర్‌గా ఎస్ టీవీలు వ్యవహరిస్తున్నాయి. ఈ బొనాంజాకు కున్ హ్యుందయ్, హర్ష టయోటా, ఆరెంజ్ గ్రూప్, మానేపల్లి జువెలర్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) భాగస్వాములుగా ఉన్నాయి.

50 ఔట్‌లెట్లలో గిఫ్ట్ కూపన్లు

ఈ నెల 1 నుంచి 9 వరకు ఎంపికచేసిన ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆటోమొబైల్ కంపెనీలు, టెక్స్‌టైల్, జువెల్లరీ, ప్రొప్రైటరీ వంటి ఎంపిక చేసిన 50 ఔట్‌లెట్లలో కస్టమర్లు చేసే షాపింగ్‌తో బహుమతుల కూపన్లను అందుకోవచ్చు. గత పదేండ్లుగా పాఠకులతోపాటు దసరా షాపింగ్ కొనుగోలుదారులకు రోజూ లక్కీడ్రాలో బహుమతులు గెలుచుకోవడం ద్వారా మరచిపోలేని మధురానుభూతులను పంచుతున్నది. కస్టమర్లు షాపింగ్ తర్వాత తమకు ఇచ్చిన కూపన్లలో వివరాలు పూరించి అక్కడే డ్రాప్ బాక్సులో వాటిని వేయాలి. మరుసటి రోజు లక్కీ డ్రా ద్వారా విజేతలుగా నిలిచే అవకాశం ఉంటుంది. రోజూ లక్కీ డ్రాలో ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేస్తారు. విజేతలు 32 ఇంచుల టీవీ, స్మార్ట్ ఫోన్, గిఫ్ట్ వోచర్లు బహుమతులుగా అందుకుంటారు.

సరసమైన ధరలు.. చక్కటి ఆఫర్లు



నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికల దసరా బొనాంజాకు ఏటా కేఎల్‌ఎం సంస్థ భాగస్వామ్యాన్ని అందిస్తున్నది.ఈ దసరాకు కేఎల్‌ఎం అద్భుతమైన ఆఫర్లతో వస్తున్నాం. సరసమైన ధరలు, చక్కటి ఆఫర్లు, సరికొత్త డిజైన్లు ఉన్నాయి. నగరంలోని 10 కేఎల్‌ఎం ఔట్‌లెట్లలో మా కస్టమర్లకు రోజూ లక్కీ డ్రా ద్వారా బహుమతులను గెలుచుకునే చక్కటి అవకాశాన్ని కల్పిస్తున్నాయి. **- సీవీ రావు, స్ట్రాటజీ హెడ్, కేఎల్‌ఎం ఫ్యాషన్ మాల్**

పదేండ్లుగా మధురానుభూతులు



పదేండ్లుగా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికలు దసరా బొనాంజాను పాఠకుల ముందుకు తీసుకొస్తున్నాయి. ఈ బొనాంజ పాఠకులతోపాటు కొనుగోలుదారులకు మధురానుభూతులను పంచుతున్నది. మాతో కలిసి నడిచే సంస్థలకు వ్యాపారాలను పెంచుకునే అవకాశం, కస్టమర్లకు బహుమతులు దసరా బొనాంజాతో అందుతున్నాయి. నగరంలో ఎంపిక చేసిన 50 ఔట్‌లెట్లలో ఎక్కడ షాపింగ్ చేసినా దసరా బొనాంజా ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

- ఎన్ సురేందర్‌రావు, జీఎం, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ప్రకటనల విభాగం

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

మహా ప్రసాదం

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కొన్నాళ్లుగా వార్తల్లో నలుగుతున్నది. కల్తీ నెయ్యికి సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రేపాయి. అందులో కలవగూడని పదార్థాలు కలిశాయన్నట్టుగా ఆయన మాట్లాడటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్వామివారి భక్తులు ఆందోళనకు గురయ్యారు. లడ్డూ నాణ్యతపై చంద్రబాబు కావాలనే అనుమానాలు కలిగేలా చేశారు. విపక్ష పార్టీని ఇరకాటంలో పెట్టాలనే ఆలోచన బహుశా అందుకు కారణమై ఉంటుంది. మొత్తంగా ఆలయాల నిర్వహణపైనే ఈ సందర్భంగా మౌలిక చర్చ మొదలు కావడం పరాకాష్ఠ. ఈ హడావుడిలో కొందరు ఒకడుగు ముందుకువేసి శుద్ధి కార్యక్రమాల పేరిట హడావుడి చేశారు. అటు కేంద్రంలోని బీజేపీ నాయకత్వం కూడా వివాదంలో దూరిపోయి హంగామా చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో ఆధ్యాత్మికం కన్నా రాజకీయాల పాలే ఎక్కువని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.

ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా లడ్డూ కల్తీపై ఆరోపణలు చేయడాన్ని ఆక్షేపించింది. అసంపూర్తి సమాచారంతో అనుమానాలు రేకెత్తించేలా మాట్లాడి పవిత్రమైన ప్రసాదాన్ని వివాదాల్లోకి లాగడం దురదృష్టకరం. ఓ వైపు తన ఆదేశాల మేరకే దర్యాప్తు జరుగుతుండగా సీఎం స్థాయి వ్యక్తి మీడియా ముందు అదే అంశం గురించి మాట్లాడాల్సిన అవసరం ఏమిటని సుప్రీంకోర్టు నిలదీయడం గమనార్హం. దేవుని చుట్టూ రాజకీయాలు అల్లుకోవడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో లడ్డూకు సంబంధించి స్పష్టత రావడంతో అశేష భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

దేవుడిని, మతాన్ని రాజకీయాల కోసం వాడుకోవడం భక్తుల దృష్టిలో అపచారం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంలో అపమార్గం కూడా. మత విశ్వాసాలను రెచ్చగొట్టి ఓట్లు పిండుకునే ధోరణి ఇటీవలి కాలంలో పెచ్చరిల్లింది. తెలంగాణ ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ధోరణిని అనేక సందర్భాల్లో ఎండగట్టిన సంగతి తెలిసిందే. ఆయన భక్తి విశ్వాసాలు నిండుగా, మెండుగా ఉన్న నిష్ఠాగరిష్టుడు. పూజాదికాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తారు. యజ్ఞయాగాదుల్లో పాల్గొంటారు. యాదాద్రికి పునర్ వైభవ ప్రాప్తికి కర్త, కర్మ, క్రియ కేసీఆరే. కొండగట్టు బృహత్తరమైన అభివృద్ధికి నాంది ప్రస్తావన జరిపారు. ఇంకా అనేక ఇతర ఆలయాల అభివృద్ధికి కృషి చేశారు. ధార్మిక కార్యాలకు ఎప్పుడూ ముందుంటారు. కానీ, ఆయన ఏనాడూ అందుకు సంబంధించిన ప్రచారాన్ని లేశమాత్రం కూడా చేసుకోలేదు. మతాన్ని రాజకీయాలకు వాడుకోలేదు. అభివృద్ధి, సంక్షేమం ఎజెండాగా ముందుకు సాగారు తప్ప భావావేశాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే పనికి ఎన్నడూ పూనుకోలేదు. పరిణత రాజనీతిజ్ఞునిగా దేశానికే ఆదర్శంగా నిలిచారు. గంగ ఒడ్డున చిన్న ఘాట్ కట్టి, దానికి ఇబ్బడి ముబ్బడిగా ప్రచారం చేసుకుంటున్న ఈ కాలంలో అంత ప్రభవంగా యాదగిరి గుట్ట కృష్ణశిలా నిర్మాణాన్ని చేపట్టి కూడా ఎటువంటి ప్రచారం చేసుకోని వ్యక్తి కేసీఆర్. భక్తి వ్యక్తిగతం. దాన్ని రాజకీయం చేయాలని చూస్తే దేవుడు ఊరుకుంటాడా? చంద్రబాబు విషయంలో జరిగింది ఇదే!

గాంధీ స్ఫూర్తికి గ్రహణం..కాంగ్రెస్ హింస రచన




దేశపతి శ్రీనివాస్
ఎమ్మెల్సీ



జి.దేవీప్రసాద్
ఉద్యోగ సంఘాల నాయకులు

> పది నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రజా పాలన మేకప్ పూర్తిగా కరిగిపోయింది. మేక తోలు కప్పుకున్న గుంట నక్కగా ప్రజల ముందు నగ్నంగా నిలిచింది. సత్యం, అహింస ఆయుధాలుగా స్వాతంత్ర్య సమరాన్ని నడిపించిన గాంధీకి వారసులమని రేవంత్‌రెడ్డితో సహా, కాంగ్రెస్ నాయకులు గప్పాలు కొడుతూ గొప్పలు చెప్తుంటారు. సారాంశంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ పరమహంస కాదు, పరమహింస అని చరిత్ర నిరూపిస్తూ వస్తున్నది.



ఎన్నికలకు ముందు ప్రజాస్వామ్యమని, పౌరహక్కులని, భావప్రకటనా స్వేచ్ఛని, ఆంక్షలు లేని పాలనని, కంచెలు లేని భవనాలని, ఆరు గ్యారెంటీలకు తోడుగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ మా ఏడో గ్యారెంటీ అని తెగ ఊదరగొట్టారు. ప్రజాస్వామ్య పాలనకు తాము పూచీగా నిలుస్తామని కాంగ్రెస్ పక్షాన నిలిచిన సోకాల్డ్ సివిల్ సొసైటీ మేధావులు సైతం హామీ ఇచ్చారు. ప్రశ్నించే గొంతుకలకు స్వేచ్ఛ ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లినట్లని గంభీరమైన ఉపన్యాసాలు ఇచ్చారు. కాంగ్రెస్ తోవ తప్పితే దాన్ని తోవలో పెట్టే బాధ్యత తమదని వాగ్దానం చేశారు. పది నెలల పరిపాలన తర్వాత కాంగ్రెస్ ఒక బుల్డోజర్‌గా అవతరించింది. బీజేపీ బ్రాండ్ బుల్డోజర్‌ను సొంతం చేసుకున్న రేవంత్ పేద ప్రజల ఇండ్లు కూల్చే పనిని కసిగా కొనసాగిస్తున్నాడు. మొహబ్బత్ కీ దుకాన్ తెరువలేదు గానీ పేద, మధ్య తరగతి ప్రజల మకాన్‌కే ఎసరు పెట్టాడు. మూసీలో ఇప్పుడు పారుతున్నది మురుగు నీరు కాదు, పేద ప్రజల గుండె మంటలతో మరిగిన కన్నీరు పారుతున్నది. ఆదుకునే దిక్కు కోసం హైడ్రా బాధితులు, మూసీ నిర్వాసితులు తెలంగాణ భవన్‌కు తరలివచ్చారు. తమ గూడు చెదిరిన గోడు వెళ్లబోసుకున్నారు.

చట్టబద్ధంగా నడుచుకోవాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి చట్టాన్ని చట్టుబండలు చేస్తుంటే, పేద, మధ్య తరగతి ప్రజల బతుకులను నడి రోడ్డున పడేస్తుంటే ప్రధాన ప్రతిపక్షం చూస్తూ ఉండలేదు కదా. ప్రజలిచ్చిన బాధ్యతను నెరవేర్చేందుకు కేటీఆర్, హరీశ్‌లు నిర్వాసితులకు అండగా నిలిచారు. ఈ పరిణామం బాధితులకు కొండంత ధైర్యాన్నిచ్చింది. గులాబీ జెండా అండగా రావడంతో బాధితుల పిడికిళ్లు మరింత బలంగా బిగుసుకున్నాయి. కాంగ్రెస్ దాష్టీకానికి వ్యతిరేకంగా వారి గళాలు మరింత పదునుగా విచ్చుకున్నాయి. హైడ్రాకు జై కొట్టిన కాంగ్రెస్ అనుకూల మీడియా సైతం ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమైందని రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి హెచ్చరికలు జారీచేసి అప్రమత్తం చేయాల్సిన అగత్యం ఏర్పడింది.

> **సహజంగానే ఈ పరిణామం రేవంత్ రెడ్డిలో ఉక్రోషాన్ని పెంచింది. రేవంత్ రెడ్డికి ఉక్రోషం పెరిగినప్పుడల్లా ప్రతిపక్షం మీద దాడులు చేయించడం పరిపాటిగా మారింది. దానికి కొనసాగింపే నిన్న కేటీఆర్ మీద జరిగిన అప్రజాస్వామిక, దుర్మార్గ దాడి.**

పత్రికా సమావేశాల్లో కేటీఆర్, హరీశ్‌రావు వేస్తున్న పదునైన ప్రశ్నలు కాంగ్రెస్ నేతల గుండెల్లో బాకుల్లా దిగుతున్నాయి. మూసీ సుందరీకరణ అనే అందమైన పేరుతో ప్రజాధనాన్ని కొల్లగొట్టే కాంగ్రెస్ దురాలోచనకు హరీశ్‌రావు, కేటీఆర్ ఇద్దరూ అడ్డంకిగా మారారు. ఈ క్రమంలో వారు బాధితులను ప్రత్యక్షంగా కలుసుకొని, పిడికిలి బిగిస్తే కాంగ్రెస్ పునాదుల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. ఆర్థిక వనరులు అందించే అవినీతి పథకానికి ద్వారాలు మూసుకుపోతున్నాయి. దీంతో రేవంత్‌రెడ్డికి కోపం నషాళానికంటింది. ఇంకేముంది.. మరో భౌతికదాడికి కనుసైగ చేశాడు. రౌడీ మూకలు కేటీఆర్ మీద దాడికి తెగపడ్డాయి. సాకులు వేరే చూపించవచ్చు. ఆర్థిక దోపిడికి వచ్చిన ఆటంకమే అసలు కారణం.

మొన్న వరదలు వచ్చినప్పుడు ప్రజలను ఆదుకోవడంలో కాంగ్రెస్ దారుణంగా విఫలమైంది. ఓట్లు వేసిన పాపానికి మాకిదా శిక్ష అని బాధితులు కోపాన్ని వెళ్లగక్కారు. సీఎం పర్యటన నిండా ఛీత్కారాలే ఎదురయ్యాయి. అదే సమయంలో పరామర్శించడానికి వచ్చిన హరీశ్‌ను ప్రజలు గుండెకు హత్తుకున్నారు. తమ గుండె కోతను వినిపించారు. తమను ఆదుకోవడంలో నేరపూరిత నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన కాంగ్రెస్ మీద నిప్పులు కక్కారు. ప్రజల నుంచి తిరుగుబాటు వేడి, ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రశ్నల వాడి రెండింటికీ జవాబు చెప్పలేక రేవంత్ అప్పుడు కూడా దాడినే ఎన్నుకున్నాడు. హరీశ్‌రావు కారు మీద రాళ్లు వేయించాడు.

> **బానెట్ మీద బండలు వేయించాడు. కాంగ్రెస్ మూక దాడిలో బీఆర్ఎస్ కార్యకర్త కాలు చితికిపోయిన దుస్థితి. రుణమాఫీ నిజానిజాలు తేల్చడానికి ముఖ్యమంత్రి సొంత ఊరు కొండారెడ్డిపల్లికి పోయిన మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ అల్లరి మూకలు అసభ్యకరంగా దాడి చేశాయి.**

కొండా సురేఖ మెడలో రఘునందర్ రావు నూలు దండ వేస్తున్న ఫొటోపై సోషల్ మీడియాలో అవాంఛనీయమైన వ్యాఖ్య చేసిన ఘటనను బీఆర్ఎస్ నాయకత్వం ఖండించింది. ఇది నిజంగా గర్హనీయం. రాజకీయాల్లో జెండర్ సెన్సిటివిటీ లోపించడం శోచనీయం. ఇద్దరు నాయకుల సన్మాన సంఘటనపై వికృతంగా వ్యాఖ్యలు చేయడం మానసిక వైకల్యమే. ఎవరో సరైన చైతన్యం లేని ఒక వ్యక్తి ఆ తప్పుడు పనికి పాల్పడ్డాడు. దానికి చింతిస్తున్నామని హరీశ్‌రావు బహిరంగంగా తన ఆవేదన వ్యక్తం చేశాడు. సురేఖ ఆవేదన పట్ల ఒక సోదరుడిగా సానుభూతిగా స్పందించాడు. ఇలాంటి వికృత ధోరణులను బీఆర్ఎస్ అంగీకరించదు. సభ్యత ఉన్న వ్యక్తులెవరైనా దీన్ని గర్హిస్తారు. కేటీఆర్ మీద కాంగ్రెస్ దాడికి తెగబడటం వెనుక కారణం మాత్రం మూసీ నిర్వాసితుల పట్ల కేటీఆర్ తీసుకున్న కచ్చితమైన వైఖరే. ఈ దాడి ద్వారా హైడ్రా, మూసీ నిర్వాసితుల కోసం గట్టిగా నిలబడే నాయకుల మనో నిబ్బరాన్ని దెబ్బకొట్టాలనేది రేవంత్ అసలు పన్నాగం. అంతిమంగా ప్రజా పాలన, ప్రజా పీడనగా మారి ప్రశ్నించే వారి మీద భౌతికదాడులు జరిపే విష సంస్కృతికి కాంగ్రెస్ తెరలేపింది. బీఆర్ఎస్ పరిపాలనలో బండి సంజయ్ నుంచి రేవంత్‌రెడ్డి దాకా 'పాదాల మీద నడిచే యాత్ర'లు ఎన్నో చేశారు. బీఆర్ఎస్ ఏనాడూ దాడులు చేసే ప్రయత్నం చేయలేదు. దానివల్ల ప్రతిపక్షాలు స్వేచ్ఛగా తమ కార్యక్రమాలు జరుపుకొన్నాయి.

ఇవ్వాళ ప్రశ్నించేవారి మీద కాంగ్రెస్ మూక దాడులకు పాల్పడుతున్నది. ఇదిట్లనే కొనసాగితే తెలంగాణలో ఫ్యాక్షనిస్టు తరహా వాతావరణం వ్యాపించే ప్రమాదం ఉన్నది. ప్రశ్నలను రాజకీయంగా ఎదుర్కోవాలి. సంయమనంతో సమస్యల పరిష్కారానికి పూనుకోవాలి. కానీ, అందుకు భిన్నంగా ప్రతిదానికి ఒక ఘర్షణ వాతావరణాన్ని సృష్టించే ఎత్తుగడను కాంగ్రెస్ అనుసరిస్తున్నది. ఇది తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు తెచ్చిన మార్పు. ఆరు గ్యారెంటీలను తీర్చలేని అసహాయత ప్రజల మీద అణచివేతగా పరిణమిస్తున్నది. కుదిరితే డైవర్షన్, కుదరనప్పుడు మూక దాడి అనే పద్ధతిని కాంగ్రెస్ అనుసరిస్తున్నది. ఈ పద్ధతి చాలా తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది.

> **సమైక్య పాలనలో ప్రజా వ్యవస్థలు దారుణంగా విఫలం కావడం వల్ల హింసాయుత ప్రతిఘటనలు చెలరేగాయి. హింస, ప్రతిహింసలతో తెలంగాణ గ్రామాలు అట్టుడికిపోయాయి. ప్రజలు నైరాశ్యంలోకి మళ్లుతున్న సందర్భంలో అహింసను ఎంచుకున్న తెలంగాణ పోరాటం ప్రజలను ఆకర్షించింది. ప్రజా వ్యవస్థలపై విశ్వాసాన్ని పాదుకొల్పే ప్రయత్నం చేసింది.**

ఎన్నికలను, అసెంబ్లీని, పార్లమెంట్‌ను ఉపయోగించుకుంటూ ఉద్యమాన్ని నడిపింది. గాంధేయవాదంతో అహింసా మార్గంలో శాంతియుత పంథాలో కూడా ఫలితాలు సాధించవచ్చని తెలంగాణ ఉద్యమం నిరూపించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యవస్థలను ప్రశ్నార్థకం చేస్తూ ప్రధాన ప్రతిపక్షం మీదనే హింసాయుత దాడులకు తెగబడితే తెలంగాణ తిరిగి సంక్షోభంలోకి పోతుంది. హింస, ప్రతి హింసల వాతావరణం తిరిగి చుట్టు ముడుతుంది. దానికి రేవంత్ సర్కారే బాధ్యత వహించాల్సి వస్తుంది. అవాంఛనీయ దుష్పరిణామాలు తలెత్తకముందే తెలంగాణ సమాజం మేల్కొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి. గాంధీ జయంతి స్ఫూర్తితో సకలజనులు అందుకు పూనుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

> **గాంధేయవాదంతో అహింసా మార్గంలో శాంతియుత పంథాలో కూడా ఫలితాలు సాధించవచ్చని తెలంగాణ ఉద్యమం నిరూపించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యవస్థలను ప్రశ్నార్థకం చేస్తూ ప్రధాన ప్రతిపక్షం మీదనే హింసాయుత దాడులకు తెగబడితే తెలంగాణ తిరిగి సంక్షోభంలోకి పోతుంది.**

మరో తుర్క్‌మెన్ గేట్‌గా హైడ్రాబాద్!



డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

మిన్ను విరిగి మీద పడ్డట్టు హైడ్రా డైనోజార్లు అమాయక పేద ప్రజల ఇళ్లపై విరుచుకపడ్డాయి. సినిమాల్లో గ్రాఫిక్‌లను తలదన్నేలా పేద మధ్యతరగతి గుడిసెలు, పాకలు, ఇండ్లు కండ్ల ముందే నేలమట్టమయ్యాయి. బుచ్చమ్మ బుగులుతో ఉరి వేసుకుని భూమిలో కలిసిపోయింది. గుండె చెదిరి, గూడు చెదిరి వీధుల పాలైన కష్టజీవుల కన్నీటి సన్నివేశాలకు, ఎప్పుడు ఏ ఇంటి మీద పిడుగు పడుతుందో తెలియని భీతావహ వాతావరణానికి మూగ సాక్షిగా నిలిచింది మన మహా నగరం హైదరాబాద్. కాదు కాదు, 'హైడ్రా' బాద్. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ బాధితులు తెలంగాణ భవన్ బాట పట్టడం, వారి తరపున బీఆర్ఎస్ ఉద్యమాన్ని చేపట్టడం, సమాజం యావత్తు ఇది అన్యాయమని ఎలుగెత్తడంతో ప్రభుత్వం నాలుక కరుచుకున్నది.



మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం విసిరిన హైడ్రా పాచిక పారింది. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేక ప్రజలు సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక సతమతమైన దుస్థితి నుంచి హైడ్రా పుణ్యమాని కొంత సేదతీర గలిగింది. అతివృష్టి, వరదలు, విష జ్వరాలు, పంట నష్టం, అకాల మరణాల వంటి ప్రధాన తక్షణ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడంలో కొంతమేర సఫలమైంది. చెరువులు, నాలాల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు వంటి అంశాల్లో ప్రభుత్వాలు చర్యలు చేపడితే అందుకు ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయలోపం, యంత్రాంగం అలసత్వం, అవినీతి అధికారుల ధనాపేక్ష వల్ల ఏర్పడిన ఈ సమస్య సామాన్య ప్రజల పాలిట శాపంగా మారకూడదు. స్థలం రిజిస్ట్రేషన్, భవన నిర్మాణ అనుమతులు, ఇంటి నెంబర్లు, ఆస్తి పన్ను, కరెంటు, మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, చెత్త సేకరణ ఇవన్నీ ప్రభుత్వ విభాగాలే సమకూర్చి నిర్వహిస్తున్న క్రమంలో ఆ ఇండ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలను రాత్రికిరాత్రి ఆక్రమణలంటూ వీధుల పాలు చేయడం అభ్యంతరకరం, అమానుషం. నిర్వాసితులు, బాధితులు ప్రశ్నిస్తున్నది అదే. పైగా ఇది దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. తక్షణమే పరిష్కారమయ్యే సమస్య కాదు. ఒక దీర్ఘకాలిక ప్రణాళిక చేపట్టి, బాధితులకు తగినంత సమయం ఇచ్చి ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించి, విడతల వారీగా హైడ్రా కార్యక్రమం కొనసాగితే బాగుండేది. కానీ, అలా జరగలేదు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో సంపన్నులు రాజభవనాలు, ఉద్యాన, విలాస మందిరాలను నిర్మించుకున్నారు. మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ భూములనే ప్లాట్లు చేసి, ఇండ్లు కట్టి అమాయకులైన పేద మధ్యతరగతి ప్రజలకు అంటగట్టారు. దీంతో ఆ ప్రజలు దారుణంగా మోసపోయారు. దీనికి ముగింపు పలకాలనుకున్న ప్రభుత్వం ముందుగా తన ప్రతాపాన్ని పెద్ద తలకాయల మీద చూపెడితే సబబుగా ఉ ండేది. కూల్చివేతల వల్ల వారికి పెద్దగా నష్టం కూడా జరిగేది కాదు. పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితి అలా కాదు. వారికి అది జీవన్మరణ సమస్య. ప్రభు త్వం ఈ వాస్తవాన్ని విస్మరించి సామాన్య ప్రజల ఆవాసాలను వరుసగా సెలవు రోజుల్లో సైతం రాత్రిపగలు తేడా లేకుండా గంటల్లోనే కూల్చివేత ప్రక్రియ పూర్తిచేయడం ప్రజాప్రభుత్వం అని చెప్పుకొంటున్నవారు చేయదగిన పనేనా? అని బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. శాపనార్థాలు పెట్టారు. మంత్రులు తమ ప్రజా దర్బారులనుహైడ్రా కూల్చివేత ప్రాంతా ల్లో ముందస్తుగా నిర్వహించారా? ప్రజల గోడు ఏమి టో కనీసం విన్నారా?వారిని ప్రజాభవన్‌కు రమ్మన్నారా? సంబంధిత ప్రజాప్రతినిధులతో చర్చించారా? అని బాధితులు నిలదీస్తే అధికార పార్టీ నేతలు నీళ్లు నమిలారు. నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో ఉన్నప్పటికీ ప్రభుత్వానికి సంబంధించిన అన్నిరకాల అనుమతులు సౌకర్యాల కేటాయింపులు ఉండి ఉంటే వాటిని అలా ఉంచి సావధానంగా నిర్ణయం తీసుకుంటే బాగుండేది. కూలిపోయిన ఇండ్లకు బ్యాంకు కిస్తీలు కట్టే దురవస్థ దాపురించేది కాదు. మిగిలిన పేదలందరికీ డబుల్ బెడ్‌రూంలు కేటాయించిన తర్వాత కూల్చివేత కొనసాగిస్తే ఇంత ప్రతిఘటన వచ్చేదే కాదు.

> **ఇప్పుడు వారికి కేటాయిస్తున్న డబుల్ బెడ్‌రూములు కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కట్టినవే. ఈ 10 నెలల్లో ప్రభుత్వం ఆ దిశగా డబుల్ బెడ్‌రూమ్‌లకు కనీసం ముగ్గు పోయలేదు. తట్టెడు మట్టి తీయలేదు. అలాంటప్పుడు ప్రభుత్వ చర్య వల్ల నిర్వాసితులయ్యే లక్షలాది మంది పేదల గోడు వినేదెవరు? వారందరికీ ఇండ్లు కేటాయించేదెప్పుడు?**

అంగ బలంతో, అర్థ బలంతో ప్రభుత్వాన్ని దారికి తెచ్చుకునే స్థోమత గాని, న్యాయస్థానాలను ఆశ్రయించే తాహతు కానీ సామాన్య ప్రజలకు ఉండవు కదా. ప్రజల నిస్సహాయత, దీనావస్థతో పరాచికాలాడటం ప్రభుత్వానికి క్షేమం కాదు. ఇప్పటికే కూల్చివేతలతో నష్టపోయిన కుటుంబాలకు సమంజసమైన పరిహారం కాలయాపన చేయకుండా చెల్లించడం ప్రభుత్వం కనీస బాధ్యత.

హైదరాబాద్‌కే కాదు, దేశ రాజధాని ఢిల్లీ సహా కలకత్తా, చెన్నై వంటి మహా నగరాలకు నదులు, నాలాల సమస్య ఉన్నది. ఇతరత్రా పెద్ద పెద్ద నగరాలు సర్వసాధారణంగా నదీ తీరాల్లోనే ఉన్నాయి. ఆక్రమణలు తొలగించమని ఆయా ప్రాంతాల న్యాయస్థానాలు ఆదేశించాయి. కానీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ ప్రభుత్వం లాగా లేడికి లేచిందే పరుగు అన్నట్టు వ్యవహరించలేదు. సావధానంగానే సమస్యను ఉభయతారకంగా పరిష్కరించుకుంటూ పోతున్నాయి. యూపీలో తప్ప ఏ ఇతర రాష్ట్రాల్లో బుల్డోజర్ భూతాలను ఆయా ప్రభుత్వాలు సామాన్య ప్రజల ఇండ్ల మీదికి తోలడం లేదు. నదులు, నాలాలు పొంగడానికి, నీళ్లు రోడ్ల మీదికి ఇండ్లలోకి రావడానికి, కేవలం పేదోళ్ల ఆక్రమణలు మాత్రమే కారణమని అభాండాలు వేసి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరి కాదు. అభ్యంతరకర నిర్మాణాలను కూల్చుకుంటూ పోతే సగం హైదరాబాద్ ఉండదు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న సోమాజిగూడ, బేగంపేట్, రాణిగంజ్ ప్రాంతాల స్వరూపమే మారిపోతుంది. ప్రభుత్వ భవనాల ఉనికి సైతం ప్రశ్నార్థకమవుతుంది. వీటితోపాటు నగరమంతా నరాల లాగా అల్లుకుపోయిన నాలాలను వ్యవస్థీకరించడానికి, నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి. అందుకు ప్రభుత్వం వేసిన ప్రణాళికలెన్ని? కేటాయించిన నిధులు ఎన్ని?

1908లో మూసీనది ఉప్పొంగి బేగంబజార్, చార్మినార్, గౌలిగూడ, చాదర్‌ఘాట్, అంబర్‌పేట్, మలక్‌పేట్ సహా సగం హైదరాబాద్ మునిగిపోయినప్పుడు నాటి నిజాం ప్రభువు ఆయా ప్రాంతాల ప్రజల ఇండ్లను కూల్చివేయలేదు. దీర్ఘదృష్టితో ఆలోచించి హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నిర్మించాడు. మూసీనదికి ఇరువైపులా రక్షణ గోడలు కట్టించాడు. వందేండ్ల అవసరాలు తీర్చగలిగే డ్రైనేజీ, వంతెనలు నిర్మించాడు. పరిష్కారమంటే అది. సముద్ర మట్టానికి దిగువగా ఉన్న నెదర్లాండ్స్ సాంకేతిక నిర్మాణ పరిజ్ఞానంతో ముంపు సమస్యను అధిగమించింది. ఇటలీలోని వెనిస్, కేరళలోని అలెప్పీ పట్టణాలు నీళ్లలోనే నిర్మాణమయ్యాయి. ప్రభుత్వం తలచుకుంటే నిర్వాసితులకు న్యాయం చేస్తూనే మూసీ నదిని, చెరువులను, నాలాలను చక్కదిద్దడం అసాధ్యమేమీ కాదు. వాటిని రక్షించడం అంటే తత్సంబంధిత భూభాగాన్ని రక్షించడం ఒక్కటే అనుకుంటోందేమో ప్రభుత్వం. ప్రమాదకరమైన కాలుష్యం గురించి ఆలోచించడం లేదు. బహుళ అంతస్థుల భవనాలకు, బాహుబలి వ్యాపార కేంద్రాలకు అనుమతివ్వడానికి ముందే దీర్ఘకాలిక అవసరాలు తీర్చగలిగే రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుచేస్తే ఈ దుస్థితి దాపురించదు కదా. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం నగర వైశాల్యంలో 30 శాతం రోడ్లు ఉండాలి. అందులో సగం కూడా లేవు. అందుకే ఏటా హైదరాబాద్‌లో వర్ష బీభత్సం.

> **ప్రజల దైనందిన సమస్యలు పరిష్కరించకుండా, ఇచ్చిన హామీలు అమలుచేయకుండా వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి ప్రభుత్వం సరికొత్త ఇంద్రజాల ప్రదర్శనకు తెర లేపిందన్నది స్పష్టం. జనావాసాల తొలగింపు వల్ల నిర్వాసితులయ్యే కుటుంబాలెన్ని? వారి కోసం ఎన్ని ఇండ్లు కట్టాలి? ఎంత ఖర్చవుతుంది?నిధులెట్లా? ఎప్పటిలోగా ఇండ్లు పూర్తవుతాయి వంటి అంశాలు సాకారమైన తర్వాతే, బాధితులకు నచ్చచెప్పి ఒప్పించిన తర్వాతే కూల్చివేత ప్రక్రియ ప్రారంభించి ఉంటే ప్రజామోదం లభించేది.**

బ్యాంకు రుణాలు సహా అన్నిరకాల అనుమతులున్న ఇండ్లను ముట్టుకోకుండా ప్రత్యామ్నాయం ఆలోచిస్తే బాగుండేది. పరిపాలనలో ప్రాధాన్యాలు చాలా ఉంటాయి. అవి ఎంత గొప్పవైనా సామాన్య ప్రజల కనీస అవసరాల తర్వాతే. ప్రభుత్వం ప్రతిష్ఠకు పోకుండా ఇది ఇంతటితో ఆపి పరిష్కారం కోసం సవ్య దిశగా అడుగు వేస్తే మంచిది. న్యాయస్థానాల తలంట్లు సరిపోలేదా. ఇప్పటికైనా అన్ని రాజకీయపక్షాలతో సాంకేతిక నిపుణులతో, మేధావులతో ఒక సమావేశం ఏర్పాటుచేసి ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటే మంచిది. సర్వజనామోదానికి అదొక్కటే మార్గం. లేదంటే ప్రజాగ్రహం చవిచూడక తప్పదు. 1976లో ఎమర్జెన్సీ రోజుల్లో నాటి ప్రధాని గాంధీ, తనయుడు సంజయ్ గాంధీ ప్రేరేపణతో ఢిల్లీలోని తుర్క్‌మెన్ గేట్ ప్రాంతంలో మొగలుల కాలం నుంచి ఉంటున్న ప్రజల నివాసాలను బుల్డోజర్లు నేలమట్టం చేశాయి. ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టమూ జరిగింది. ఆ సంఘటన ప్రభావం 1977 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా ఇందిరాగాంధీ, సంజయ్‌గాంధీ సహా కాంగ్రెస్ ఘోర పరాజయానికి ఒక కారణమైంది. ఇప్పుడు హైదరాబాద్‌ను మరో తుర్క్‌మెన్ గేట్ చేయాలనుకుంటుందా ఈ ప్రభుత్వం?

బతుకమ్మ అంటే నాకు పూల అమరిక అని ఎప్పుడూ అనిపించదు. ఎందుకంటే నాతో పాటే పుట్టి, పెరిగినట్టే ఉంటుంది. దసరా సెలవులకు నా మేనత్తల ఇంటికి పోయినా, పెద్దమ్మల ఇంటికి పోయినా, ఆఖరికి నాకు పెళ్లయినా.. నాతో పాటు అత్తింటికి వచ్చినట్టే అనిపిస్తుంది. మొత్తంగా బతుకమ్మ ఎప్పుడూ నాతోనే ఉన్న భావన. ఈ భావన నాకే కాదు, తెలంగాణలో పుట్టి పెరిగిన ప్రతి ఆడపడుచుకూ ఉంటుంది.

ఒక్కేసి పువ్వేసి చందమామ..



భోజన్నగారి అనసూయ



మాది సదాశివనగర్. నాన్న ఉద్యోగ రీత్యా రామారెడ్డిలో ఉండేవాళ్లం. సెలవులొస్తే చాలు సదాశివనగర్‌కు పోయేటోళ్లం. లేదా మా పెద్దమ్మ వాళ్ల ఊరు కామారెడ్డికి, లేకుంటే పెద్ద మేనత్త ఉండే అడ్లూర్ ఎల్లారెడ్డికి పోయేటోళ్లం. దసరా సెలవుల్లో పెదనాన్న, ముగ్గురు చిన్నాన్నల కుటుంబాలన్నీ ఒక్కగూటికి చేరేవాళ్లం. మేమంతా కలిస్తే ఇల్లంతా సందడే సందడి. మా ఊళ్లో మెయిన్ రోడ్డుకు సత్తే పీర్ దర్గా ఉంటది. ఆ మసీదు మొత్తం అల్లుకున్న జాజిపూల తీగ ఉంటుంది. అక్కడికిపోయి జాజిమొగ్గలు తెంపుకొచ్చిన రోజులు నేనింకా మర్చిపోలేదు.

బతుకమ్మ పేర్చేందుకు గునుగు, తంగేడు పూల కోసం పొలాలు, రోడ్ల వెంబడి తిరిగేవాళ్లం. పొద్దున్న నాలుగు గంటలకే పెదనాన్న స్నానం చేసి, పూజ ముగించుకొని బతుకమ్మ పేర్వడానికి సిద్ధమయ్యేవాడు. అందరం తలో చేయి వేసేవాళ్లం. పళ్లెంలో మొదట ఆంజేపుకాయ తీగ ఆకులను పెట్టి, ఆ తర్వాత రెండు వరుసలు గునుగు పూలు పేర్చి, మూడో వరుస తంగేడు పూలు పేర్చేది. అవి కదలకుండా ఉండేందుకు మధ్యలో తంగేడు, గునుగు ఆకులు పోసేది. దాన్ని పొట్ట నింపుడు, కడుపు నింపుడు అనేవాళ్లం. బతుకమ్మ పేర్చేటప్పుడు పెదనాన్న ఎన్నో విషయాలు చెప్పేవాడు. కానీ, మాకేమో బతుకమ్మ అయిపోంగనే పెరట్లోకి పోయి జామకాయలు తెంపుకొని తినుడుతోనే సరిపోయేది. సాయంత్రం బతుకమ్మ ఆడటానికి పోయేటప్పుడు పచ్చ గోర్మీటి (డిసెంబర్) పూలు పెట్టుకునేవాళ్లం.

ఇక సాయంత్రం మేం (పిల్లలు) మాత్రమే రోజు గుడి దగ్గరికి పోయేది. ఒక ఇత్తడి టిఫిన్ డబ్బాలో అటుకులు పోసి కొద్దిగ నెయ్యి, చెక్కర వేసి కలిపిస్తే రోజూ తీసుకుపోయేది. కనీ, మిగతా దోస్తులు తెచ్చుకున్న ఆహార పదార్థాలు నోరూరించేవి. బాల్యం కాబట్టి ప్రతి చిన్న విషయాన్ని తొందరగానే మరపులోకి నెట్టివేసేది. ఇప్పుడు కొంతమంది తప్ప, మిగతావారు మొదటి, చివరి బతుకమ్మ మాత్రమే పేరుస్తున్నారు. పెద్ద బతుకమ్మ ముందురోజు దాదాపు రాత్రి పన్నెండు వరకు ఇంట్లో అందరం కూర్చొని రెండు మూడడుగుల బతుకమ్మ పేర్చేవాళ్లం. చివరికి శిఖరం పెట్టి, తాళ్లతో కట్టి దేవుడి గది ముందు అలికి, ముగ్గేసి అక్కడ బతుకమ్మను పెట్టి నిద్ర పోయేవాళ్లం. తెల్లారి ఇంకో చిన్న బతుకమ్మ పేర్చేవాళ్లం. సాయంత్రం మళ్లీ పసుపు, కుంకుమ వేసి రెండు బతుకమ్మలను పెద్ద వాకిట్లో పెట్టి ఆడి, పాడి తర్వాత గుడి దగ్గరికి తీసుకుపోయేవాళ్లం. తర్వాత అర్ధరాత్రి వరకు పాటలు పాడేవాళ్లం.

ఇక పాటల విషయానికి వస్తే మా ఇంటి చుట్టుముట్టు ఉన్న అమ్మలక్కలు ఒక్కో పాట గంటన్నర అయినా ఆపకుండా, దమ్ము తీయకుండా పాడేవాళ్లు. చప్పట్ల మధ్య లయబద్ధంగా ఆ పాటలు సాగేవి. అర్ధరాత్రి దాకా బతుకమ్మ ఆడిన తర్వాత అందరం కలిసి కాలువలు, చెరువుల్లో ఆ బతుకమ్మలను 'పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా.. మళ్లొచ్చే ఏడాదికి మళ్లీ రావమ్మా' అంటూ సాగనంపేది. ఇప్పుడైతే ఎవరి సంఘాలు లేదా గుళ్లు, కమ్యూనిటీ హాళ్ల దగ్గరే పెద్ద నీటి కొలనులను ఏర్పాటు చేసుకొని అక్కడే ఆటపాటలతో గౌరమ్మను సాగనంపుతున్నరు. మా చిన్నతనంలో అలా కాదు. అందరం పసుపు, కుంకుమలు 'ఇచ్చుకోవమ్మ వాయినం, పుచ్చుకోవమ్మ వాయినం' అంటూ పరస్పరం స్వీకరించి, తెచ్చుకున్న పిండివంటలు ఒకరికొకరు రుచి చూపించేవాళ్లం. మళ్లీ ఇంటికి చేరుకున్నాక ఆడవాళ్లు ఖాళీ తాంబాళాలతో బతుకమ్మ ఆడేవాళ్లం. బతుకమ్మ పాటలు ఎంత అర్థవంతంగా ఉంటాయో తెలంగాణలోని ప్రతి ఆడబిడ్డకు తెలిసిన విషయమే.

ఆ పాటల్లో నాకే కాదు, అందరికీ చటుక్కున గుర్తొచ్చేది 'ఇద్దరక్క చెల్లెళ్లు ఉయ్యాలో' పాటనే. నాకు బాగా నచ్చిన పాట, నేను మా గల్లీలో తప్పక పాడే పాట...

> **'ఆకాశాన పొయ్యేటి ఉయ్యాలో
> అడవి పక్షుల్లారా ఉయ్యాలో
> ఆకలాయెనే హంస ఉయ్యాలో
> దూపలాయెనే హంస ఉయ్యాలో..'**

ఈ పాట ఎందుకో నాకే కాదు, చాలామంది తెలంగాణ ఆడపడచుల జీవితాలకు దగ్గరగా ఉందని నా ప్రగాఢమైన నమ్మకం.

(నేడు ఎంగిలిపూల బతుకమ్మ)



సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకుంటున్న ఖానాపూర్ వాసులు

మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్‌లో స్థానికుల నిరసనతో వెనుదిరిగిన అధికారులు

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి వచ్చారు. సర్వే బృందాలు పోలీసులతో కలిసి రాగా స్థానికులు వారిని అడ్డుకున్నారు. ఏండ్లు గా తాము ఇక్కడ నివాసం ఉంటున్నామని, ఎట్టి పరిస్థితుల్లో సర్వేను జరగనివ్వబోమని వారు స్పష్టం చేశారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.



గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్1: హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని, పేదల జోలికొస్తే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాల సముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి హైదరాబాద్‌లో తొలుత ఎన్ కన్వెన్షన్ కూల్చివేయడంతో ప్రజల్లో మంచిపేరు వచ్చిందని తెలిపారు.

అన్నీ వాళ్లకు చెప్పి చేయాల్నా?

- హైకమాండ్‌పై ముఖ్యమంత్రి రుసరుస
- క్యాబినెట్ భేటీలో చిటపట
- గత 20న హైడ్రాపై తీవ్ర వాదోపవాదాలు
- ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై వివరణ అడిగిన అధిష్ఠానం
- ఖర్గేకు పరామర్శ నెపంతో ఢిల్లీకి రేవంత్
- హైడ్రాపై సీనియర్లను కలిసి వివరణ



హైదరాబాద్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హైడ్రా కూల్చివేతలపై సొంత పార్టీలోనే వ్యతిరేకత రావడం, తమకే కాకుండా అధిష్ఠానం పెద్దలకు కూడా చెప్పకుండా హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చివేయడంపై తనను ప్రశ్నించిన మంత్రులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. అంతేకాదు, 'అన్నీ అధిష్ఠానానికి చెప్పి చేయాల్నా' అని ధిక్కార స్వరం వినిపించినట్టు సమాచారం. ఈ విషయం కూడా అధిష్ఠానానికి చేరడంతో తీవ్రంగా పరిగణించిన ఢిల్లీ పెద్దలు రేవంత్‌ను పిలిపించినట్టు తెలిసింది. అందుకనే ఆయన ఆగమేఘాల మీద ఢిల్లీ వెళ్లారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. పేదల ఇండ్లను హైడ్రా బుల్డోజర్లతో తొక్కిస్తున్న రేవంత్‌రెడ్డిపై ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితులు శాపనార్థాలు పెడుతుంటే చివరికి సొంత పార్టీ అధిష్ఠానం, మంత్రులు సైతం రేవంత్ చర్యల్ని సమర్థించడం లేదు. ఇందులో భాగంగానే సీఎంను ఢిల్లీకి పిలిచిన కాంగ్రెస్ పెద్దలు స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వగా, ఇక్కడి మంత్రులేమో సీఎంపై మాటల దాడికి దిగినట్టు తెలిసింది. అసలు ఈ హైడ్రా ఎందుకు? ఈ కూల్చివేతలు ఏమిటంటూ నిలదీసినట్టు సమాచారం. ఇప్పటికే ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని ప్రజలు ఆగ్రహంగా ఉంటే, ఇప్పుడు ఈ కూల్చివేతలతో పార్టీ, ప్రభుత్వం ఏం కావాలని నిలదీసినట్టు తెలిసింది. నీ ఒక్కడి వల్ల దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి కూల్చివేతల పార్టీగా పేరొస్తున్నదని, ఇంతవరకు చేసింది చాలని, ఇక ఆపేయాలంటూ వార్నింగ్ ఇచ్చిట్టు తెలిసింది.

క్యాబినెట్‌లోనూ హైడ్రా రచ్చ.. సీఎం వర్సెస్ మంత్రులు

సెప్టెంబర్ 20న ప్రభుత్వం క్యాబినెట్ సమావేశం నిర్వహించింది. దీని ఎజెండా పైకి ఒక విధంగా చెప్పగా లోపల మాత్రం హైడ్రానే ప్రధాన అంశంగా చర్చ జరిగినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డిపై పలువురు సీనియర్ మంత్రులు మాటల దాడికి దిగినట్టు సమాచారం. హైడ్రాపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సై అంటే సై అనేదాకా వెళ్లినట్టుగా సమాచారం. ఉత్తర తెలంగాణకు చెందిన ఓ మంత్రి లేచి అసలు హైడ్రా ఎందుకు?, ఈ కూల్చివేతలు ఎందుకని నిలదీసినట్టు చెప్తున్నారు. త్వరలో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు పెట్టుకొని బుద్ధి ఉన్నవాడెవడైనా పేదల ఇండ్ల కూల్చివేతలు పెట్టుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని, రుణమాఫీ చేయలేదని పార్టీపై, ప్రభుత్వంపై జనాలు పీకల్లోతు కోపంతో ఉన్నారని, ఈ తలనొప్పి సరిపోదన్నట్టు ఈ కూల్చివేతల గోల ఏంటని నిలదీసినట్టు సమాచారం. అసలు ఏ ఉద్దేశంతో హైడ్రాను ఏర్పాటు చేశారు? ఏం చేయదలుచుకున్నారో చెప్పాలని సీఎంను ప్రశ్నించినట్టుగా తెలిసింది. దీనిపై సీఎం స్పందిస్తూ మీరెందుకు అంతలా బాధపడుతున్నారని మంత్రిని ఉద్దేశించి అన్నట్టు చెప్పుకొంటున్నారు. దీనిపై సదరు మంత్రి స్పందిస్తూ 'హైదరాబాద్‌తో నాకు సంబంధం ఉంది. సంబంధం గల మంత్రిని కావడంతో ఈ హైడ్రా గోల ఏందంటూ చాలా మంది నన్ను అడుగుతున్నారు. నేను వాళ్లకు ఏం సమాధానం చెప్పాలో మీరే చెప్పండి' అని ఎదురు ప్రశ్నించినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. పేదోడికి ఇండ్లు ఇచ్చే పార్టీగా పేరున్న కాంగ్రెస్, ఇప్పుడు అదే పేదోడి ఇల్లు కూల్చే పరిస్థితి రావడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారట. ఎలాగూ పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే పరిస్థితిలో లేం, ఉన్న ఇండ్లను కూల్చివేయడం ఏంటని నిలదీసినట్టు తెలిసింది. మీరు ఇలాగే చేస్తే రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వం ఏం కావాలని మంత్రి ప్రశ్నించారట.

రాహుల్ వ్యతిరేకిస్తే.. నువ్వు ఎగదోస్తావా?

కూల్చివేతలు ఎల్లకాలం ప్రజలకు గుర్తుండవని, వచ్చే ఎన్నికల నాటికి అందరూ మర్చిపోతారంటూ రేవంత్ చెప్పడంపై అధిష్ఠానం పెద్దలు మరింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రజలు అంత పిచ్చోళ్లేమీ కాదని, మరి ఇప్పుడు ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పరిస్థితి ఏంటని ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. హైడ్రా కూల్చివేతలకు రాహుల్‌గాంధీ మద్దతు ఉన్నట్టుగా ప్రచారం చేయడంపైనే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ చేస్తున్న బుల్డోజర్ న్యాయాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని, కానీ ఇందుకు పూర్తి విరుద్ధంగా పార్టీ పాలసీకి వ్యతిరేకంగా తెలంగాణలో బుల్డోజర్ కూల్చివేతలు చేయడం ఏంటని నిలదీసినట్టు తెలిసింది. బుల్డోజర్ న్యాయాన్ని వ్యతిరేకిస్తున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలో మాత్రం బుల్డోజర్ వ్యవహారాన్ని సమర్థించినట్టు నీకు ఎవరు చెప్పారని నిలదీసినట్టు సమాచారం. 'ఇదేమైనా ప్రాంతీయ పార్టీనా? కాంగ్రెస్ పార్టీ అని మీకు తెలియదా? అలాంటప్పుడు అన్నీ మాకు చెప్పి చేయాల్నా అనే ప్రశ్న ఎందుకు వేశారు. మీరేమైనా సుప్రీం అనుకుంటున్నారా' అని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

నాకు చెప్పండి.. ఢిల్లీకి మోత ఎందుకు?

మంత్రి ఎదురుదాడితో కంగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సదరు మంత్రిని శాంతింపజేసే ప్రయత్నం చేస్తూ 'ఈ విషయం గురించి మీరు నాతో ఎప్పుడైనా మాట్లాడారా?. ఏదైనా సమస్య ఉంటే నాకు చెప్పండి. అంతేగానీ ఢిల్లీకి ఎందుకు మోస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. కల్పించుకున్న మరో మంత్రి అసలు హైడ్రా గురించి మీరు మాతో ఎప్పుడైనా చర్చించారా? కూల్చివేస్తున్నట్టు చెప్పారా? అసలు హైడ్రా ద్వారా ఈ పని చేస్తే ఏ విధంగా ఉంటుందనే అభిప్రాయాన్నైనా తీసుకున్నారా? మీరు మాతో మాట్లాడనప్పుడు మేము మీకెలా చెబుతాం అని అడ్డం తిరిగినట్టు సమాచారం. ముఖ్యమంత్రిని తొలుత వ్యతిరేకించి ఇప్పుడు మద్దతుగా కనిపించే ఓ దక్షిణ తెలంగాణ మంత్రి స్పందిస్తూ 'మీరు అందరితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటే ఈ సమస్య ఉండేది కాదు కదా, మీరొక్కరే నిర్ణయాలు తీసుకుంటూ ఇప్పుడు వీళ్లను తప్పు పడితే లాభమేంటి' అని అన్నారట. సీఎం మాట్లాడుతూ.. తనతో ఎప్పుడూ మనసు విప్పి మాట్లాడని మీరు.. ఈ రోజు మాట్లాడినట్టుగానే ఎప్పుడూ మాట్లాడొచ్చుగా అని అన్నట్టు తెలిసింది. ఇక్కడేమో తనతో ఏదీ మాట్లాడరని, కానీ అన్ని విషయాలను ఢిల్లీకి మోస్తారని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. తనను వ్యతిరేకిస్తున్న దక్షిణ తెలంగాణకు చెందిన మంత్రి వైపు చూస్తూ రేవంత్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

అన్నీ వాళ్లకు చెప్పి చేయాల్నా?

అన్ని విషయాలను ఢిల్లీకి మోస్తున్నారంటూ మంత్రులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పార్టీకి అధిష్ఠానం ఉంది కాబట్టి ఇక్కడ జరిగే అంశాలను అధిష్ఠానానికి తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉన్నదని, అందుకే అవసరమైన విషయాలను చెప్తామని స్పష్టం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ అధిష్ఠానంపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. 'అన్నీ వాళ్లను అడిగి చేయాల్నా. అన్నీ వాళ్లకు చెప్పే చేయాల్నా. మీరు చెబితే చెప్పుకోండి ఏమైతది? అయ్యేదేం లేదు. వాళ్లు(అధిష్ఠానం) ఏం చేస్తరు? ఏం చేయలేరు?' అని ధిక్కార స్వరం వినిపించడంతో మంత్రులు ఒక్కసారిగా విస్తుపోయినట్టు తెలిసింది. సీఎం వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసిన దక్షిణ తెలంగాణ మంత్రి ఒకరు 'అవును, అన్నీ వాళ్లకు చెప్పాల్సి అవసరం లేదు. కానీ కనీసం ఇక్కడున్న వాళ్లకైనా చెప్పాలి కదా. మాతో అయినా చర్చించాలి కదా. మనం మనం చర్చించుకొని సరైన నిర్ణయం తీసుకుంటే అధిష్ఠానానికి చెప్పాల్సిన అవసరం రాదు. కానీ ఇక్కడ ఏకపక్షంగా తప్పుడు నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుంది' అని గట్టిగానే చెప్పినట్టు తెలిసింది. ఏదైనా ఉంటే నాకు చెప్పండి అంతేగానీ ఇది ఏం బాగాలేదు' అంటూ అధిష్ఠానానికి వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి కటువుగా మాట్లాడినట్టుగా తెలిసింది.

నీ వల్లే ఇతర రాష్ట్రాల్లో పార్టీకి ఇబ్బందులు

హైడ్రాపై క్యాబినెట్ సమావేశంలో జరిగిన రచ్చ, సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలన్నీ అధిష్ఠానానికి చేరినట్టుగా తెలిసింది. దీంతో పాటు హైడ్రా వ్యవహారం రోజు రోజుకి పార్టీకి నష్టం చేస్తుండడం, హైడ్రా బాధితులకు అండగా బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు పర్యటనలు విజయవంతం కావడం, పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాధితులు శాపనార్థాలు పెడుతుండడం, సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం పెరిగిపోవడంతో అధిష్ఠానం పెద్దలు రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టుగా కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దీంతో వెంటనే ఢిల్లీకి రావాల్సిందిగా రేవంత్‌రెడ్డిని ఆదేశించినట్టు తెలిసింది. 'త్వరలోనే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తెలంగాణ మాదిరిగా కూల్చివేస్తదంటూ అక్కడి ప్రత్యర్థి పార్టీలు ప్రచారం చేస్తున్నాయి. వెంటనే హైడ్రాను, కూల్చివేతల్ని ఆపేయండి' అని తీవ్రస్థాయిలో హెచ్చరినట్టు తెలిసింది.

మూసీ కూల్చివేతలపై కోర్టుకెళ్తా


- పైసా తీసుకోకుండా కేసు నడిపిస్తా
- అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తా
- కాంగ్రెస్ నేత మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ తలపెట్టిన కూల్చివేతలపై అధికార కాంగ్రెస్ పార్టీలోనే భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అన్యాయంగా కూల్చివేతలకు దిగితే బాధితుల పక్షాన కోర్టుకెళ్తానని పీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక న్యాయవాదిగా బాధితులపై రూపాయి ఖర్చు వేయకుండా కోర్టులో కేసు వేసి ప్రజలకు అండగా నిలుస్తానని చెప్పారు. మంగళవారం ఆయన కొత్తపేట, చైతన్యపురి డివిజన్లలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, ఆ ప్రాంతవాసులతో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పేందుకు ప్రయత్నించారు. పిల్లాపాపలతో నిశ్చింతగా నిద్రపోవాలని, ఇక్కడి ఇండ్లపై గడ్డపార దిగకుండా తనది గ్యారెంటీ అని చెప్పారు. ఒకవేళ అన్యాయంగా ఇండ్లు కూలగొడితే అధిష్ఠానమే జోక్యం చేసుకుంటుందని, ఈ విషయాన్ని తాను కూడా అధిష్ఠానం దృష్టికి తీసుకుపోయే స్థాయిలో ఉన్నానని పేర్కొన్నారు. మూసీ కూల్చివేతల విషయంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. మూసీకి ఎఫ్టీఎల్, బఫర్ జోన్ నిర్ణయించేందుకు అధికారుల వద్ద ఒక ప్రతిపాదన లేదని, ఏ సంవత్సరం నుంచి మూసీ హద్దులు పరిగణనలోకి తీసుకుంటారనే విషయాన్ని కూడా చెప్పడం లేదని మండిపడ్డారు. నోటీసులు ఇవ్వకుండా, ప్రజల ఆమోదం లేకుండా ఏ నిర్మాణాన్నీ కూల్చడానికి వీల్లేదని తెగేసి చెప్పారు. ఒకవేళ ప్రభుత్వం ఇండ్లను కూల్చాలంటే మన్మోహన్‌సింగ్ హయాంలో తీసుకొచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ విలువకు నాలుగింతల పరిహారం బాధితులకు చెల్లించాల్సిందేనని స్పష్టంచేశారు. మూసీకి ఇరువైపులా రిటైనింగ్‌వాల్స్ నిర్మించి కూడా సుందరీకరణ చేసుకోవచ్చని సూచించారు. నదికి ఇరువైపులా ఇండ్లు ఎక్కువ ఉన్న ప్రాంతాలను కాకుండా, ఖాళీ స్థలాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

300 రోజులు.. 73,495 కోట్ల అప్పు

- రుణాలతోనే నడుస్తున్న రేవంత్ పాలన
- ఆర్బీఐ నుంచి మరో 2,000 కోట్ల అప్పు
- సెప్టెంబర్‌లోనే రూ.4,500 కోట్ల రుణం



హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు రాష్ట్ర ప్రజలపై మరింత రుణభారం మోపుతున్నది. రుణాలతోనే ప్రజాపాలన సాగిస్తున్నది. నిరుడు డిసెంబర్ 7న అధికార పగ్గాలు చేపట్టిన నాటినుంచి నేటివరకు అంటే.. 300 రోజుల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.73,495 కోట్ల అప్పు చేసింది. మంగళవారం ఆర్బీఐ నుంచి మరో రూ.2వేల కోట్ల అప్పు తీసుకున్నది. రూ.1,500 కోట్ల విలువైన ఒక బాండ్‌ను 15 ఏండ్ల కాలానికి, రూ.500 కోట్ల విలువైన బాండ్‌ను 18 ఏండ్ల కాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ)కు జారీచేసి ఈ రుణం పొందింది. ఈ విషయాన్ని ఆర్బీఐ ప్రకటించింది. ఇప్పటివరకు ఒక్క ఆర్బీఐ నుంచే రూ.48,618 కోట్ల అప్పు సమీకరించుకున్నది. సెప్టెంబర్ 3న రూ.2,500 కోట్లు, 10న 1,500 కోట్లు, 17న రూ.500 కోట్లు.. ఇలా నెల వ్యవధిలోనే రూ.4,500 కోట్ల రుణం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మంగళవారం మరో రూ.2వేల కోట్ల అప్పు తీసుకున్నది. ఇలా ప్రతి నెలా రూ.5 వేల నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్ల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి అప్పులు తీసుకుంటున్నది. ఆర్బీఐ నుంచి సేకరించే రుణాలు సరిపోక.. వివిధ కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు ప్రభుత్వం అడ్డగోలుగా గ్యారెంటీలు ఇస్తున్నది. అధికారంలోకి వచ్చిన ఎనిమిదిన్నర నెలల్లోనే రూ.25 వేల కోట్ల మేర గ్యారెంటీలు ఇచ్చింది. అప్పులను ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టు కోసమో, విప్లవాత్మక పథకం కోసమో ఖర్చు చేస్తాయి. కానీ, ఈ ప్రభుత్వం తొమ్మిది నెలల్లో అలాంటిదేమి చేయకపోవడంపై ఆర్థిక నిపుణులు మండిపడుతున్నారు.

షెడ్యూల్ ఇచ్చారు.. జాబితా మరిచారు

- మంగళవారం రాత్రయినా విడుదలకాని డీఎస్సీ అభ్యర్థుల ఫైనల్ లిస్టులు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన కొన్ని గంటల్లోనే స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ అభ్యర్థుల మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో పెడతామని పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. మంగళవారం నుంచే ఎస్‌ఏ, ఎస్జీటీ అభ్యర్థులకు 1:3 మెరిట్ ప్రకారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అన్ని ఏర్పాట్లు చేశామని ఘనంగా ప్రకటించారు. కానీ ఫలితాలు విడుదలై 48 గంటలు దాటినా డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ లిస్ట్ మాత్రం ఇవ్వలేదు. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల విద్యాశాఖ, డీఈవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. షెడ్యూల్ మేరకు సర్టిఫికెట్ల పరిశీలన ఎందుకు చేపట్టడంలేదని ప్రశ్నిస్తున్నారు. అభ్యర్థుల నుంచి ఒత్తిడి రావడంతో మంగళవారం రాత్రి 9 గంటల తర్వాత 1:3 మెరిట్ ప్రకారం ఎస్జీటీ అభ్యర్థుల జాబితా అందుబాటులో ఉంచుతామని చెప్పారు. బుధవారం ఎస్‌ఏ మెరిట్ లిస్ట్ ఆన్‌లైన్‌లో పెడతామని వెల్లడించారు.

ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డు

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' అందజేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (యూడీఏ), ఎల్‌ఆర్‌ఎస్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ధాన్యం కొనుగోళ్లు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలని ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు దసరాలోగా అప్పగించాలని ఆదేశించారు. వరద ప్రభావిత 29 జిల్లాలకు రూ.3 కోట్ల చొప్పున, ఖమ్మం, సూర్యాపేట, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు రూ.ఐదు కోట్ల చొప్పున, మున్సిపాలిటీలకు రూ.కోటి, కార్పొరేషన్లకు రూ.2 కోట్ల చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు.

స్వాతంత్ర్య పోరాట దిక్సూచి మహాత్మాగాంధీ

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): అహింసనే ఆయుధంగా మలచిన సమరయోధుడు, మానవాళికి మానవత్వం నేర్పిన మహనీయుడు మహాత్మాగాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. బుధవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాట దిక్సూచి అని కొనియాడారు. అదేవిధంగా మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను సీఎం రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు.

ఆడబిడ్డలకు శుభాకాంక్షలు

పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ ఫుడ్స్ ధరల సవరణకు కమిటీ

మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఫుడ్స్‌లో వినియోగిస్తున్న ముడిసరుకు ధరల సవరణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీతో కలిసి సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చేపపిల్లల పంపిణీపై గందరగోళం

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): చేప పిల్లల పంపిణీ తేదీపై గందరగోళం నెలకొన్నది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి చేప పిల్లల పంపిణీని ప్రారంభించనున్నట్టు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మత్స్యశాఖ మాత్రం ఈ నెల 4వ తేదీ నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించడం గమనార్హం. దీంతో జిల్లా అధికారులు, రాజకీయ నేతల్లో గందరగోళం నెలకొన్నది. మరోవైపు కేవలం 9 జిల్లాల్లోనే చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ చర్యలు చేపట్టింది. ఆ తర్వాత 19 జిల్లాల్లో చేపట్టనుంది.

పింఛన్ల పెంపుకోసం బీడీ కార్మికుల ర్యాలీ



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను రూ.4,016కు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో బీడీ కార్మికుల ర్యాలీ నిర్వహించారు. పింఛన్లు పెంచకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. - రామారెడ్డి

ఏఈవోలపై డిజిటల్ కత్తి

- క్రాప్‌సర్వే కోసం సర్కారు మొండిపట్టు
- విధుల్లో నిర్లక్ష్యమని ఏఈవోలపై ఉక్కుపాదం

కరీంనగర్, అక్టోబర్ 1 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): డిజిటల్ క్రాప్ సర్వే చేయడం తమ వల్లకాదని రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోలు నెత్తి నోరు మొత్తుకుంటున్నా.. ప్రభుత్వం వారి మాటలను పెడచెవి పెట్టి ఉక్కుపాదం మోపుతున్నది. వారి విజ్ఞప్తులను పక్కనపెట్టి క్రమశిక్షణ చర్యలను చేపడుతున్నది. రాష్ట్రంలో ఉన్న 2,604 మంది ఏఈవోలు ఇప్పటికే 49 రకాల విధులు నిర్వహిస్తూ డిజిటల్ క్రాప్ సర్వే తమకు తలకుమించిన భారమని ముక్తకంఠంతో చెబుతున్నారు. ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం సర్వేలు చేయకుండా విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొంటూ వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారితో 59 మంది ఏఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లాలో 40 మంది ఏఈవోలు యాప్ డౌన్‌లోడ్ చేసుకోలేదని గత నెల 27, 28 తేదీల్లో గైర్హాజరు వేసి ప్రభుత్వానికి పంపించారు. మరికొన్ని జిల్లాల్లోనూ చర్యలకు ఉపక్రమించినట్టుగా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఏఈవోల ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని టీఎన్జీవో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ చెప్పినట్టు తెలుస్తున్నది.

గర్భిణులు, బాలింతలకు కుళ్లిన గుడ్లు

- వాంతులు, వికారంతో తినలేక అవస్థలు
- వారిలో లోపిస్తున్న పోషక విలువలు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): పోషక విలువలు అందించడం కోసం అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలతోపాటు చిన్నారులకు అందించే గుడ్ల సరఫరాలో కాంట్రాక్టర్లు కక్కుర్తి పడుతున్నారు. కుళ్లిన, గడువు ముగిసి పాడైపోయిన గుడ్లను సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా లబ్ధిదారుల్లో పోషక విలువలు లోపించి నీరసించిపోతున్నారు. నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. అసలు దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంఘం రాష్ట్ర నాయకురాలు నల్ల భారతి డిమాండ్ చేస్తున్నారు.

మూసీ బాధితులు ఆందోళన చెందొద్దు

ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

మలక్‌పేట, అక్టోబర్ 1: మూసీనది పరివాహక ప్రాంతం బాధితులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాము అండగా ఉంటామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల చెప్పారు. మంగళవారం ఆయన మూసానగర్, శంకర్‌నగర్‌లోని మూసీ రివర్ బెడ్‌లో ఎమ్మార్డీసీ చేపట్టిన కూల్చివేతల ప్రాంతాల్లో పర్యటించారు. పలువురు బాధితులు తమ గోడును ఎమ్మెల్యేకు వినిపించారు. మూసీ బాధితులందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. పునరావాసం కల్పించిన తర్వాతే నివాసాల తొలగింపు ఉంటుందని పేర్కొన్నారు.

అక్రమ సర్వేపై ఎంఐఎం ఫిర్యాదు

మూసీ నది తీరంలో అక్రమ సర్వే చేస్తున్నారంటూ ఎంఐఎం ప్రతినిధుల బృందం మంగళవారం ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్‌ను కలిసింది. ఎంఐఎం ఎమ్మెల్యేల బృందంతో వెళ్లి మూసీలో నిర్వహించిన అక్రమ సర్వేపై తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు.

పునరావాసం కల్పించండి

పేదలకు పునరావాసం కల్పించాకే మూసీ ప్రక్షాళన చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ బాలమల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లో కలకొండ కాంతయ్య అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడా బాబుల జోలికి పోకుండా పేదలపై ప్రతాపం చూపడం అన్యాయమని మండిపడ్డారు.

కాంగ్రెస్ హామీలకు 300 రోజులు

మొదటిపేజీ తరువాయి...

చూసి ప్రజలు ఆ పార్టీకి ఓట్లేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అక్టోబర్ ఒకటో తేదీనాటికి 300 రోజులైనా హామీలు అమలు కావడం లేదు. పాత ఆర్టీసీ బస్సుల్లో కష్టాల మధ్య మహిళల ఉచిత ప్రయాణం ఒక్కటే అమలవుతున్నది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు అనేక బాలారిష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఈ మూడు మినహా మిగతా హామీలన్నీ అటకెక్కాయి. నిరుపేద మహిళలకు నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, నిరుద్యోగ యువతులకు ఎలక్ట్రిక్ స్కూటర్ల పంపిణీ హామీలపై రేవంత్‌రెడ్డి సర్కారు కనీసం నోరు మెదపడం లేదు. వానకాలం సీజన్ అయిపోయినా రైతుభరోసా ఇవ్వలేదు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ నేటికీ సగం మంది రైతులకు దక్కనేలేదు. పింఛన్లు రూ.రెండువేల నుంచి నాలుగువేలకు, రూ.నాలుగువేల నుంచి ఆరు వేలకు పెంచుడు మాటలకు పరిమితమైంది. మహిళలకు నెలకు రూ.2,500 అందని ద్రాక్షగానే మిగిలింది. మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ మాట నీటిమూటలా మారింది.

42 పేజీలు.. 420 హామీలు

మొత్తం 42 పేజీలతో 420 హామీలతో కాంగ్రెస్ మ్యానిఫెస్టోను రూపొందించింది. అసెంబ్లీ ఎన్నికల ముందు వివిధ వర్గాలను ఆకట్టుకొనేలా హామీలను ప్రకటించింది. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే హామీలు అమలుచేస్తామని మాటిచ్చింది. కానీ, 300 రోజులు అయినా 420 హామీలో కనీసం పది పథకాలు కూడా పట్టాలెక్కలేదు. కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపిందని రైతులు, నిరుద్యోగులు, మహిళలు, ఇతర వర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కుటుంబంలో ఒక్కరికే పింఛన్ అందితే, కుటుంబంలో అర్హులైన ఇద్దరికి పింఛన్ ఇవ్వడంతోపాటు రూ.2 వేలను రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ప్రకటించింది. ఇప్పుడు కొత్తగా పింఛన్లు రాకపోగా పాతవి కూడా సక్రమంగా అందటం లేదని వృద్ధులు, వితంతువులు వాపోతున్నారు. వానకాలం సీజన్ ముగిసిపోతున్నా కేసీఆర్ ఇచ్చిన రూ.10,000 రైతుబంధు నేటికీ అందలేదు. రైతుభరోసా కింద రైతులు, కౌలురైతులకు ఎకరానికి ఇస్తామన్న రూ.15,000పై కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోరు మెదపడం లేదు. వ్యవసాయ కూలీలకు రూ.12,000 ఇచ్చే హామీపై విధివిధానాలైనా రూపొందించారా? అంటే అదీ లేదు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో తమ ఉపాధి దెబ్బతిన్నదని, ఏడాదికి రూ.12 వేలు ఆర్థికసాయం అందిస్తామన్న హామీ ఇంకెప్పుడు అమలుచేస్తారని ఆటోడ్రైవర్లు నిలదీస్తున్నారు.

కాంగ్రెస్ అమలు చేయని ప్రధాన హామీలు..

- మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు కూడా భర్తీ
- ఏటా జూన్ 2 నాటికి అన్నిశాఖల ఖాళీలతో జాబ్ క్యాలెండర్
- సెప్టెంబర్ 17లోపు వివిధ శాఖల్లో ఖాళీ ఉన్న నియామకాల భర్తీ
- ఉపాధి కల్పించే వరకు ప్రతినెలా రూ.4,000 నిరుద్యోగ భృతి
- యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు
- ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు
- ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల నియామకానికి ప్రత్యేక డీఎస్సీ
- ప్రతి విద్యార్థికి ఫ్రీ (ఇంటర్నెట్) వైఫై సౌకర్యం
- ప్రపంచస్థాయి క్రీడావర్సిటీని నెలకొల్పి గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం
- రాష్ట్రంలోని రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ
- రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000 రైతు భరోసా
- వ్యవసాయ కూలీలకు రూ.12,000, వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్.
- రూ.3 లక్షల వరకు వడ్డీలేని పంట రుణాలు
- మూతపడిన చక్కెర కర్మాగాలు తెరిపించడం, పసుపు బోర్డు ఏర్పాటు చేయడం
- నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యమకారులు, ఇల్లు లేనివారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇంటిస్థలంతోపాటు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల సాయం
- తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం
- ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు తక్షణం చెల్లింపు
- అంగన్‌వాడీ టీచర్ల వేతనం రూ.18 వేలకు పెంచి ఈపీఎఫ్ పరిధిలోని తీసుకొనిరావడం
- రవాణా వాహనాలకు సింగిల్ పర్మిట్ విధానం అమలుచేయడం
- ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం
- నెలవారీ పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంపు
- దివ్యాంగుల పింఛన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంపు
- తొలి, మలిదశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరుల కుటుంబాలను గుర్తించికరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.25,000 పింఛన్
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 2వ దశ గొర్రెల పంపిణీ

ఈడీ దాడులపై 'పెద్దల' మౌనమేల?

ఇతర నేతలపై ఈడీ, సీబీఐ కేసులు పెడితే గగ్గోలు పెట్టిన కాంగ్రెస్

- నాడు రాహుల్‌గాంధీని విచారణకు పిలిస్తే దేశవ్యాప్తంగా ఆందోళనలు
- పొంగులేటిపై ఈడీ దాడులు చేసినాస్పందించని పార్టీ అధిష్ఠానం పెద్దలు
- మద్దతుగా నిలవని సీఎం, మంత్రులు
- ప్రభుత్వ, పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వంలో నంబర్-2 ఎవరంటే చాలామంది చెప్పే పేరు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిదే. కర్ణాటకలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పాత్రను తెలంగాణలో పొంగులేటి పోషిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల చేరికలన్నీ పొంగులేటి ఆధ్వర్యంలోనే జరిగాయి. దీనిని బట్టే అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో పొంగులేటి ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. కానీ, పొంగులేటికి కష్టం వస్తే కాంగ్రెస్ పెద్దలు లైట్ తీసుకున్నారు. ఈడీ వరుసగా రెండు రోజులు పొంగులేటి ఇండ్లు, కార్యాలయాలపై దాడులు చేస్తే కనీసం ఢిల్లీ నుంచి ఖండించలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహచర మంత్రులు సైతం ముఖం చాటేసినట్టు స్పష్టంగా అర్థమవుతున్నది. ఈ అంశం ఇప్పుడు అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో చర్చనీయాంశంగా మారింది. ఇతర రాష్ట్రాల్లోని కాంగ్రెస్ నేతలు, ఆప్ వంటి కూటమి నేతలపై ఈడీ, సీబీఐ దాడులు జరిగితే కాంగ్రెస్ అగ్రనేతలు దర్యాప్తు సంస్థలు, కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడతారు. కానీ, పొంగులేటి విషయంలో సైలెంట్‌పై చర్చ జరుగుతున్నది.



దేశమంతటా హడావుడి

నేషనల్ హెరాల్డ్ కేసులో 2022లో సోనియాగాంధీని, రాహుల్‌గాంధీని ఈడీ విచారించినప్పుడు.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు హడావుడి చేశాయి. డీకే శివకుమార్, చిదంబరం, కార్తి చిదంబరం వంటి ఎంతోమంది కాంగ్రెస్ నేతలు, వారి సన్నిహితులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టిన సందర్భాల్లో సైతం కాంగ్రెస్ అగ్రనేతలు స్పందించారు. 2020 జూలైలో నాటి రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ సోదరుడు అగ్రసేన్ గెహ్లాట్ ఇంట్లో ఈడీ సోదాలు జరిగితే, కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా తీవ్రంగా ఖండించారు. ఆమ్‌ఆద్మీపార్టీ, జార్ఖండ్ ముక్తి మోర్చా వంటి నేతలపై దాడుల సందర్భంలోనూ సంఘీభావం ప్రకటించింది. కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో, బయట ధర్నాలు చేసింది. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ అరెస్ట్ సమయంలోనూ కేంద్ర ప్రభుత్వ రాజకీయ కక్షగా రాహుల్‌గాంధీ అభివర్ణించారు.

ప్రభుత్వంలోనూ అంతే..

ఈ ఏడాది ఆగస్టులో అదానీ-సెబీ చైర్పర్సన్ వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, కాంగ్రెస్ నేతలు ఈడీ ఆఫీస్‌కు వెళ్లి ధర్నా చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. అలాంటిది సహచర మంత్రిపై ఈడీ దాడులు జరిగితే సీఎం ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కొందరు మంత్రులు సైతం ఇదే బాటలో మౌనాన్ని ఆశ్రయించడం కూడా చర్చకు దారితీసింది. కాంగ్రెస్ పెద్దలు కావాలనే పొంగులేటిని లైట్ తీసుకున్నారా? అని చర్చించుకుంటున్నారు.

'బతుకమ్మ'ను మరిచిన సర్కార్!

- కనీస ఏర్పాట్లు చేయని ప్రభుత్వం
- నిర్లక్ష్యంపై ఆడబిడ్డల మండిపాటు
- 'కూల్చివేతల సంబురం'లో బతుకమ్మను మరిచారని ఫైర్
- కేవలం శుభాకాంక్షలతో సరిపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ అంటే బతుకమ్మ! బతుకమ్మ అంటే తెలంగాణ! ఈ ప్రాంత ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచి.. ఉద్యమ చైతన్య గీతికై ఎగిసి.. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత ప్రపంచ ఖ్యాతి గాంచిన మన బతుకమ్మ పండుగను కాంగ్రెస్ సర్కార్ మరిచిపోయింది. నేటి ఎంగిలిపూల నుంచి మొదలయ్యే ఆడబిడ్డల అతి పెద్ద వేడుకకు కనీస ఏర్పాట్లు చేయకుండా చిన్నచూపు చూస్తున్నది. ఎన్నికల్లో మహిళలకు అలవిగాని హామీలిచ్చి వారి ఓట్లతో అందల మెక్కి ఇప్పుడు ఆడబిడ్డలు ఘనంగా జరుపుకొనే బతుకమ్మనే పక్కనపెట్టేసింది. 'కూల్చుడు సంబురం'లో పడి 'బతుకమ్మ సంబురాల'ను మరుగున పడేసింది.

- బొడ్డెమ్మ వేడుకపై నిషేధమా?



మహబూబాబాద్ జిల్లా గూడూరులో బొడ్డెమ్మ ఊరేగింపును పోలీసులు అడ్డుకున్నారు. గూడూరు, గొల్లగూడెం, చంద్రుగూడెం గ్రామాలకు చెందిన మహిళలు మంగళవారం బొడ్డెమ్మ నిమజ్జనానికి వాహనాల్లో వెళ్తుండగా ఎస్సై గిరిధర్ అడ్డుకోవడంతో ఫారెస్టు ఆఫీసు వద్ద రోడ్డుపై బైఠాయించారు. అర్ధరాత్రి 11.30 గంటల వరకూ ఆందోళన చేపట్టారు.

నేటి నుంచే బతుకమ్మ సంబురాలు

తెలంగాణ అంతటా నేటి (బుధవారం) నుంచి బతుకమ్మ సంబురాలు మొదలు కానున్నాయి. ఎంగిలిపూల నుంచి సద్దుల బతుకమ్మ దాకా ఇంటింటా పూలసింగిడి పరుచుకోనున్నది. ఊరూవాడా ఆడబిడ్డల ఆటపాటలతో తెలంగాణ అంతా మురిసిపోనున్నది. కానీ, మన రాష్ట్రానికే ప్రత్యేకమైన ఈ పండుగకు రేవంత్‌రెడ్డి సర్కార్ కనీస ఏర్పాట్లు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మాట వరుసకైనా ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి, ఆ శాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇలా ఏ స్థాయిలోనూ బతుకమ్మ పండుగపై సమీక్ష నిర్వహించిన దాఖలాల్లేవు. పండుగ నిర్వహణ కోసం ప్రభుత్వం రూపాయి కూడా విడుదల చేయలేదు. ఆలయాలు, ఊరుమ్మడి స్థలాలు, చెరువు గట్లు విద్యుద్దీపాల అలంకరణతో బతుకమ్మ కాంతులీనుతుంది. ఆయా చోట్ల ఏర్పాట్లపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయలేదు.

కూల్చుడుపైనే శ్రద్ధా?

కాంగ్రెస్ సర్కార్‌కు కూల్చుడు మీద ఉన్న శ్రద్ధ బతుకమ్మ పండుగ మీద లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైడ్రా పేరుతో మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రభుత్వం ఇండ్లను కూల్చి కుప్పపోస్తున్నది. కానీ, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ నిర్వహణ విషయంలో ఏ మాత్రం పట్టింపు లేదని ఆడబిడ్డలు ఆవేదన చెందుతున్నారు. పితృ అమావాస్య ప్రారంభమయ్యే పది రోజుల ముందే ఏర్పాట్లకు సంబంధించిన మొత్తాన్ని గత ప్రభుత్వం విడుదల చేసేది. కానీ, ఇప్పుడు యంత్రాంగం, మంత్రాంగం అంతా హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ చర్యల్లో తలమునకలయ్యాయి. పండుగ ఏర్పాట్లపై సమీక్షించే తీరిక కూడా లేకుండా బిజీ అయ్యాయి.

ఇప్పటికే చీరలు ఎగ్గొట్టి

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ (తెల్లరేషన్‌కార్డు/ఫుడ్‌సెక్యూరిటీ కార్డు ఉన్నవారికి) బతుకమ్మ పండుగకు పది రోజుల ముందే చీరలు పంపిణీ చేసేది. ఏడెనిమిది నెలల ముందు చేనేత కార్మికులకు చీరల తయారీ ఆర్డర్లు ఇచ్చేది. కానీ, ఈసారి చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇవ్వక వారి ఉపాధిని కాంగ్రెస్ సర్కార్ దెబ్బతీసింది. ఆడబిడ్డలకు చీరల పంపిణీ కానుకను ఎత్తగొట్టింది. సీఎం రేవంత్ రెడ్డి కేవలం రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటనతో సరిపెట్టారు. 'బతుకమ్మ పండుగ అంటే కొండంత సంబురం. పండుగకు ముందే కేసీఆర్ కంట్రోల్ షాపులకు ముందే చీరలు పంపేటోడు. షాపోళ్లు అందర్నీ పిలిచి ఇచ్చేటోళ్లు. ఈపాలి ఏదీలేదు. నెత్తికొరిగి కొప్పేత్త..కొప్పుమీద బోనం ఎత్తుత' అన్నట్టే కాంగ్రెసోళ్ల ముచ్చట ఉన్నది' అని నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన వృద్ధురాలు మణెమ్మ కాంగ్రెస్ సర్కార్ తీరును ఒక్కముక్కలో వివరించింది.

మన సాంస్కృతిక జీవన ప్రతీక బతుకమ్మ

- మహిళా సామూహిక శక్తికి.. ఐక్యతకు దర్పణం
- తెలంగాణ ఆడబిడ్డలకు కేసీఆర్ శుభాకాంక్షలు



హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్తిత్వానికీ, సాంస్కృతిక జీవనానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని బీఆర్ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని, పూలను దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ ప్రపంచ సంస్కృతి, సంప్రదాయాల్లోనే ప్రత్యేకతను చాటుకున్నదని తెలిపారు. తరతరాలుగా మహిళా సామూహిక శక్తికి, ఐక్యతకు దర్పణమైన బతుకమ్మ పండుగ, రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని గుర్తుచేశారు. ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దులతో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ సందర్భంగా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఆడబిడ్డలు, పిల్లాపాపలతో ప్రత్యేక సందడి నెలకొంటుందని తెలిపారు. బతుకమ్మ పండుగ విశిష్టతను గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందని వివరించారు. మహిళల ప్రత్యేక పండుగగా గుర్తించి బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక కానుకలను అందజేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగను ఆటపాటలతో, ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని తెలంగాణ ఆడబిడ్డలను కేసీఆర్ కోరారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రకృతిమాత బతుకమ్మ వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ బోగస్!

- 42% బీసీ రిజర్వేషన్ల హామీని అటకెక్కించే కుట్ర
- బీసీలకిచ్చిన ఇతర హామీలు అమలు చేసేదాకా పోరు
- శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి
- అసెంబ్లీ మీడియా హాలులో బీసీ నేతలతో సమాలోచన



హైదరాబాద్, అక్టోబరు 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్.. బోగస్ అని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. శాసనమండలి మీడియా హాలులో మంగళవారం బీసీ నేతలతో సమావేశమై బీసీ డిక్లరేషన్, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు తదితర అంశాలపై ఆయన సమాలోచనలు జరిపారు. అధికారంలోకి రాగానే అన్ని వర్గాలనూ మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, బీసీలనూ వంచించే ఎత్తులు వేస్తున్నదని ధ్వజమెత్తారు. న్యాయస్థానాల తీర్పులు, నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను ఎగ్గొట్టే కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. బీసీలను బోల్తా కొట్టించాలనే కాంగ్రెస్ పార్టీ కుయుక్తులను ఎప్పటికప్పుడు ఎండగట్టి, బీసీలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేదాకా బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జోగు రామన్న, ఎల్ రమణ మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆరు నెలల్లో అమలు చేస్తామని చెప్పి ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని విమర్శించారు. 42% బీసీ రిజర్వేషన్లతోపాటు బీసీలకు కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు ప్రభుత్వం వెంటపడతామని హెచ్చరించారు. సమావేశంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎంపీ బడుగు లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, బూడిద భిక్షమయ్య గౌడ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వీ ప్రకాశ్, జూలూరు గౌరీశంకర్, ఆంజనేయగౌడ్, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, నాగేందర్‌గౌడ్, పుటం పురుషోత్తమరావు, పల్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌కేవీ అభ్యర్థి గెలుపుతో సంబురాల్లో మునిగిపోయిన గులాబీ శ్రేణులు, కార్మికులు



గెలుపొందిన సూర్యప్రకాశ్‌రావును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

- 'సూర్యలత' కాటన్‌మిల్ కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్‌కేవీ అభ్యర్థి గెలుపు
- సీఎం ఇలాకాలో ఐఎన్‌టీయూసీ అభ్యర్థిపై 68 ఓట్ల తేడాతో విజయం
- బీఆర్ఎస్ సంబురాలు.. హాజరైన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తి, అక్టోబర్ 1: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ సమీపంలోని సూర్యలత కాటన్ మిల్ గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బొక్కబోర్లా పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇలాకాలో కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. మంగళవారం జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో హస్తం పార్టీ కార్మిక యూనియన్ ఐఎన్‌టీయూసీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఐఎన్‌టీయూసీ అభ్యర్థి ఆనంద్‌కుమార్‌పై బీఆర్ఎస్‌కేవీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావు 68 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. మిల్లులో మొత్తం 450 మంది కార్మికులకు ఓటు హక్కు ఉండగా.. అందులో 438 మంది ఓటేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్నాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ సాగింది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోలైన ఓట్లను లెక్కించారు. 438 ఓట్లలో బీఆర్ఎస్‌కేవీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావుకు 251 ఓట్లు, ఐఎన్‌టీయూసీ అభ్యర్థి ఆనంద్‌కుమార్‌కు 183 ఓట్లు వచ్చాయి. నాలుగు ఓట్లు చెల్లుబాటు కాలేదు. 68 ఓట్ల తేడాతో బీఆర్ఎస్‌కేవీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావు సూర్యలత స్పిన్నింగ్ మిల్లు గుర్తింపు కార్మిక అధ్యక్షుడిగా ఎన్నికైనట్టు కార్మిక శాఖ అధికారులు ప్రకటించారు.

మిన్నంటిన బీఆర్ఎస్ సంబురాలు

బీఆర్ఎస్‌కేవీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావు గెలుపొందినట్టు కార్మిక శాఖ అధికారులు ప్రకటించిన వెంటనే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు మిన్నంటాయి. కార్మికులు, గులాబీ శ్రేణులు నినాదాలు చేస్తూ, ర్యాలీ నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ పెద్ద ఎత్తున పటాకులు కాల్చారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన సూర్యప్రకాశ్‌రావును మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు అభినందించారు.

ప్రతి ఎన్నికల్లో ఇవే ఫలితాలు : మాజీ ఎమ్మెల్యే జైపాల్

విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కార్మికులను, బీఆర్ఎస్ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి ఫలితాలే వస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను వంచనకు గురిచేసిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో కాంగ్రెస్ పార్టీకి కార్మికులు కర్రుకాల్చి వాతపెట్టారని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాల ప్రజల ఉసురుపోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైందని చెప్పడానికి ఈ ఎన్నికలే నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చారని, అయినా వారు నమ్మలేదని వివరించారు. రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమని జైపాల్ పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను పాతాళంలోకి తొక్కాలని జైపాల్ పిలుపునిచ్చారు.

తెలంగాణ సాధన పోరాటానికి గాంధీ స్ఫూర్తి

గాంధీ జయంతి సందర్భంగా స్మరించుకున్న కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): దేశ స్వాతంత్ర్య సాధన కోసం సాగిన మలి దశ పోరాటాన్ని శాంతియుతంగా నడిపి, గమ్యాన్ని చేరుకున్న జాతిపిత మహాత్మాగాంధీ అందించిన ప్రజాస్వామిక స్ఫూర్తి, తెలంగాణ సాధన కోసం తాను సాగించిన మలిదశ పోరాటంలో ఇమిడి ఉన్నదని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన కృషిని, త్యాగాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. బాధితులకే సహనం ఎక్కువగా ఉండాలని, శాంతియుత మార్గాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే, తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి విజయం సాధించేందుకు మార్గం సుగమం అవుతుందనే గాంధీజీ కార్యాచరణ తన తెలంగాణ ఉద్యమ పంథాను ముందుకు నడిపించిందని తెలిపారు. భారత ప్రజలు మెచ్చేలా శాంతియుతంగా పార్లమెంటరీ పంథాలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అనతికాలంలోనే దేశం గర్వించే దిశగా అభివృద్ధి పథంలో నిలిపిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి వెనుక గాంధీజీ స్ఫూర్తి ఇమిడి ఉన్నదని వివరించారు.

సద్దుల బతుకమ్మను సెలవుగా ప్రకటించాలి

టీఎస్ సెక్రటేరియట్ అసోసియేషన్

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): మహిళలు పవిత్రంగా జరుపుకొనే సద్దుల బతుకమ్మను ప్రభుత్వం అధికారిక సెలవుగా ప్రకటించాలని తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) కోరింది. వారు మంగళవారం సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 10న(గురువారం) ఐచ్ఛిక సెలవుగా కాకుండా, అధికారిక సెలవుగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూళ్లకు దసరా సెలవులు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు బుధవారం నుంచి దసరా సెలవులు ప్రకటించారు. మంగళవారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 14 (సోమవారం) వరకు సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు విధిగా ఉత్తర్వులను పాటించాలని సూచించారు.

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు.

దీక్ష కేవలం లడ్డూ కోసమే కాదు..

ప్రాయశ్చిత్త దీక్ష లడ్డూ కోసమే కాదని, శాశ్వత పరిష్కారం కోసం చేపట్టానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. దీక్ష విరమణ కోసం తిరుమలకు బయల్దేరిన ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. కాగా, 'కొత్త భక్తుడికి పంగనామాలెక్కువ!.. కదా?.. ఇక చాలు.. ప్రజల కోసం చెయ్యవలసిన పనులు చూడండి' అంటూ నటుడు ప్రకాశ్‌రాజ్ సెటైర్ వేశారు.

హైదరాబాద్‌లో డీజేలపై నిషేధం

- ర్యాలీల్లో ఫైర్ క్రాకర్స్‌పైనా బ్యాన్
- హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు
- ఉల్లంఘిస్తే ఐదేండ్ల జైలు, రూ.లక్ష జరిమానా



హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో డీజేలు, ఫైర్‌క్రాకర్స్‌పై పోలీసులు నిషేధం విధించారు. శబ్దకాలుష్యానికి కారణం అవుతున్నందున వాటిని నిషేధిస్తూ హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీజేలు, ఫైర్ క్రాకర్స్‌పై డయల్ 100కు ఫిర్యాదులు రావటంతో నగరంలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, మతపెద్దలతో ఇటీవల సీవీ ఆనంద్ సమావేశం నిర్వహించి, అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో డీజేలు, సౌండ్ మిక్సర్లు, హై సౌండ్ ఎక్విప్‌మెంట్ పరికరాలపై నిషేధాజ్ఞలు విధిస్తున్నట్టు ప్రకటించారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంట ల వరకు ఈ నిషే ధం అమల్లో ఉం టుందని స్పష్టంచేశారు. అనుమతి ఉన్న ప్రాంతాల్లో తక్కువ శబ్దంతో అనుమతించనున్నారు. దవాఖానలు, స్కూళ్లు, కాలేజీలు, కోర్టు ప్రాంగణాలకు 100 మీటర్ల దూరం వరకు డీజేపై నిషేధం అమలులో ఉంటుంది. మతపరమైన ర్యాలీల్లో ఎలాంటి డీజేను వాడకూడదు. సౌండ్ సిస్టంను పరిమిత స్థాయిలో అనుమతిస్తారు. సౌండ్ సిస్టమ్ పెట్టడానికీ పోలీస్ క్లియరెన్స్ ఉండాలి. అటు.. నాలుగుజోన్లలో సౌండ్ సిస్టం జనావాసా ల ప్రాంతంలో ఉదయం 55 డెసిబుల్స్, రాత్రివేళల్లో 45 డెసిబుల్స్‌కు మించకూడదు. మతపరమైన ర్యాలీల్లో బాణాసంచా కాల్చడం పూర్తిగా నిషేధం. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐదేండ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారు. పదేపదే ఉల్లంఘిస్తే ప్రతి రోజు రూ.5 వేల ఫైన్ వేస్తారు.

ఎస్సీ గురుకుల సొసైటీ అదనపు కార్యదర్శిపై వేటు!

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ సొసైటీ అదనపు కార్యదర్శి హన్మంత్ నాయక్‌పై ప్రభుత్వం వేటు వేసింది. సచివాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఇటీవల సొసైటీలో జరిగిన బదిలీలు, పదోన్నతులు వివాదాస్పదమవడంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నట్టు తెలుస్తున్నది. హన్మంత్‌నాయక్ ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కాగా, డిప్యూటేషన్‌పై గురుకుల సొసైటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. అడ్మినిస్ట్రేషన్, టెండర్లు తదితర కీలక విభాగాలన్నీ ఆయనే పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల బదిలీలు, పదోన్నతులు వివాదాస్పదంగా మారాయి. ఆయనపై ఆరోపణలు చేస్తూ ఏకంగా పలు సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి, పలు సమీక్షా సమావేశాల సందర్భంగా డిప్యూటీ సీఎం హన్మంత్ నాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అడ్మిషన్లపై కూడా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఆయనపై గుర్రుగా ఉన్నారట. సీట్లు ఖాళీగా ఉన్నా ఇవ్వడం లేదని ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో హన్మంత్ నాయక్‌పై వేటు పడిందని సొసైటీలో చర్చించుకుంటున్నారు.

రుణమాఫీ పూర్తికాలె

- ప్రక్రియ కొనసా..గుతూనే ఉన్నది
- కుటుంబ నిర్ధారణ చేస్తూనే ఉన్నాం
- 2లక్షల పైన ఉన్న రైతులకు షెడ్యూలు ఇస్తాం
- మీడియా సాక్షిగా మంత్రి తుమ్మల ప్రకటన



హైదరాబాద్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ):'భూమి ఉండి, రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తున్నాం...' ఇదీ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట. మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల రుణమాఫీ వివరాలు వెల్లడిస్తూనే.. రుణమాఫీ ప్ర క్రియ ఇంకా పూర్తి కాలేదని, ప్రక్రియ కొనసాగుతూనే ఉంటదని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలతో గత ఐదేండ్లుగా పంట రుణం తీసుకున్న 42లక్షల మంది రైతుల వివరాలను బ్యాంక ర్లు ప్రభుత్వానికి అందించారని చెప్పారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రాష్ట్రంలో భూమి ఉండి రుణాలు తీసుకున్న రైతుల సం ఖ్య 60 లక్షలుగా ఉన్నట్టు గతంలో స్వయం గా వెల్లడించారు. ఒకవేళ మంత్రి తుమ్మల చెప్పినట్టుగా 42 లక్షల మంది రైతుల వివరాలు బ్యాంకులు అందిస్తే ఆగస్టు 15లోపు 31వేల కోట్లు రుణమాఫీ కావాలి. కానీ కఠిన నిబంధనలు పెట్టి సుమారు 20 లక్షల మంది రైతులను రుణమాఫీకి దూరం చేసిందనే వాస్తవాన్ని కప్పిపుచ్చారు. మిగిలిన రైతులకు ఎప్పటివరకు మాఫీ చేస్తారో చెప్పకపోవడం గమనార్హం. 2 లక్షల లోపు రుణమాఫీలో ఇంకా 4 లక్షల మందికి కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉండగా 3.5 లక్షల మందికి కుటుంబ నిర్ధారణ జరిగినట్టు తెలిపారు. ఇక రూ. 2 లక్షలకు పైగా రుణమాఫీపై 'తాము షెడ్యూల్ ప్రకటిస్తామని, అప్పుడు 2లక్షలకు పైగా రుణం చెల్లిస్తే.. 2లక్షలు వారి ఖాతాలో జమ చేస్తాం' అని పేర్కొన్న తుమ్మల షెడ్యూల్ ఎప్పుడు ప్రకటిస్తారో మాత్రం చెప్పలేదు.

రుణమాఫీ పూర్తయ్యేదెన్నడో ?

100 రోజుల్లో రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి.. 300 రోజులు గడుస్తున్నా పూర్తి చేయలేదు. మంత్రి తుమ్మల చెప్పిన ప్రకారం.. 'మా ప్రభుత్వానికి ఇది మొదటి ఏడాదే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీకు తెలిసిందే.. మొదటి ఏడాది కొంతచేశాం.. మిగిలిన రుణమాఫీ ప్రక్రియను కొనసాగిస్తాం' అన్నారు. ఐదేండ్లు ప్రహసనంలా కొనసాగిస్తారా ? అని రైతులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

6 నుంచి సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ బంద్

టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 1: రాజన్న సిరిసిల్ల తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని టెక్స్‌టైల్ పార్క్ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, దీంతో ఈ నెల 6 నుంచి పార్క్‌ను బంద్ చేస్తామని టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పరిశ్రమల యజమానులు మాట్లాడుతూ.. కొద్ది నెలలుగా తీవ్రమైన మాంద్యం నెలకొన్నదని, సంక్షోభంలో కూడా రెండు నెలలుగా నష్టాలను ఎదుర్కొని పరిశ్రమలు నడిపించామని, ఇక నడిపించే పరిస్థితి లేదని వాపోయారు. సభ్యుల సమక్షంలో పరిశ్రమలు బంద్ చేయాలని నిర్ణయం తీసుకున్నామని, ఈ నిర్ణయాన్ని కార్మికులు సహృదయంతో అంగీకరించాలని కోరారు. సమావేశంలో సెక్రటరీ అంకారపు కిరణ్, ఉపాధ్యక్షుడు యేముల శ్రీనివాస్, ట్రెజరర్ యెల్లె లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ శివకుమార్, సూర్య, నర్సింగం, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

రుణమాఫీ చేసేవరకు ఊరుకోం

- రైతు భరోసా ఇవ్వాల్సిందే
- రేవంత్ పాలనపై జనం విసుగు
- ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైంది
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరిక
- రుణమాఫీ కోసం పెద్దపల్లిలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ

పెద్దపల్లి, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాల్సిందేనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి, రైతు భరోసా అంటూ మాయమాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ రైతులను నిట్ట నిలువునా ముంచేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. అనేక కొర్రీలు పెట్టి రుణమాఫీకి ఎగనామం పెట్టిందని మండిపడ్డారు. రూ.2 లక్షలలోపు రైతు రుణాలన్నీ మాఫీ చేయాలని, రైతు భరోసా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని రంగంపల్లి జియో పెట్రోల్ బంక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ తీశారు. కొప్పులతోపాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, రైతులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి కాంగ్రెస్ సర్కార్, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్ జల్ద అరుణశ్రీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడారు. తొమ్మిది నెలల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అరాచకాలను ప్రజలు చూశారని, ఇక రేవంత్‌రెడ్డి ఆటలు సాగవని హెచ్చరించారు. హైడ్రా భయంతో తెల్లారితే ఏం జరుగుతుంతో తెలియని భయానక వాతావరణంలో హైదరాబాద్ ప్రజలు బతుకున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి అస్తవ్యస్త పాలనపై విసిగి చెంది జనం తిరగబడేందుకు సిద్ధమవుతున్నారని హెచ్చరించారు.

పంచాయతీల్లో మహిళా ఓటర్లే అధికం

- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.67 కోట్ల మంది ఓటర్లు
- 12,867 పంచాయతీల్లో 1.13 లక్షల వార్డులు
- నల్లగొండ జిల్లాలో అత్యధికం.. మేడ్చల్‌లో అత్యల్పం

జిల్లాలు	పంచాయతీలు	వార్డులు	ఓటర్లు
నల్లగొండ	856	7,392	10,42,545
సంగారెడ్డి	646	5,718	8,34,360
ఖమ్మం	589	5398	8,52,878
వికారాబాద్	585	4982	6,71,940
రంగారెడ్డి	549	4896	7,94,653
హన్మకొండ	210	1986	3,65,832
ములుగు	174	1556	2,37,858
మేడ్చల్	34	320	64,397




హైదరాబాద్, అక్టోబరు 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 1,67,33,584 మంది ఓటర్లు ఉన్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. వీరిలో పురుషులు 82,04,518 మంది, స్త్రీలు 85,28,573, ట్రాన్స్‌జెండర్లు 493 మంది ఉన్నారు. రాష్ట్రంలోని 538 మండలాల్లోని 12,867 గ్రామ పంచాయతీల్లో 1,13,722 వార్డుల్లో ఉన్న ఓటరు జాబితాలను అధికారులు మంగళవారం ప్రకటించారు. ఈ ఓటరు జాబితా ప్రకారమే పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. వార్డుల సంఖ్యను తెలుపకపోవడంతో మరో 40 గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను ప్రకటించలేదు. రాష్ట్రంలో అత్యధికంగా పంచాయతీలు, వార్డులు, ఓటర్ల సంఖ్యా పరంగా నల్లగొండ, సంగారెడ్డి, ఖమ్మం, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు ముందుండగా, హన్మకొండ, ములుగు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నాయి.

ఇద్దరికి మించి పిల్లలున్నా పోటీకి అర్హులే?

- చట్టసవరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం
- త్వరలో సర్కారు ఉత్తర్వులు?

హైదరాబాద్, అక్టోబరు 1 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా పోటీ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిం ది. ఈ మేరకు ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేసింది. ఈ చట్ట సవరణ కు గవర్నర్ ఆమోద ముద్ర వేయాల్సి ఉన్నదని సమాచారం. ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారికి ఇప్పటివరకు పోటీ చేసే అవకాశం లేకుండా గతంలో చట్టంచేశారు. కొంతకాలంగా వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారికి కూడా పోటీ చేసే అవకాశం కల్పించాలని సర్కారు నిర్ణయించింది. దీనిపై అధికారిక ఉత్తర్వులు త్వరలో జారీ కానున్నాయి.

ఐపీవోకు కంపెనీలు క్యూ



ఒక్కరోజే సెబీకి 13 సంస్థల దరఖాస్తు

రూ.8,000 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యం

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: దేశీయ స్టాక్ మార్కెట్లలో ప్రవేశించేందుకు కంపెనీలు అత్యంత ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. ఈ క్రమంలోనే పబ్లిక్ ఇష్యూల కోసం క్యూ కడుతున్నాయి. సోమవారం ఒక్కరోజే మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీకి 13 సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి మరి. దాఖలైన ప్రిలిమినరీ పేపర్స్ వివరాల ప్రకారం ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)ల ద్వారా ఇవన్నీ రూ.8,000 కోట్ల నిధులను సమీకరించనుండగా, వీటిలో 4 కంపెనీల వాటానే సగం (రూ.4,000 కోట్లు)గా ఉండటం గమనార్హం. వ్యాపార విస్తరణ, రుణ భారం తగ్గింపు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, ప్రస్తుత భాగస్వాముల వాటాల తగ్గింపు లక్ష్యాలతో ఈ పబ్లిక్ ఇష్యూలకు సంస్థలు లైన్ కడుతున్నాయి.

ఫ్రెష్ ఇష్యూ-ఓఎఫ్ఎస్

ఐపీవోకు రావాలని చూస్తున్న కంపెనీలు ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గాల్లో ద్వారా నిధులను సమీకరించాలని భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే విక్రమ్ సోలార్ ఐపీవో విలువ రూ.1,500 కోట్లదాకా ఉంటే, ప్రమోటర్ల ద్వారా 1.74 కోట్ల వరకు షేర్లను ఓఎఫ్ఎస్‌లో అమ్మనున్నారు. ఇక ఆదిత్యా ఇన్ఫోటెక్ ఐపీవో రూ.1,300 కోట్లుగా ఉన్నది. ఫ్రెష్ ఇష్యూ రూ.500 కోట్లుగా, ఓఎఫ్ఎస్ రూ.800 కోట్లుగా ఉన్నాయి. వరిందెర కన్‌స్ట్రక్షన్స్ ఐపీవో విలువ రూ.1,200 కోట్లు. ఫ్రెష్ ఇష్యూ రూ.900 కోట్లు, ఓఎఫ్ఎస్ రూ.300 కోట్లుగా ఉన్నాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈపీసీ కంపెనీ విక్రాన్ ఇంజినీరింగ్ ఐపీవోలో రూ.900 కోట్లు ఫ్రెష్ ఇష్యూ. మరో 100 కోట్లను ప్రమోటర్లు ఓఎఫ్ఎస్ మార్గంలో ఈక్విటీ షేర్లను అమ్మనున్నారు.

రూ.1.25 లక్షల కోట్లకు..

ఐపీవోల ద్వారా ఈ ఏడాదిలో ఇప్పటిదాకా దాదాపు రూ.64,000 కోట్ల నిధులను 62 సంస్థలు సమీకరించాయి. నిరుడుతో పోల్చితే 29 శాతం అధికం. గత ఏడాది మొత్తంగా 57 కంపెనీలు రూ.49,436 కోట్ల నిధులను సేకరించాయి. అయితే ఈ ఏడాది ఆఖర్లోగా హ్యుందాయ్ మోటర్ ఇండియా, స్విగ్గీ, ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ తదితర అరడజనుకుపైగా సంస్థలు ఐపీవోకు రావాలని చూస్తున్నాయి. ఇదే జరిగితే వీటన్నిటి విలువ రూ.60,000 కోట్లుగా ఉండనున్నది. దీంతో ఈ ఏడాది ఐపీవోల ద్వారా సమీకరించిన మొత్తాల విలువ సుమారుగా రూ.1.25 లక్షల కోట్లకు చేరనున్నది. ఒక్క హ్యుందాయ్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ విలువే రూ.25,000 కోట్లుగా ఉండనున్నది. ఇది కార్యరూపం దాల్చితే దేశ చరిత్రలోనే అతిపెద్ద ఐపీవోగా రికార్డు సృష్టించనున్నది.

> స్టాక్ మార్కెట్లలో పెద్ద ఎత్తున ఐపీవో సందడి కనిపిస్తున్నది. దేశ ఆర్థికాంశాలతోపాటు, ఆయా రంగాలవారీగా పలు విషయాలు ఇందుకు దోహదం చేస్తున్నాయి. వచ్చే ఏడాది కూడా ఇదే జోష్.
> -మునీశ్ అగర్వాల్, ఈక్విరస్ గ్రూప్

దరఖాస్తుల్ని చేసుకున్న సంస్థలివే..

- విక్రమ్ సోలార్
- ఆదిత్యా ఇన్ఫోటెక్
- వరిందెర కన్‌స్ట్రక్షన్స్
- అజక్స్ ఇంజినీరింగ్
- రహీ ఇన్‌ఫ్రాటెక్
- విక్రాన్ ఇంజినీరింగ్
- వినే కార్పొరేషన్
- సంభవ్ స్టీల్ ట్యూబ్స్
- జరో ఐటీఎంఆర్
- ఆల్ టైమ్ ప్లాస్టిక్స్ లిమిటెడ్
- స్కోడా ట్యూబ్స్
- దేవ్ యాక్సలరేటర్

కరీంనగర్ గ్రానైట్ సంస్థ మిడ్‌వెస్ట్ కూడా..

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు అందిస్తున్న గ్రానైట్ సంస్థ మిడ్‌వెస్ట్ స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావడానికి సిద్ధమవుతున్నది. రూ.650 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. కరీంనగర్‌లో అతిపెద్ద బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నది. తాజా షేర్లను జారీ చేయడంతో రూ.250 కోట్లను, ప్రమోటర్లకు చెందిన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనుండటంతో మరో రూ.400 కోట్లు సేకరించాలని నిర్ణయించింది.

ఎఫ్అండ్‌వోకు స్పీడ్ బ్రేకర్లు

నిబంధనల్ని కఠినతరం చేసిన సెబీ • కొత్త విధివిధానాల ప్రకటన
నవంబర్ 20 నుంచి అమలు • వీక్లీ ఎక్స్‌పైరీలకు ఇండెక్స్ డెరివేటివ్స్



న్యూఢిల్లీ, అక్టోబర్ 1: అడ్డూ.. అదుపు లేకుండా దూసుకుపోతున్న ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) ట్రేడింగ్‌కు మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. స్పీడ్ బ్రేకర్లను పెట్టింది. మంగళవారం ఈ మేరకు నిబంధనలను కఠినతరం చేస్తూ కొత్త విధివిధానాలను ప్రకటించింది. దశలవారీగా నవంబర్ 20 నుంచి ఇవి అమల్లోకి రానున్నాయి. మదుపరుల ప్రయోజనాల రక్షణార్థం, మార్కెట్ స్థిరత్వాన్ని మెరుగుపర్చడానికి చర్యలు తీసుకున్నట్టు సెబీ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే వీక్లీ బేసిస్‌కు ఎక్స్‌పైరీలను తగ్గించడం, ప్రతీ ఎక్స్ఛేంజ్‌కు తమ బెంచ్ మార్క్ ఇండెక్స్‌ల్లో వీక్లీ ఎక్స్‌పైరీతో ఉన్న ఒకదానికి మాత్రమే డెరివేటివ్ కాంట్రాక్టులను అనుమతించడం వంటి కీలక నిర్ణయాలను సెబీ ఆచరణలో పెట్టబోతున్నది

రూ.15 లక్షలకు..: మార్కెట్‌లో పరిచయమవుతున్నప్పుడు డెరివేటివ్‌లలో మినిమం ట్రేడింగ్ విలువను రూ.15 లక్షలకు పెంచాలని సెబీ నిర్ణయించింది. ఆ తర్వాత రూ.20 లక్షలకు పెరగనున్నది. ప్రస్తుతం ఇది రూ.5-10 లక్షలుగానే ఉండటం గమనార్హం. 'వీక్లీ ఎక్స్‌పైరీలతో ఇండెక్స్ డెరివేటివ్ కాంట్రాక్ట్‌ను పెట్టడం, కాంట్రాక్ట్ పరిమాణాలను పెంచడంతో ట్రేడర్లను ఎఫ్అండ్‌వో సెగ్మెంట్‌కు దూరం చేయవచ్చునని సెబీ భావిస్తున్నది' అంటూ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఎందుకీ చర్యలు?: ఎఫ్అండ్‌వోల్లో ట్రేడింగ్ చేస్తున్న దాదాపు 90 శాతం మందికి నష్టాలే వాటిల్లుతున్నాయి. అయినప్పటికీ ఏటేటా వీరి సంఖ్య పెరుగుతూనే ఉండటం ఆందోళనకరంగా మారింది. స్టాక్స్‌ను కొనడం, వాటిని అలాగే ఉంచుకోవడానికి బదులుగా ఎఫ్అండ్‌వో కాంట్రాక్ట్స్‌ల్లో డెడ్‌లైన్ ఉంటుంది. ఆ గడువులోగా మన అంచనాలు తప్పితే పెట్టిన పెట్టుబడులు పోయినట్టే. దీంతో దీనికి ట్రేడర్లు దూరంగా ఉండేలా నిబంధనల్ని సెబీ కఠినతరం చేస్తున్నది.

గ్రీన్ హైడ్రోజన్ కేంద్రంగా రాష్ట్రం: డిప్యూటీ సీఎం

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తేతెలంగాణ): గ్రీన్ హైడ్రోజన్ కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. విదేశీ పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన టోక్యోలోని యమానాషి హైడ్రోజన్ కంపెనీ ప్లాంట్‌ను సందర్శించారు. శాస్త్రవేత్తలు, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ గురించి తెలుసుకున్నారు.

డిజిటల్ ఉమెన్ అవార్డులకు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): డిజిటల్ రంగంలో మహిళా పారిశ్రామిక వేత్తల విజయాలను గుర్తించి, వారిని మరింత ప్రోత్సహించేందుకు టీహబ్, వీ హబ్ సహకారంతో షీ ది పీపుల్ సంస్థ డిజిటల్ ఉమెన్ అవార్డుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డిజిటల్ రంగంలో ఔత్సాహిక మహిళలు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. 2024 ఎడిషన్ అవార్డుల కోసం ఈ లింకులో (https://docs.google.com/forms/) సంప్రదించాలన్నారు.

నాబార్డ్ సీజీఎంగా ఉదయ్ భాస్కర్


హైదరాబాద్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): నాబార్డ్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్‌గా బీ ఉదయ్ భాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన ఈయనకు నాబార్డ్‌లో 31 సంవత్సరాల అనుభవం ఉంది.

ఐస్‌బర్గ్ మరో 25 అవుట్‌లెట్లు

హైదరాబాద్, అక్టోబర్ 1: దేశంలో తొలి ఆర్గానిక్ ఐస్‌క్రీం బ్రాండ్ ఐస్‌బర్గ్ విస్తరణ బాట పట్టింది. వచ్చే రెండేండ్లకాలంలో మరో 25 అవుట్‌లెట్లను తెరువాలనుకుంటున్నట్లు కంపెనీ ఫౌండర్, సీఈవో సుహాస్ శెట్టి తెలిపారు. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో తన 73వ రిటైల్ అవుట్‌లెట్‌ను దసరా పండుగ సీజన్‌లో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న రిటైల్ అవుట్‌లెట్లలో 64 ఫ్రాంచైజ్ స్టోర్లు కాగా, 8 సొంతంగా అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే రెండేండ్లకాలంలో మరో 25 సొంత అవుట్‌లెట్లను తెరువాలనుకుంటున్నట్లు, వీటిలో ఒక్క హైదరాబాద్‌లోనే 10, మిగతా 15 స్టోర్లను తెలంగాణతోపాటు ఏపీల్లోనూ నెలకొల్పబోతున్నట్లు ప్రకటించారు. అలాగే గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.14 కోట్లుగా నమోదైన టర్నోవర్, 2025-26 నాటికి రూ.100 కోట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

నెమ్మదించిన జీఎస్టీ వసూళ్లు

సెప్టెంబర్‌లో రూ.1.73 లక్షల కోట్లు



న్యూఢిల్లీ, అక్టోబర్ 1: గత కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లు నెమ్మదించాయి. గత నెలకుగాను రూ.1.73 లక్షల కోట్లు వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1.63 లక్షల కోట్లతో పోలిస్తే 6.5 శాతం అధికమని పేర్కొంది. ఆగస్టు నెలలో వసూలైన రూ.1.75 లక్షల కోట్ల కంటే ఇది తక్కువ. గత 40 నెలల్లో ఇంతటి తక్కువ స్థాయిలో వృద్ధిని నమోదు చేసుకోవడం ఇదే తొలిసారి. దేశీయంగా వసూళ్లు తగ్గుముఖం పట్టడం, దిగుమతులు కూడా నిరాశాజనకంగా ఉండటం వల్లనే గత నెల వసూళ్లలో వృద్ధి సింగిల్ డిజిట్‌కు పరిమితమైందని పన్ను విశ్లేషకులు చెబుతున్నారు. గత నెలలో దేశీయ వ్యాపార కార్యకలాపాల ద్వారా రూ.1.27 లక్షల కోట్ల ఆదాయం సమకూరగా, దిగుమతులపై రూ.45,390 కోట్లు లభించాయి. అలాగే రిఫండ్ రూపంలో రూ.20,458 కోట్లు చెల్లింపులు జరిపింది.

పలు రాష్ట్రాల్లో ప్రతికూల వృద్ధి

గత నెలలో పలు రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లలో ప్రతికూల వృద్ధి నమోదైంది. మణిపూర్‌లో అత్యధికంగా 33 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, గుజరాత్‌లో స్వల్పంగా పెరిగాయి. తెలంగాణలో ఒక్క శాతం అధికమవగా, రాజస్థాన్‌లో 2శాతం, ఉత్తరప్రదేశ్ 3 శాతం, తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో 5 శాతం చొప్పున పెరిగాయి.

బయోఏషియా- 2025 లోగో ఆవిష్కరణ

హైదరాబాద్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్న బయో ఏషియా-2025 సదస్సు లోగోను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఫిబ్రవరి 24-26 తేదీల్లో హైటెక్స్‌లో నిర్వహించే ఈ అంతర్జాతీయ సదస్సులో 50 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని మంత్రి తెలిపారు. లైఫ్ సైన్సెస్, ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్య సాంకేతిక రంగాల్లో వస్తున్న పరిణామాలను పునర్నిర్వచించే విధానాలపై చర్చలు జరుగుతాయని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఏటా లైఫ్ సైన్సెస్ రంగంపై బయో ఏషియా అంతర్జాతీయ వార్షిక సదస్సు నిర్వహించడం ఆనవాయితీ. వచ్చే ఏడాది సదస్సు 22వది. మరోవైపు, దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో స్వీడన్‌కు చెందిన లైఫ్ సైన్సెస్ రంగానికి చెందిన ప్రతినిధులు సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను అన్వేషించాలని, ప్రభుత్వంతో కలిసిరావాలని మంత్రి వారికి సూచించారు.

రాష్ట్రానికి వరదసాయం 416 కోట్లు

- నిధులు విడుదల చేసిన కేంద్ర హోంశాఖ
- ఎన్డీఆర్ఎఫ్ నిధుల్లో మొండిచేయి
- ఏపీ కేటాయింపుల్లో సగం కూడా ఇవ్వలె
- 8మంది ఎంపీలను ఇస్తే.. ఇచ్చింది గుండుసున్నా
- బీజేపీపై హరీశ్‌రావు ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): వరద సాయంలో రాష్ట్రానికి మళ్లీ అన్యాయం జరిగింది. ఇటీవలి వరదలతో ప్రభావితమైన 14 రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ మంగళవారం కేంద్ర విపత్తు సహాయ నిధి (ఎన్డీఆర్ఎఫ్) నుంచి నిధులు విడుదల చేసింది. మొత్తం రూ.5,858.60 కోట్లను ఎన్డీఆర్ఎఫ్‌లో కేంద్ర వాటాగా కేటాయించింది. ఇందులో తెలంగాణకు రూ.416.80 కోట్లు మాత్రమే ప్రకటించింది. వరదలతో ఏపీతో సమానంగా తెలంగాణ నష్టపోయిన సంగతి తెలిసిందే. కానీ కేంద్రం ఏపీకి వెయ్యి కోట్లు ఇచ్చి, తెలంగాణకు మాత్రం కనీసం అందులో సగం కూడా ఇవ్వలేదు. రూ.10 వేల కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక ఇచ్చింది. ఎన్డీఆర్ఎఫ్ నిధులు ఉదారంగా ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర బృందాన్ని కోరారు. కానీ కేంద్రం మళ్లీ మొండిచెయ్యి చూపించింది. 'అయినవారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో' అన్నట్టుగా కేటాయింపులు ప్రకటించింది. తాజా కేటాయింపుల్లో.. అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,492 కోట్లు, ఏపీకి రూ.1,0 36 కోట్లు, అసోంకు రూ.716 కోట్లు, బీహార్ కు రూ.655.60 కోట్లు, గుజరాత్‌కు రూ.600 కోట్లు కేటాయించారు. కేంద్ర బృందాలు పర్యటించి ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఈ నిధులు విడుదల చేస్తున్నట్టు కేంద్ర హోం శాఖ తెలిపింది.

ఇదేనా సబ్ కా వికాస్?

ఎన్డీఆర్ఎఫ్ కేటాయింపుల్లో తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసింద ని హరీశ్‌రావు మండిపడ్డారు. రాష్ట్రానికి వరద సాయం రూ.416 కోట్లు కేటాయించడంపై ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. 'తెలంగాణ బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇస్తే రాష్ట్రానికి ఒరిగిందేమిటి? కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు గుండు సున్నా. స్టేట్ స్పెసిఫిక్ గ్రాంట్లలో తెలంగాణకు మొండిచెయ్యి, ఎన్డీఆర్ఎఫ్ నిధుల కేటాయింపుల్లో ఆంధ్రతో పోల్చితే సగం కంటే తక్కువ కేటాయింపులు. ఇదే నా సబ్‌కా సాథ్.. సబ్ కా వికాస్?' అని ప్రశ్నించారు.

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్‌లో 600 పోస్టులు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): డైరెక్టర్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ పరిధిలో 600 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ తాజాగా అనుమతులు ఇచ్చింది. ఇందులో సివిల్ సర్జన్ 124, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ 7, స్టాఫ్ నర్సులు 272, గ్రేడ్-2 ఫార్మసిస్ట్ 99, గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్ 34, నర్సింగ్ మిడ్ వైఫ్ 54, రేడియోగ్రాఫర్ 5, డెంటల్ టెక్నీషియన్ 3, డెంటల్ హైజినిస్ట్, ఆడియోమెట్రిక్ టెక్నీషియన్‌లో ఒక్కో పోస్టు చొప్పున ఉన్నాయి.

బీఈడీ ఫైనలియర్ విద్యార్థులకు అవకాశం ఇవ్వండి

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం బీఈడీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్రత్యేక అవకాశం ఇవ్వాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ కోరారు. 55 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి చేయడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అయితే.. డీఎస్సీ రాయడానికి బీఈడీ సెకండియర్ విద్యార్థులకు అవకాశం ఇచ్చారని గుర్తుచేశారు. అయితే సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యే నాటికి ఉస్మానియా, శాతవాహన, ఇతర యూనివర్సిటీల్లో చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలు పూర్తి కావని తెలిపారు. ఫలితాలు రాక ముందే సర్టిఫికెట్స్ పొందే అవకాశం లేదని పేర్కొన్నారు.

తప్పులు సరిదిద్దని టీజీపీఎస్సీ

హైదరాబాద్ అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): పరీక్షల నిర్వహణలో గత వైఫల్యాల నుంచి టీజీపీఎస్సీ తప్పులు సరిదిద్దుకోవడంలేదని, అదే విధమైన నిరక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నదంటూ మంగళవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. గ్రూప్-1 ప్రాథమిక కీలో 7 ప్రశ్నలకు సమాధానాల్లో తప్పులున్నాయని వాటిని సవరించాలన్న వినతులను పట్టించుకోకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. టీజీపీఎస్సీ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు జీ శివ, జై సుధీర్ వాదించారు. టీజీపీఎస్సీ వాదనల నిమిత్తం విచారణ మూడో తేదీకి వాయిదా పడింది.

అధిక వర్షపాతంతో ముగిసిన నైరుతి

హైదరాబాద్, అక్టోంబర్ 1 (నమస్తే తెలంగాణ): 2024 రుతుపవనాల సీజన్ సాధారణం కన్నా 7.6 శాతం అధిక వర్షపాతంతో ముగిసిందని ఐఎండీ మంగళవారం తెలిపింది. ఈ సీజన్‌లో రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అధిక వర్షపాతం నమోదైందని పేర్కొన్నది. నైరుతి రుతుపవనాల సీజన్ అధికారికంగా సెప్టెంబర్ 30న ముగిసిందని తెలిపింది. దేశంలో 934.8 మిమీ వర్షపాతం నమోదైందని, దీర్ఘకాలిక సగటులో 2020 తర్వాత 108% అత్యధికంగా నమోదైంది.

డాక్టర్ కే శ్రీనివాసరావుకు ఫ్రెండ్స్ ఆఫ్ పబ్లిషింగ్ అవార్డు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు ప్రతిష్టాత్మక 'ఫ్రెండ్స్ ఆఫ్ పబ్లిషింగ్ అవార్డు' లభించింది. పుస్తక ప్రచురణ రంగంలో విశేషంగా కృషి చేసిన వారికి భారత ప్రచురణకర్తల సమాఖ్య ఏటా ఈ పురస్కారం అందజేస్తుంది. ఢిల్లీలో ప్రచురణకర్తల సమాఖ్య నిర్వహించిన కార్యక్రమంలో 'ప్రచురణ మిత్ర' పురస్కారాన్ని సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ హిమా కోహ్లీ ప్రదానం చేశారు.

వంద రూపాయలకే మేకపోతు!

- పండుగకు యువకుల వినూత్న స్కీం

కమలాపూర్/పోతంగల్, అక్టోబర్ 1: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌లో కొందరు యువకులు దసరా పండుగ పురస్కరించుకుని వినూత్న స్కీం పెట్టారు. డ్రాలో గెలిచిన వారికి రూ.100కే మొదటి బహుమతిగా మేకపోతు, రెండో బహుమతిగా గొర్రె పొట్టేలు, మూడో బహుమతిగా జానీవాకర్ ఫుల్‌బాటిల్, నాలుగో బహుమతిగా టీచర్స్ ఫుల్‌బాటిల్, ఐదో బహుమతిగా బ్లాక్‌డాగ్ ఫుల్‌బాటిల్, ఆరో బహుమతిగా సిగ్నేచర్ ఫుల్‌బాటిల్, 7, 8 బహుమతుల కింద నాటుకోడి పుంజులు, 9, 10 బహుమతులుగా నాటుకోడి పెట్టలు ఇవ్వబడును అని రాశారు. రూ.100 చెల్లించి కూపన్ తీసుకోవాలని కోరారు. కొందరు యువకులు నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం కొడిచర్లలో 'వంద కొట్టు.. మేక పట్టు' అంటూ గ్రామస్థులను ఆకర్షిస్తున్నారు. ఇలా అందరి దగ్గర రూ.100 తీసుకుని, 10న లక్కీడ్రా నిర్వహించనున్నారు.

'తెలంగాణ తల్లి'కి నిప్పు పెట్టిన నిందితుడి అరెస్టు

అక్కన్నపేట, అక్టోబర్ 1: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు పెట్టిన నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం రాత్రి చౌటపల్లిలోని బురుజు చౌరస్తా వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు అంటించిన ఘటనపై బీఆర్ఎస్ నాయకులు అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై విజయభాస్కర్.. గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. టెక్నాలజీని ఉపయోగించి గ్రామానికి చెందిన కామాద్రి రాంబాబును నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా.. తానే తెలంగాణ తల్లి విగ్రహం ముసుగుకు నిప్పు అంటించానని, దీంతో విగ్రహం పాక్షికంగా కాలిపోయిందని అంగీకరించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఫోన్ల ట్యాపింగ్ కేసులో బెయిల్‌ను పొడిగించండి

- కోర్టును ఆశ్రయించిన భుజంగరావు

నాంపల్లి కోర్టులు/హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో తన మధ్యంతర బెయిల్ గడువును పొడిగించాలని కోరుతూ మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు మరోసారి కోర్టును ఆశ్రయించారు. ఆరోగ్య కారణాల రీత్యా ఇప్పటికే ఆయనకు రెండు విడతల్లో మొత్తం 35 రోజులు బెయిల్ లభించిన విషయం తెలిసిందే. ఈ గడువు మంగళవారంతో ముగియడంతో తాజాగా ఆయన నాంపల్లిలోని 1వ అదనపు జిల్లా కోర్టులో పిటిషన్ వేశారు.

హవాలా ముఠా గుట్టు రట్టు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 1: హైదరాబాద్‌లో హవాలా డబ్బును తరలిస్తున్న ఓ ముఠాను సుల్తాన్‌బజార్ పోలీసులు మంగళవారం అదుపులోకి తసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి రూ.కోటికిపైగా నగదును స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్‌లోని సిరోహికి చెందిన లక్ష్మణ్(27), వసంత్(24) బైక్‌పై హనుమాన్ టేక్డీ నుంచి బొగ్గులకుంట వైపు హవాలా సొమ్మును రవాణా చేస్తున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు కాపు కాసి పట్టుకున్నారు. అనంతరం వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా హనుమాన్ వ్యాయామశాల ఎదుట శివ టవర్స్‌లోని రెండవ అంతస్తులో తరుణ్(26)ను అరెస్టు చేశారని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1.21 కోట్ల నగదుతోపాటు ఓ స్కూటర్, 2 కరెన్సీ కౌంటింగ్ మెషీన్లు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎంతో చాకచక్యంగా ఈ నిందితులను పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి, ఎస్ఐ మధుసూదన్, కానిస్టేబుళ్లను అభినందించారు. ముంబైకి చెందిన బబ్లూ (35) అనే వ్యక్తి ఆధ్వర్యంలో ఈ ముఠా పని చేస్తున్నట్టు చెప్పారు. విలేకర్ల సమావేశంలో అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ శంకర్ కూడా పాల్గొన్నారు.

27 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

- 2,223 సైబర్ నేరాలు.. 11 కోట్లు స్వాహా
- ఫోన్లు, చెక్ బుక్కులు, హార్డ్ డిస్కులు స్వాధీనం
- రాజస్థాన్‌లో అదుపులోకి..
- మీడియాకు వెల్లడించిన డీజీ శిఖాగోయల్
- మరో 33 మంది సైబర్ క్రిమినల్స్ గుర్తింపు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఒకటి కాదు.. రెండు కాదు.. దేశవ్యాప్తంగా 2,223 వివిధ సైబర్ నేరాలకు పాల్పడిన 27 మంది సైబర్ నేరగాళ్లను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు సెప్టెంబర్ చివరి వారంలో అరెస్టు చేశారు. వారిని మంగళవారం మీడియాముందు ప్రవేశపెట్టారు. ఇతర రాష్ర్టాలకు వెళ్లి ఇంత భారీస్థాయిలో సైబర్ నేరస్థులను అరెస్టుచేసి పట్టుకురావటం ఇదే తొలిసారి అని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖాగోయల్ మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో 27 మంది సైబర్ నేరగాళ్ల వివరాలు, వారిని అదుపులోకి తీసుకున్న విధానం, వారు కొల్లగొట్టిన డబ్బు తదితర విషయాలను వివరించారు. రాజస్థాన్‌లోని జైపూర్, జోధ్‌పూర్, నాగౌర్‌లోని వివిధ ప్రాంతాలకు చెందినవారు.. తెలంగాణలో 189 సైబర్ మోసాలకు పాల్పడినట్టు గుర్తించామని అన్నారు. వారి జాడ వెతుక్కుంటూ వెళ్లగా.. ఒక్కో నిందితుడు దేశవ్యాప్తంగా సుమారు 100కు పైగా సైబర్ నేరాల్లో నిందితుడిగా ఉన్నట్టు తెలుసుకున్నామని చెప్పారు. విశ్లేషించగా దేశవ్యాప్తంగా 2,223 కేసుల్లో వీరి పాత్రను గుర్తించామని వివరించారు. తెలంగాణ నుంచి 4 బృందాలుగా సైబర్‌క్రైమ్ పోలీసులు వెళ్లి.. వారి వాడిన ఫోన్స్, సిమ్‌కార్డ్స్, అడ్రస్‌లను విశ్లేషించి కొన్నిరోజులు రాజస్థాన్‌లోనే క్యాంపు వేసి 27 మందిని అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. ఇదే సైబర్ నెట్‌వర్క్‌లో మరో 33 మంది నేరగాళ్లను గుర్తించామని, త్వరలోనే వారిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు.

29 మ్యూల్ ఖాతాల నుంచి..

ఆపరేషన్‌లో భాగంగా మొత్తం రూ.11,01,18,882 అనుమానాస్పద లావాదేవీలను 29 మ్యూల్ ఖాతాల ద్వారా నిర్వహించినట్టు గుర్తించామని శిఖాగోయల్ తెలిపారు. 27 మంది నిందితులను రాజస్థాన్‌లో అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్లపై తెలంగాణలోని వివిధ జైళ్లకు తరలించామని వెల్లడించారు. వీరు సుమారు రూ.9 కోట్ల నగదు ఈ మ్యూల్ ఖాతాల నుంచి నిర్వహించారని చెప్పారు. ఈ రూ.11 కోట్ల సైబర్ నేరాల్లో అత్యధికంగా బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్, స్టాక్స్ ట్రేడింగ్, డిజిటల్ అరెస్టు, పార్ట్‌టైమ్ జాబ్ వంటి వివిధ మోసాలు ఉన్నట్టు వివరించారు. వారి వద్ద 31 మొబైల్ ఫోన్లు, 37 సిమ్ కార్డులు, 13 ఏటీఎం కార్డులు, 7 చెక్ బుక్‌లు, 2 బౌన్స్ చెక్కులు, 2 హార్డ్ డిస్కులు, మరికొన్ని డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఒక్కో మ్యూల్ ఖాతాకు లావాదేవీని బట్టి సుమారు 50 వేలు పైనే ఉంటుందని చెప్పారు. వీళ్లు టార్గెట్ చేసిన బాధితుల్లో 25-45 ఏండ్ల వారు అధికంగా ఉన్నారని చెప్పారు. నేరస్థులంతా కంబోడియా, వియత్నాం, మయన్మార్ తరహా సైబర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు ఒక్కొక్కరికి రెండు వారాల పాటు శిక్షణ ఇస్తున్నట్టు గుర్తించామని అన్నారు.

బ్యాంకు అధికారుల పాత్రపై ఆరా

ఈ మ్యూల్ ఖాతాలను తెరవడం, నిర్వహించడంలో కొందరు బ్యాంక్ అధికారులు కీలక పాత్ర పోషించినట్టు గుర్తించామని శిఖాగోయల్ తెలిపారు. ఆ వివరాలను పరిశీలిస్తున్నామని, నేరం రుజువైతే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కేసుల్లో కింగ్‌పిన్‌ల పాత్రపైనా ఆరా తీస్తున్నామని అన్నారు. 'కరెంట్ అకౌంట్ల'పై దృష్టి సారించామని తెలిపారు. పట్టుబడిన వారిలో కొందరు విద్యార్థులు, వ్యాపారులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నట్టు వెల్లడించారు. వీరు పార్ట్‌టైమ్‌గా కొన్ని పనులు చేస్తూ, ఫుల్‌టైమ్‌గా సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించామని చెప్పా రు. రాజస్థాన్‌లో అహోరాత్రులు శ్రమించి, చాకచక్యంగా సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసిన సీఎస్‌బీ సిబ్బందిని శిఖాగోయల్ అభినందించారు. ఎస్పీ దేవేందర్‌సింగ్ ఆధ్వర్యంలో డీఎస్పీ కేవీ సూర్యప్రకాశ్, ఫణీందర్, వేణుగోపాల్‌రెడ్డి, హరికృష్ణ, కేవీఎం ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు రమేశ్, ఆశిశ్‌రెడ్డి, రవికుమార్, శ్రీను, ఎస్సైలు రామునాయక్, సునీల్ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతం చేసిన సిబ్బందిని ప్రశంసించారు.

వాణిజ్య సిలిండర్‌పై రూ.48.5 పెంపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: వంటగ్యాస్ ధర మళ్లీ పెరిగింది. హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే 19 కిలోల కమర్షియల్ సిలిండర్‌పై రూ.48.5 పెరిగింది. వరుసగా గత మూడు నెలల నుంచి వాణిజ్య సిలిండర్ ధర పెరుగుతూ వస్తున్నది. మొత్తం ఈ మూడు నెలల్లో రూ.94 మేర పెరిగింది. గృహ అవసరాలకు వాడే గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. మరోవైపు, విమాన ఇంధన ధర 6 శాతం తగ్గింది. కిలో లీటరకు రూ.5,883 మేర చమురు కంపెనీలు తగ్గించాయి.

బుల్డోజర్ కూల్చివేతలపై మార్గదర్శకాలు: సుప్రీం

న్యూఢిల్లీ: బుల్డోజర్ కూల్చివేతలపై మార్గదర్శకాలను జారీ చేస్తామని సుప్రీంకోర్టు మంగళవారం చెప్పింది. ఏదో ఓ మతానికి కాకుండా ప్రజలందరికీ వర్తించే విధంగా ఈ మార్గదర్శకాలు ఉంటాయని తెలిపింది. ఓ వ్యక్తి ఏదైనా కేసులో నిందితుడిగా ఉండటం కానీ, దోషిగా నిర్ధారణ కావడం కానీ, ఆ వ్యక్తి ఇంటిని కూల్చేయడానికి తగిన కారణం కాబోదని స్పష్టం చేసింది. అయితే, ఆక్రమణదారులను రక్షించే విధంగా ఈ మార్గదర్శకాలు ఉండబోవని వివరించింది. గుడులు, గురుద్వారాలు, దర్గాలు వంటి మతపరమైన కట్టడాలు ప్రజలకు ఆటంకం కలిగించే విధంగా రోడ్లు, జలాశయాలు, రైలు మార్గాలు వంటివాటిపై ఉండకూడదని వివరించింది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్లపై తీర్పును రిజర్వు చేసింది.

తల్లిని చంపి, తినేసిన వ్యక్తికి మరణ శిక్ష

కింది కోర్టు తీర్పును సమర్థించిన బాంబే హైకోర్టు

ముంబై: తల్లిని చంపేసి, శరీర భాగాలను తినేసిన వ్యక్తికి కింది కోర్టు విధించిన మరణ శిక్షను బాంబే హైకోర్టు మంగళవారం సమర్థించింది. ఇది నరమాంస భక్షణకు సంబంధించిన కేసు అని పేర్కొంది. దోషి సునీల్ కుచ్‌కోరవి 2017 ఆగస్ట్ 28న కొల్హాపూర్‌లోని తన ఇంట్లో తన తల్లి యల్లమ రమ కుచ్‌కొరవిని కిరాతకంగా హత్య చేశాడు. అనంతరం ఆమె మెదడు, గుండె, కాలేయం, మూత్ర పిండాలు, ప్రేగులను పెనం మీద కాల్చి, కొన్నిటిని తినేశాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వనందుకు ఇంత దారుణానికి పాల్పడ్డాడు. దోషి సునీల్‌కు కొల్హాపూర్ కోర్టు 2021లో మరణ శిక్ష విధించింది. అతనిని పుణేలోని యెరవాడ జైలుకు తరలించారు. తనకు మరణ శిక్ష విధించడంపై సునీల్ అప్పీల్ చేశాడు. హైకోర్టు అతడి అభ్యర్థనను తోసిపుచ్చి, మరణ శిక్షను సమర్థించింది.

బెంగాల్‌లో మళ్లీ జూడాల సమ్మె

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్లు మళ్లీ సమ్మెకు దిగారు. మంగళవారం నుంచి నిరవధికంగా, పూర్తిగా విధులను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. జూనియర్ వైద్యులు ఇన్ పేషంట్, ఔట్ పేషంట్ విభాగాల విధులు నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొన్న మరుసటి రోజే వారు సమ్మెకు దిగడం గమనార్హం. పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని, దవాఖానలలో రక్షణ చర్యలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆందోళనను పునః ప్రారంభించారు. పీజీ జూనియర్ వైద్యురాలి హత్యాచారంపై 42 రోజుల ఆందోళన తర్వాత సెప్టెంబర్ 21 నుంచి విధులకు హాజరవుతున్నామని, అయితే ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా తమ రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. తమపై దాడులు కొనసాగుతూ ఉన్నాయని, అందుకే ఆందోళన తిరిగి ప్రారంభించినట్టు తెలిపారు.

డేరా చీఫ్‌కు మరోసారి పెరోల్

హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ బయటకు

న్యూఢిల్లీ: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీం ఇన్సాన్‌కు మరోసారి పెరోల్ మంజూరైంది. ఆయన సోమవారం చేసిన విజ్ఞప్తిని ఎన్నికల కమిషన్ ఆమోదించింది. హర్యానా శాసనసభ ఎన్నికల తరుణంలో ఆయనకు పెరోల్ మంజూరు చేయడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయనకు రాష్ట్రంలో పలుకుబడి ఉందని, ఆయన జైలు నుంచి బయటకు వస్తే, ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని ఆరోపించింది. ఆయనకు పెరోల్ మంజూరు చేయరాదని ఈసీకి విజ్ఞప్తి చేసింది. ఆయన పెరోల్‌పై తాత్కాలికంగా జైలు నుంచి విడుదల కావడం ఇది 15వ సారి.

ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం

- సుమారు 500 మిస్సైల్స్, రాకెట్ల ప్రయోగం
- అమెరికా హెచ్చరించిన కొద్ది గంటల్లోనే దాడి
- బాంబుల మోతతో దద్దరిల్లిన టెల్ అవీవ్
- వేలాది మంది పౌరులు సురక్షిత ప్రాంతాలకు
- ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు.. ఇరాన్ క్షిపణులను కూల్చేయాలని సైన్యానికి బైడెన్ ఆదేశాలు
- పశ్చిమాసియాలో మరింత తీవ్రమైన ఉద్రిక్తతలు
- లెబనాన్‌లో భూతల దాడులకు దిగిన ఇజ్రాయెల్

జెరూసలేం, అక్టోబర్ 1: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. ఇజ్రాయెల్-హమాస్, హెజ్బొల్లా మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇప్పుడు ఇరాన్ కూడా ప్రత్యక్షంగా దిగింది. మంగళవారం సుమారు 500 క్షిపణులు, రాకెట్లతో ఇజ్రాయెల్‌పై విరుచుకు పడింది. దీంతో టెల్ అవీవ్ బాంబుల మోతతో దద్దరిల్లింది. పలు భవనాలు, వ్యాపార సంస్థలు దెబ్బతిన్నాయి. పౌరులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఇజ్రాయల్ హెచ్చరికలు జారీ చేసింది. వేలాది మందిని బాంబు షెల్టర్లకు తరలించింది. దాడులను అడ్డుకోవడానికి తన రక్షణ వ్యవస్థను సిద్ధం చేసింది. లెబనాన్‌లో హెజ్బొల్లా నేతల మరణాలకు ప్రతీకారంగా ఇరాన్ ఈ దాడులకు దిగింది. ఇరాన్ దాడులను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) కూడా ఎక్స్‌లో నిర్ధారించింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ సాయంత్రం అత్యవసరంగా సమావేశమై పరిస్థితులపై చర్చించింది. ఏడాది కాలంలో సెక్యూరిటీ క్యాబినెట్ ఇలా సమావేశం కావడం ఇదే ప్రథమం. కాగా, దాడిని ఇరాన్ నిర్ధారించింది. ఇజ్రాయెల్‌పై డజన్లకొద్దీ బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించినట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ దాడులకు ఇజ్రాయెల్ ప్రతిస్పందిస్తే మరింత తీవ్రంగా దాడులు చేస్తామని హెచ్చరించింది.

అమెరికా హెచ్చరించిన విధంగానే..

ఇరాన్ తక్షణం క్షిపణి దాడులు చేయడానికి సిద్ధంగా ఉందని అమెరికా ప్రకటించిన కొద్ది గంటల్లోనే దానిని నిజం చేస్తూ ఇరాన్ దాడికి దిగడం గమనార్హం. ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, అమెరికా చూస్తూ ఊరుకోదని ఉన్నతాధికారి ఒకరు హెచ్చరిక కూడా చేశారు. అయితే దీనిని ఇరాన్ బేఖాతరు చేస్తూ దాడికి దిగింది. దీనిపై ఇజ్రాయెల్ మిలటరీ స్పందిస్తూ ఇప్పటివరకు ఇరాన్ వైపు నుంచి ఎలాంటి ప్రమాదాన్ని గుర్తించలేదని, అయితే ఈ దాడితో తాము అప్రమత్తమయ్యామని, తమ రక్షణ, దాడి వ్యవస్థలను దానికి అనుగుణంగా సిద్ధం చేసినట్టు మిలటరీ చీఫ్ లాయిడ్ ఆస్టిన్ తెలిపారు. సెంట్రల్ ఇజ్రాయెల్‌లో సైరన్‌ల ద్వారా పౌరులను అప్రమత్తం చేసినట్టు ఆయన చెప్పారు. అయితే దాడులతో ఏ ప్రాంతాలు దెబ్బతిన్నవి, మరణాల గురించి ఆయన వివరించ లేదు. మరోవైపు అమెరికా ఇజ్రాయెల్‌కు మద్దతు తెలిపింది. ఇరాన్ క్షిపణులను కూల్చేయాలని బైడెన్ అమెరికా సైన్యాన్ని ఆదేశించారు. కాగా, ఇరాన్ దాడి నేపథ్యంలో భారతీయులంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, బయటకు రావద్దని ఇజ్రాయెల్‌లోని భారత ఎంబసీ మన దేశ పౌరులకు విజ్ఞప్తి చేసింది.



ఇరాన్ దాడుల నేపథ్యంలో షెల్టర్‌లో తలదాచుకున్న ఇజ్రాయెల్ పౌరులు



ఇరాన్ క్షిపణులను అడ్డుకొంటున్న ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ వ్యవస్థ

టెల్ అవీవ్‌లో ఉగ్ర దాడి

టెల్ అవీవ్‌లోని జఫాలో ఉగ్ర దాడి జరిగింది. మంగళవారం సాయంత్రం జెరూసలేం వీధిలో కొందరు ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించగా, ఏడుగురు గాయపడ్డారని ఇజ్రాయెల్ పోలీసులు తెలిపారు. ఉగ్రవాదులిద్దరూ పోలీస్ కాల్పుల్లో మరణించారు. రైలులోంచి దిగిన ఈ ఇద్దరు ఉగ్రవాదులు తుపాకులతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో పౌరులు చాలామంది నేలపై బోర్లా పడుకుని కాల్పుల నుంచి తప్పించుకోగా, నలుగురు మరణించారు. కొందరు గాయపడ్డారు.

లెబనాన్‌పై భూతల దాడులు

లెబనాన్‌లో భూతల దాడులను ఇజ్రాయెల్ ప్రారంభించింది. ఇప్పటివరకు వైమానిక దాడులతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్.. తాజాగా లెబనాన్ భూభాగంలోకి ప్రవేశించి దాడులు మొదలుపెట్టింది. అందులో భాగంగా లెబనాన్ సరిహద్దు సమీపంలో ఉన్న సుమారు రెండు డజన్ల గ్రామాల ప్రజలను తక్షణం ఇళ్లు వదిలి వెళ్లిపోవాలంటూ ఇజ్రాయెల్ మిలటరీ మంగళవారం హెచ్చరికలు జారీ చేసింది. అలాగే తమ వాహనాలను ఉత్తర ప్రాంతం నుంచి దక్షిణ లిటానీ నదివైపు తరలించవద్దంటూ పౌరులకు ఎక్స్‌లో హెచ్చరికలు చేయగా, తమ భూభాగంలోకి ఇజ్రాయెల్ సైన్యం ప్రవేశించినట్టు వచ్చిన వార్తలను హెజ్బొల్లా ఖండించింది. లెబనాన్‌లోకి ప్రవేశించే ఏ చర్యనైనా దీటుగా ఎదుర్కొంటామని హెజ్బొల్లా ప్రతినిధి మహమ్మద్ అఫిఫ్ పేర్కొన్నారు.

మొస్సాద్ హెడ్ క్వార్టర్స్‌పై దాడి

టెల్ అవీవ్‌కు సమీపంలోని గిల్లాట్ ఇజ్రాయెల్ మిలటరీ ఇంటెలిజెన్స్ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్టు హెజ్బొల్లా ప్రకటించింది. మిలటరీ ఇంటెలిజెన్స్ యూనిట్ 8200, టెల్ అవీవ్ శివారులోని మొస్సాద్ హెడ్ క్వార్టర్స్‌పై నాలుగు రాకెట్లను ప్రయోగించినట్టు తెలిపింది. అలాగే సెంట్రల్ ఇజ్రాయెల్‌పై మధ్యంతర క్షిపణులను ప్రయోగించామని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని పేర్కొంది.

మా గూఢచారి చీఫ్ మొస్సాద్‌కు ఏజెంట్: ఇరాన్ మాజీ అధ్యక్షుడు

ఇజ్రాయెల్ రహస్య గూఢచార వ్యవస్థ మొస్సాద్ ఇరాన్ సీక్రెట్ సర్వీస్‌లోకి చొరబడిందని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ అహ్మదీనెజాద్ ఆరోపించారు. సీఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ మొస్సాద్ కార్యకలాపాలను అడ్డుకోవడానికి ఇరాన్ ఏర్పాటు చేసిన సీక్రెట్ సర్వీస్ చీఫ్ తమను మోసం చేసి మొస్సాద్‌కు ఏజెంట్‌గా మారిపోయాడని ఆరోపించారు. అతనితో పాటు మరో 20 మంది ఇజ్రాయెల్‌కు డబుల్ ఏజెంట్లుగా పనిచేశారన్నారు. వీరంతా ఇరాన్‌లో జరిగే అనేక రహస్య ఆపరేషన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇజ్రాయెల్‌కు అందజేసేవారని, పలు డాక్యుమెంట్లు అపహరించేవారని, అలా అపహరించిన వాటిలో ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయని ఆయన వెల్లడించారు. వీరి చర్య కారణంగానే ఇరాన్ న్యూక్లియర్ సైంటిస్టుల మరణం సంభవించిందన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గతంలో ఇరాన్ అణు కార్యక్రమాల గురించి వెల్లడిస్తూ వాటి పత్రాల గురించి తెలిపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ముగిసిన జమ్ముకశ్మీర్ ఎన్నికలు

చివరి విడతలో 69% పోలింగ్ • అక్టోబర్ 8న ఫలితాల ప్రకటన

జమ్ము, శ్రీనగర్, అక్టోబర్ 1: జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం జరిగిన మూడో, ఆఖరి విడత ఎన్నికల్లో 69 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. జమ్ము, సహా జమ్ముకశ్మీర్‌లోని 40 అసెంబ్లీ స్థానాలకు పటిష్ఠ బందోబస్తు మధ్య ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. 370 అధికరణ రద్దు తర్వాత మొదటిసారి జరిగిన ఈ ఎన్నికలో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు సహా అన్నింటిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 8న వెలువడతాయి.



ఈ వాన కాలంలో 7.6% అధిక వర్షపాతం

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: ఈ ఏడాది రుతుపవన సీజన్‌లో 7.6 శాతం అధిక వర్షపాతం నమోదైందని భారత వాతావరణ విభాగం మంగళవారం తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ మధ్య ప్రదేశ్, మహారాష్ట్రలో అధిక వర్షాలు కురిశాయని వెల్లడించింది. మధ్య, దక్షిణ, ఈశాన్య భారతంలో అక్టోబర్-డిసెంబర్ మధ్య కాలంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. భారత వ్యవసాయ రంగానికి రుతుపవన సీజన్ ఎంతో కీలకం. దేశంలోని మొత్తం నికర సాగు భూమిలో 52 శాతం ఈ వర్షాలపైనే ఆధారపడి ఉంటుంది. తాగునీటికి, విద్యుత్తు ఉత్పత్తికీ ఈ వర్షాలు కీలకం.



ఎవరెస్ట్‌ను పైకి నెడుతున్న నది

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: సాధారణం కంటే అధిక వేగంతో ఎవరెస్టు ఎత్తు ఏటేటా పెరుగుతున్నది. దీనికి కారణం ఓ నది అని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఎవరెస్టు కింద భూగర్భంలో ఉండే టెక్టోనిక్ ప్లేట్ల కదలికల వల్ల వాస్తవానికి ఏటా 0.04 ఎంఎం నుంచి 1 ఎంఎం మాత్రమే పెరగాలి. కానీ, ప్రస్తుతం 0.08 ఎంఎం నుంచి 2 ఎంఎం ఎత్తు పెరుగుతున్నది. దీనిపై యూనివర్సిటీ కాలేజ్ లండన్ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయగా ఎవరెస్టు కింది భాగంలో నదుల ప్రవాహం పెరుగుతూ ఎవరెస్టు ఎత్తుకు కారణం అవుతున్నట్టు తేలింది. ఎవరెస్టుతో పాటు పక్కనున్న పర్వతాలు కూడా దీనివల్ల ప్రభావితానికి గురయ్యాయని వెల్లడైంది.

వారణాసిలోని ఆలయాల నుంచి సాయిబాబా విగ్రహాల తొలగింపు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరమైన వారణాసిలోని పలు ఆలయాల నుంచి సాయిబాబా విగ్రహాలను తొలగించడం ఉద్రిక్తతకు దారితీసింది. కాషాయ శ్రేణుల తోపాటు కొందరు హిందూ స్వామీజీలు కలిసి దాదాపు 10 ఆలయాల నుంచి సాయిబాబా విగ్రహాలను తొలగించారు. వారణాసిలోని ఆలయాల నుంచి సాయిబాబా విగ్రహాలను తొలగించాలని సనాతన రక్షక దళ్ (ఎస్ఆర్‌డీ), బ్రాహ్మిణ్ సభ కలిసి కొన్ని రోజులుగా ప్రచారం చేస్తున్నాయి. అందులో భాగంగానే విగ్రహాలను తొలగిస్తున్నారు. తాము సాయిబాబాకు వ్యతిరేకం కాదని, కాకపోతే ఆయన విగ్రహాలకు మాత్రం ఆలయాల్లో చోటు లేదని ఎస్ఆర్‌డీ అధ్యక్షుడు అజయ్‌శర్మ పేర్కొన్నారు. సాయిబాబా కోసం ఏర్పాటు చేసిన ఆలయాల్లో ఆయన భక్తులు పూజలు నిర్వహించుకోవచ్చని, సనాతన ధర్మంపై ఏమాత్రం అవగాహన లేని కొందరు ఇతర ఆలయాల్లోనూ సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సూర్యుడు, విష్ణువు, శివుడు, శక్తి, గణేశుడి విగ్రహాలను మాత్రమే ఆలయాల్లో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

ముడా భూములు వెనక్కి

- సిద్ధరామయ్య భార్యకు కేటాయించిన 14 స్థలాలు తిరిగి తీసుకున్న అధికారులు
- భూములు వెనక్కి ఇవ్వడమంటే నేరాన్ని అంగీకరించినట్టే: బీజేపీ
- సీఎం రాజీనామాకు డిమాండ్



బెంగళూరు, అక్టోబర్ 1: కర్ణాటక ముడా స్కామ్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి కేటాయించిన 14 స్థలాలను ముడా అధికారులు వెనక్కి తీసుకున్నారు. ముడా కుంభకోణం నేపథ్యంలో, తనకు కేటాయించిన భూములను తిరిగి వెనక్కి తీసుకోవాలని సీఎం భార్య సోమవారం మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)కి లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ 14 ప్లాట్లను వెనక్కి తీసుకుంటూ సేల్‌డీడ్‌ను రద్దు చేయాలని ముడా మంగళవారం ఆదేశాలు జారీ చేసింది.

నేరాన్ని అంగీకరించినట్టే: బీజేపీ

బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర మంగళవారం మాట్లాడుతూ పార్వతి 14 స్థలాలను ముడాకు అప్పగించడానికి సిద్ధపడ్డారంటే ముడా కుంభకోణంలో తప్పు జరిగిందని అధికారికంగా ఒప్పుకున్నట్టేనని అన్నారు. వెంటనే సీఎం సిద్ధూ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అది ఆమె సొంత నిర్ణయం: సిద్ధరామయ్య

ముడా కుంభకోణంలో తనకు ఎలాంటి పాత్ర లేనందున తన పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. అసలు ఏ కారణాలతో తనపై మనీ లాండరింగ్ ఆరోపణలు మోపారో తనకు అర్థం కావడం లేదని అన్నారు. భూములు అప్పగించినంత మాత్రాన నేరం ఒప్పుకున్నట్టు ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. విపక్షాల రాజకీయాలకు తన భార్య కూడా పావుగా మారిందని, భూములు అప్పగించాలని తీసుకున్న నిర్ణయం ఆమె సొంతమని, దానిలో తన ప్రమేయం ఏమీ లేదని తెలిపారు. తనకు వ్యతిరేకంగా జరిగిన విద్వేష రాజకీయాలకు తన భార్య బాధితురాలిగా మారిందని, భూములు అప్పగించాలన్న ఆమె నిర్ణయం తనను ఆశ్చర్యపరిచిందని అన్నారు.

ఏ క్షణంలోనైనా ఈడీ సమన్లు

ముడా స్కామ్‌లో ప్రథమ ముద్దాయిగా ఉన్న సిద్ధరామయ్యను ప్రశ్నించడానికి ఏ క్షణంలోనైనా ఈడీ సమన్లు జారీ చేయొచ్చునని అధికార వర్గాలు తెలిపాయి. సిద్ధరామయ్యతో పాటు, అతని సహచరులు, బంధువులు, సన్నిహితంగా మెలిగే ఒక మంత్రి కదలికలను అధికారులు ఇప్పటికే నిశితంగా పరిశీలిస్తున్నారు. వారికి చెందిన బ్యాంక్ ఖాతాలు, ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని ఈడీ సేకరించింది. మరోవైపు లోకాయుక్త బృందం మైసూర్ నగర శివారులో ఉన్న ముడా స్కామ్ వివాదాస్పద భూమిలో సర్వే నిర్వహించారు.

వాంగ్‌చుక్ నిర్బంధం

ఢిల్లీ సరిహద్దుల్లో పాదయాత్ర అడ్డగింత

నిరసనగా పోలీస్‌స్టేషన్‌లో నిరాహార దీక్ష

న్యూఢిల్లీ: లఢక్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ 'ఢిల్లీ చలో పాదయాత్ర' చేస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, మరికొందరిని ఢిల్లీ సరిహద్దుల్లో సోమవారం రాత్రి పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. దీనికి నిరసనగా వాంగ్‌చుక్, మరికొందరు మంగళవారం నిరాహార దీక్ష ప్రారంభించారు. లఢక్‌కు రాష్ట్ర హోదా కల్పించి ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ గత నాలుగేండ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. అయితే నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి ఢిల్లీలో ప్రవేశించేందుకు ప్రయత్నించినందుకే వాంగ్‌చుక్, మరికొందరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. వాంగ్‌చుక్‌ను కలవడానికి ఢిల్లీ సీఎం ఆతిశీకి ఎల్జీ అనుమతి ఇవ్వలేదు.

ఆగని ఉద్యోగాల ఊచకోత

టెక్ రంగంలో కొనసాగుతున్న ఉద్యోగ కోతలు

ఈ ఏడాది ఇప్పటివరకు 1.4 లక్షల మందిపై వేటు



న్యూఢిల్లీ: ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో పొదుపు మంత్రాన్ని జపిస్తున్న టెక్ కంపెనీలు తమ నిర్వహణ ఖర్చులను తగ్గించుకునేందుకు ఉద్యోగుల సంఖ్యను భారీగా కుదించుకుంటున్నాయి. 2024 ప్రథమార్థంలో లేఆఫ్‌ల ద్వారా వేల మంది టెకీలపై వేటు వేసిన పలు కంపెనీలు ద్వితీయార్థంలోనూ అదే పరంపరను కొనసాగిస్తున్నాయి. ఈ జాబితాలో ఐబీఎం, మైక్రోసాఫ్ట్, సిస్కో, డెల్, ఇంటెల్, క్వాల్కమ్, నార్త్‌వోల్ట్ లాంటి బడా కంపెనీలతోపాటు డోజీ, ఉయ్ ట్రాన్స్‌ఫర్ లాంటి చిన్నచిన్న స్టార్టప్ కంపెనీలు సైతం ముందు వరుసలో ఉన్నాయి. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 511 కంపెనీల్లో 1,39,206 మంది టెకీలు ఉద్యోగాలను కోల్పోయినట్టు 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' వెల్లడించింది.

భారీగా తొలగింపులు...

ఈ ఏడాది ఫిబ్రవరిలో దాదాపు 4 వేల మంది ఉద్యోగులపై వేటు వేసిన సిస్కో.. రెండో విడతగా తమ మొత్తం సిబ్బందిలో 7% (దాదాపు 5,600 మంది) ఉద్యోగులను తొలగించనున్నట్టు ఆగస్టులో ప్రకటించింది. ఈ ఏడాది ఆరంభంలో పలువురు ఉద్యోగులను తొలగించిన ఐబీఎం సంస్థ.. తాజా విడతలో ప్రధానంగా సీనియర్ ప్రోగ్రామర్లతో పాటు సేల్స్, సపోర్ట్ సిబ్బందిపై వేటు వేసేందుకు సిద్ధమవుతున్నది. ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన గేమింగ్ విభాగమైన 'ఎక్స్‌బాక్స్' తోపాటు కార్పొరేట్, సపోర్ట్ విభాగాల్లో 650 ఉద్యోగులను తొలగిస్తున్నట్టు ప్రకటించగా.. స్మార్ట్‌ఫోన్ చిప్‌ల తయారీలో అగ్రగామి సంస్థగా కొనసాగుతున్న 'క్వాల్కమ్' త్వరలో శాన్‌డిగోలో 226 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్టు వెల్లడించింది. ఇదేవిధంగా స్వీడన్‌లో దాదాపు 1,600 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకాలని భావిస్తున్నట్టు బ్యాటరీల తయారీ సంస్థ నార్త్‌వోల్ట్ గత నెలలో ప్రకటించింది.


ఫేక్ సుప్రీం విచారణతో 7 కోట్లు టోకరా

పారిశ్రామికవేత్త ఓస్వాల్ డిజిటల్ అరెస్ట్ • హైటెక్ మోసానికి పాల్పడ్డ సైబర్ నేరగాళ్లు

న్యూఢిల్లీ: హైటెక్ మోసాలతో ఎంతోమంది ప్రముఖులను బురిడీ కొట్టించిన సైబర్ మోసగాళ్లు తాజాగా ఓ పారిశ్రామికవేత్తను తమ బుట్టలో వేసుకున్నారు. బాధితుడిని అతని ఇంట్లోనే రెండు రోజులపాటు డిజిటల్ అరెస్ట్ చేసిన దుండగులు.. ఆయన నుంచి రూ.7 కోట్లు తస్కరించారు. ఇందుకోసం ఏకంగా ఓ ఫేక్ సుప్రీంకోర్టును, నకిలీ సీజేఐని సృష్టించారు. తాము సీబీఐ, ఈడీ అధికారులమంటూ బాధితుడిని ఆన్‌లైన్‌లో విచారణ చేసి, ఆయన వాంగ్మూలాన్ని రికార్డుచేసి, ఆన్‌లైన్‌లోనే కోర్టులో హాజరుపరిచారు. ఆయనపై నేరారోపణ చేసి.. శిక్షగా రూ.7 కోట్లు జరిమానా విధించి వివిధ అకౌంట్లలోకి ఆ డబ్బును జమచేయించుకున్నారు. ఈ హైటెక్ మోసానికి గురైన వ్యక్తి ప్రముఖ వస్త్ర ఉత్పత్తి సంస్థ వర్ధమాన్ గ్రూప్ చైర్మన్ ఎస్పీ ఓస్వాల్.

నకిలీ సుప్రీం.. నకిలీ సీజేఐ..

ఓస్వాల్ కథనం ప్రకారం ఆయనకు ఆగస్టు 28న ఒక ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే 9 నంబర్ నొక్కాలని అప్పటివరకు ఫోన్ డిస్‌కనెక్ట్ కాదని అవతలి వ్యక్తి చెప్పాడు. దీంతో ఓస్వాల్ 9 నంబర్ నొక్కాడు. వెంటనే అవతలి నుంచి ఒక వ్యక్తి తాను సీబీఐ కొలాబా (ముంబై) ఆఫీసు నుంచి మాట్లాడుతున్నానని అంటూ ఒక ఫోన్ నంబర్ చెప్పి అది ఓస్వాల్ పేరిట ఉందని చెప్పాడు. ఎవరో తన పేరుతో ఆ నంబర్ తీసుకొని వాడుతున్నారని అన్నాడు. అలాగే కెనరా బ్యాంక్‌లో తన పేరిట ఒక అకౌంట్ ఉన్నదని కూడా చెప్పాడు. దీంతో ఓస్వాల్ వెంటనే తనకు కెనరా బ్యాంక్‌లో ఎటువంటి ఖాతా లేదని చెప్పాడు. కానీ అవతలి వ్యక్తి.. అది ఓస్వాల్ పేరుతోనే ఉన్నదని, ఆ ఖాతా నుంచి అక్రమంగా కొన్ని ఆర్థిక లావాదేవీలు జరిగాయని అన్నాడు. గత ఏడాది హవాలా కేసులో అరెస్టయిన జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్ కేసుకు సంబంధించి ఈ ఆర్థిక లావాదేవీలు జరిగాయని చెప్పాడు. ఈ కేసులో ఓస్వాల్ కూడా అనుమానితునిగా ఉన్నాడని అన్నాడు. ఆ అకౌంట్ తనది కాదని, తనకు నరేశ్ గోయల్ ఎవరో తెలియదని ఓస్వాల్ చెప్పారు. అయినప్పటికీ.. ఆ బ్యాంకు ఖాతా తన ఆధార్ కార్డు ఆధారంగా ఉన్నదని అవతలి వ్యక్తి చెప్పాడు. తాను అప్పుడప్పుడు జెట్ ఎయిర్‌వేస్‌లో ప్రయాణించానని, బహుశా గుర్తింపు కార్డుగా తన ఆధార్‌కార్డును వారికి చూపించి ఉంటానని ఓస్వాల్ చెప్పారు. అయినాసరే.. తమ దర్యాప్తు పూర్తయ్యేంత వరకు తనను డిజిటల్ కస్టడీలో ఉండాలని చెప్పారని, తమకు సహకరిస్తే కేసు నుంచి బయటపడేస్తామని కూడా వారు హామీ ఇచ్చారన్నారు. ఇదంతా వీడియో కాల్‌లో జరిగిందని ఓస్వాల్ వివరించారు. తనతో మాట్లాడిన వ్యక్తి చీఫ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ రాహుల్ గుప్తాగా చెప్పుకున్నాడని తెలిపారు. డిజిటల్ కస్టడీలో ఉన్న తనపై నిఘా వేసినట్టు తెలుపుతూ 70 నిబంధనలను తనకు పంపించారని చెప్పారు. దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతూ తనను ఒక లేఖ రాయమన్నారని, వెంటనే తాను రాసి పంపానని తెలిపారు. ఆ తరువాత ఆ మోసగాళ్లు తన వాంగ్మూలం కూడా తీసుకున్నారని చెప్పారు. తన బాల్యం నుంచి వ్యాపారం వరకు, ఆస్తి వివరాలు కూడా అడిగి తెలుసుకున్నారని అన్నారు. అయితే తనకు అన్ని వివరాలు గుర్తు లేవని, మేనేజర్‌ను అడిగి చెప్తానని అన్నానని తెలిపారు. తనను రెండురోజుల పాటు వీడియో సర్వేలెన్స్‌లో ఉంచారని, తాను గది నుంచి బయటకు వెళ్లినప్పుడల్లా ఫోన్‌ను తనతో తీసుకెళ్లాలని ఆదేశించారని చెప్పారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని బెదిరించిన దుండగులు.. ఈ విషయాన్ని ఎవరితోనూ చెప్పవద్దని ఆదేశించారని అన్నారు. తాను ఎవరితోనైనా మాట్లాడితే.. తనతో పాటు ఆ వ్యక్తి కూడా ఐదేండ్ల పాటు జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారని చెప్పారు. దర్యాప్తు అధికారులుగా చెప్పుకున్న ఆ దుండగులు సాధారణ దుస్తులే ధరించారని, వారి మెడలో ఐడీ కార్డులున్నాయని తెలిపారు. వారి వెనుక జాతీయజెండా ఎగురుతున్న ఓ భవనాన్ని తాను చూశానని చెప్పారు. ఆ తరువాత ఒక నకిలీ కోర్టు హాల్‌ను చూపించారని, అక్కడ భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌గా చెప్పుకున్న వ్యక్తి తన కేసును విచారించి, ఆదేశాలు కూడా ఇచ్చాడని ఓస్వాల్ తెలిపారు. కోర్టు ఉత్తర్వులు తనకు వాట్సాప్‌లో పంపారని, రూ.7 కోట్లను వేర్వేరు బ్యాంక్ ఖాతాలకు పంపాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారని చెప్పారు. ఇక తనపై జారీ అయిన ఓ ఫేక్ అరెస్ట్ వారంట్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) లోగో, ముంబై పోలీసుల స్టాంపులు ఉన్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులుగా పేర్కొన్న పత్రం మీద మూడు రెవెన్యూ స్టాంపులు ఉన్నాయని, వాటిలో ఒకటి సుప్రీంకోర్టు స్టాంప్, రెండు బార్ అసోసియేషన్ స్టాంప్‌లని వివరించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మీద ఉన్నట్టుగానే తనకు అందిన ఆదేశాలపై కూడా డిజిటల్ సంతకం, బార్ కోడ్ ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా దానిపై సుప్రీంకోర్టు చిహ్నం కూడా ఉన్నదని అన్నారు. ఇవన్నీ చూసి.. జరుగుతున్నదంతా నిజమేనని భావించానని, వారు తనను ఈ కేసు నుంచి రక్షిస్తారని భ్రమపడ్డానని ఓస్వాల్ చెప్పారు.



5 కోట్ల రికవరీ

తాను మోసపోయానని గ్రహించిన ఓస్వాల్ ఆగస్ట్ 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సైబర్ క్రైమ్ విభాగం సహకారంతో డబ్బు బదిలీ అయిన అకౌంట్లను జప్తు చేసి రూ.5.25 కోట్లను స్వాధీనం చేసుకొని ఓస్వాల్‌కు అప్పగించారు. ఈ నేరం వెనుక అంతర్రాష్ట్ర ముఠా ఉన్నదని, అస్సాంకు చెందిన ఇద్దరు చిన్న వ్యాపారులు అతాను చౌదరి, ఆనంద్‌కుమార్‌ను అరెస్టు చేశామని తెలిపారు. ప్రధాన నిందితుడు మాజీ బ్యాంక్ ఉద్యోగి రూమీ కలీటా అని, ఇతనికి నిమ్మీ భట్టాచార్య, అలోక్ రంగీ, గులాం ముర్తజా, జకీర్ సహకరించారని వివరించారు.

▪▪ గాంధీ కలలు సాకారమయ్యేలా ”

మహిళా సాధికారత విషయంలో మహాత్ముడి ఆలోచనలు ఎంతో గొప్పగా ఉండేవి. ఆడవాళ్ల ఆర్థిక స్వావలంబనతోనే.. దేశ ప్రగతి సాధ్యమని ఆయన నమ్మేవారు. గాంధీజీ ఆలోచనలకు తగ్గట్టే.. మనదేశంలోని మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని తేలింది. తాజాగా, బీడీఎస్ బ్యాంక్ – రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో పలు విషయాలను వెల్లడించింది. దేశంలోని మెట్రో నగరాల్లో.. 65 శాతంమంది మహిళలు వ్యాపారాలు ప్రారంభించడానికి ఎలాంటి బ్యాంకు రుణాలు తీసుకోలేదట. మరో 39% మంది తమ వ్యక్తిగత పొదుపుతోనే అంకుర సంస్థలను ప్రారంభించారట. ఇక బ్యాంకు రుణాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు 21% ఉండగా, 7% మంది వెంచర్ క్యాపిటలిస్ట్‌లు, ప్రైవేట్ ఈక్విటీల నుంచి నిధులు సమకూర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారట. 28% మంది వ్యక్తిగత ఆస్తిని, 25% మంది బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు పొందడానికి ప్రయత్నిస్తున్నారట. వీరిలో 52% మంది 45 ఏళ్లు పైబడిన వారు ఉండగా, 25–35 ఏళ్ల మధ్య ఉన్నవారు 36% మంది ఉన్నారని సర్వేలో వెల్లడైంది. ఇక డిజిటల్ చెల్లింపుల విషయంలోనూ భారతీయ మహిళలు ముందున్నారు. కనీసం 73% మంది.. వినియోగదారుల నుంచి డిజిటల్ రూపంలో చెల్లింపులను స్వీకరిస్తున్నారు. తమ వ్యాపార ఖర్చులను చెల్లించడానికీ డిజిటల్ పద్ధతులను పాటిస్తున్నవారు 87% మంది. దేశంలోని 10 ప్రధాన నగరాల్లో.. 400 మందితో ఈ సర్వే నిర్వహించారు.



నమస్తే తెలంగాణ
జిందగీ
హైదరాబాద్ | బుధవారం 2 అక్టోబర్ 2024 www.ntnews.com



“ అందరూ విలువను బంగారంలోనూ, వెండిలోనూ వెతుక్కుంటారు. కానీ, అసలైన విలువ అనేది మన ఆరోగ్యంలోనే ఉంటుంది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం!

• మహాత్మా గాంధీ. ”


ఆరోగ్యమే మహాభాగ్యం

మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకునేవారు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచేవారు మనదేశంలో అడుగడుగునా కనిపిస్తారు. అయితే, గాంధీజీ పాటించిన ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, అనుసరించిన జీవనశైలిని అతి తక్కువమంది మాత్రమే ఫాలో అవుతుంటారు. అనారోగ్యకరమైన ఆహారం, అపసవ్య జీవనశైలితో.. నేటితరం నడి వయసులోనే వార్ధక్యాన్ని సమీపిస్తున్నది. అలాంటివాళ్లంతా.. ఏడుపదుల వయసులోనూ చలాకీగా కనిపించిన గాంధీజీ నుంచి ఎంతో నేర్చుకోవాలి. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని నమ్మే మహాత్ముడి సిద్ధాంతాలను ఒంట బట్టించుకోవాలి.

మహాత్మాగాంధీ పూర్తి శాకాహారి. మితాహారి కూడా! ఆహారం విషయంలో ఆయన కచ్చితంగా ఉండేవారు. తన రోజువారీ ఆహారంలో అన్ని రకాల పోషకాలు ఉండేలా చూసుకొనేవారు. దంపుడు బియ్యంతో చేసిన అన్నం మాత్రమే తీసుకొనేవారు. వీటిలో అధికంగా ప్రొటీన్లు, విటమిన్లు ఉంటాయి. శరీరానికి ఎంతో ఉపయోగపడతాయి. పచ్చి కూరగాయలను తినడానికి ఇష్టపడే వారు. అవికూడా సేంద్రియ పద్ధతుల్లో పండించినవే! వండటం వల్ల కూరగాయల్లోని పోషకాలు పోతాయనీ, పచ్చిగా తింటేనే వాటిలోని ప్రొటీన్లు, విటమిన్లు పూర్తిస్థాయిలో మన శరీరానికి అందుతాయని చెప్పేవారాయన. తృణధాన్యాలతో చేసిన రొట్టెలను రోజూ తప్పకుండా తినేవారు. ముఖ్యంగా సాయంత్రాల్లో కూరగాయల సలాడ్ తీసుకొనేవారు. హెర్బల్ టీ తయారీలో బెల్లం మాత్రమే వాడేవారు. చక్కెరను పక్కన పెట్టేవారు. ఆయన శాకాహారి కాబట్టి, శరీరానికి కావాల్సిన మాంసకృత్తులను పొందడానికి డ్రైఫ్రూట్స్‌ను ఆశ్రయించేవారు.

సవ్యమైన జీవనశైలితోనే..

గాంధీజీ ప్రతిరోజు సుమారుగా 15 కిలోమీటర్లకు పైగా నడిచేవారు. నడకను మించిన వ్యాయామం లేదనేవారు. ఇక ప్రాణాయామం.. ఆయన దినచర్యలో భాగం. సాయంత్రం వేళల్లోనూ తక్కువస్థాయి వ్యాయామాలు చేసేవారు. ధూమపానం, మద్యపానంలాంటి అనారోగ్యకరమైన అలవాట్లకు ఆయన పూర్తి వ్యతిరేకం. ఈ రెండిటినీ నిర్మూలించడానికి ఎంతో కృషి చేశారు. శారీరక, మానసిక ఆరోగ్యంపై ఇవి అధిక చెడు ప్రభావాన్ని చూపుతాయని ఎప్పుడూ చెబుతుండేవారు. పర్యావరణ పరిశుభ్రతకూ ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారు గాంధీజీ. పర్యావరణం బాగుంటేనే మనిషి ఆరోగ్యం బాగుంటుందని నమ్మేవారు. వ్యక్తిగత శుభ్రతనూ కచ్చితంగా పాటించేవారు.



రోజువారీ జీవితం..

- గాంధీజీ తన దినచర్యను గోరువెచ్చని నీటితోనే ప్రారంభించేవారు. ఇలా చేయడం వల్ల రక్త నాళాలు ఉత్తేజితం అవుతాయి. కండరాలు, అవయవాలకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి.
- అల్లం టీ లేదా హెర్బల్ టీ తాగేవారు.
- సీజనల్ పండ్లను ఎక్కువగా తీసుకునేవారు.
- భోజనానికి 20 నిమిషాల ముందు కూరగాయలు, పండ్లతో చేసిన సలాడ్ తీసుకొనేవారు.
- మధ్యాహ్న భోజనంలో పప్పుతోపాటు తృణధాన్యాలతో చేసిన రొట్టెలను తీసుకొనేవారు. దంపుడు బియ్యంతో చేసిన అన్నం తినేవారు. అలాగే ఆయన భోజనంలో పెరుగు ఉండేలా చూసుకొనేవారు.
- సాయంత్రం పూట గ్రీన్ టీ లేదా అల్లం టీని తాగేవారు. డ్రై ఫ్రూట్స్‌ను స్నాక్స్‌గా తీసుకొనేవారు.
- గాంధీజీ రాత్రి భోజనం చాలా తక్కువగా ఉండేది. రాగి జావ, జొన్న అంబలి లాంటివి తాగేవారు.
- ఇక పడుకోడానికి 30 నిమిషాల ముందు ఆయుర్వేద మూలికలు కలిపిన కప్పు గోరువెచ్చని పాలను తీసుకునేవారు.

సత్యం, అహింస మహాత్ముడు
ధరించిన అస్త్రాలు.
సత్యాగ్రహం, సహాయ నిరాకరణ
బాపూ సంధించిన శస్త్రాలు.
పడమటి పొగరును తూర్పున
అస్తమింపజేసిన మేరునగం మన గాంధీ.
జాతియావత్తూ జాతిపిత వెంట నడిచిన
క్షణం.. రెండు శతాబ్దాల స్వరాజ్య
సమరం తుది అంకానికి చేరుకుంది.
ఆనాడు వంటింటికే పరిమితమైన
మహిళా లోకం.. బాపూ పిలుపు అందుకొని
గడప దాటింది. గాంధీ వెంట దండికి
తరలింది. ఉప్పు వండింది. మహాత్మాగాంధీ
ఏం చెబితే అది.. ఎంత చెబితే అంత!
అదే నాటి స్త్రీజాతి పంథా!!



సహాయ నిరాకరణలో ఓ అడుగు ముందున్నా..
మద్యపాన నిషేధంలో పది అడుగులు దూసుకుపోయినా...
స్వాతంత్ర్య పోరాటంలో పురుషాధిక్యతకు సమాంతరంగా మహిళల సమర్థతా ప్రస్ఫుటించింది.
ఇదంతా.. స్త్రీ శక్తిని బాపూ నమ్మబట్టే! మహాత్ముణ్నీ స్త్రీ జాతి అంతగా గౌరవించడం వల్లే!!
నేటి గాంధీ జయంతి వేళ.. నాటి మేటి స్మృతులను మరోసారి అవలోకిద్దాం!



బాపూ మాటే.. ఆమెకు బాట

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆకాంక్షించిన మహాత్ముడి గొంతు మహిళల సమానత్వానికీ నినదించింది. ఉద్యమాల్లో స్త్రీల భాగస్వామ్యానికి ఆయన ఆలోచనలు ఊతకర్రగా నిలిచాయి. పరబంధనాల నుంచీ దేశాన్ని విముక్తం చేయడమే కాదు, ఆమెకూ అసలైన స్వాతంత్ర్యాన్ని అందించాలని సంకల్పించిన మహనీయుడాయన. విలువైన ఆలోచనలు, విశాల దృక్పథాల మేలిమి మేళవింపైన గాంధీ మహాత్ముడికి స్త్రీ జాతి నిత్యం నివాళి అర్పిస్తూనే ఉంటుంది.

ఆఫ్రికాలోనే అడుగు...

మహిళలు పురుషులు అన్న లింగభేదాన్ని మహాత్ముడు నిరసించేవారు. ఇద్దరూ సర్వసమానులేనని నమ్మేవారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళల భాగస్వామ్యాన్ని ఆయన ప్రోత్సహించారు. అసలు పోరాటంలో మహిళలు ఎలా పనిచేస్తారన్నది ఆయనకు తొలిసారి దక్షిణాఫ్రికాలో ఎదురైన అనుభవం ద్వారా అర్థమైంది. ఆఫ్రికాలో గాంధీ ఉన్న సమయంలో... అంటే 1913 సంవత్సరంలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఒక నల్ల చట్టాన్ని తీసుకొచ్చింది. నల్లజాతీయుల పెండ్లిండ్లన్నింటినీ రిజిస్టర్ చేయించుకోవాలనీ, అలా చేయించుకోనివి అక్రమమైన వాటికింద జమకడతామనీ చెప్పింది. దీనికి ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ చట్టాన్ని ఆడవాళ్లంతా పెద్ద ఎత్తున వ్యతిరేకించారు. అప్పుడు జరిగిన పోరాటానికి తొలి వరుసలో ఉన్నదీ మహిళలే. తొలిసారి ఉద్యమంలో భాగంగా భారతీయ స్త్రీలు జైలుకు వెళ్లిన ఘటన అది. గాంధీ ఈ ఉద్యమాలకి వెన్నుదన్నుగా ఉన్నారు. మహిళా శక్తిని ఆయన దగ్గరి నుంచి పరిశీలించిన మొదటి ఘటన అది.

సహాయ నిరాకరణ ఆమెదే..

స్వాతంత్ర్య పోరాటంలో జరిగిన అనేక ఉద్యమాల్లో సహాయ నిరాకరణ ఉద్యమానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అందులో భాగంగా సారాయి దుకాణాల మూసివేతకు నేషనల్ కాంగ్రెస్ పనిచేస్తున్నది. అయితే అది అంత ఫలవంతం కాలేదు. దానికి సంబంధించిన కార్యకర్తలంతా మగవాళ్లనీ, సగం సగం మనసుతో వాళ్లు చేస్తున్న పోరాటం వల్లే అది అనుకున్న ఫలితాన్ని సాధించలేదనీ గాంధీ గమనించారు. అందుకే, మహిళల్ని ఈ ఉద్యమంలో భాగస్వాములుగా చేయాలని భావించారు. అదే విషయమై పిలుపునిచ్చారు. అటు నుంచి అనూహ్య స్పందన వచ్చింది. శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభమయ్యే నాటికి, అంటే 1930 ప్రాంతంలో ఖాదీ వస్త్రాలే కట్టుకోవాలన్న చరఖా ఉద్యమంతో పాటు, మద్యపాన నిషేధమూ పూర్తిగా మహిళలకే అప్పగించారు. సరోజిని నాయుడు, హంస మెహతా, కమలాదేవి చటోపాధ్యాయలాంటి వాళ్లు వేల మంది మహిళల్ని అనేక బృందాలుగా ఏర్పరిచారు. వీళ్లంతా నారింజ రంగు చీరలు కట్టుకుని రోడ్డెక్కారు. మద్యపానానికి వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటం విజయవంతంగా సాగింది. కలకత్తా, ముంబయిలాంటి మహానగరాల్లోనూ మద్యం దుకాణాలు మూతబడ్డాయి. మహిళాశక్తి మీద ఆయన అంచనా తప్పు కాదని నిరూపించిన పెద్ద సంఘటన ఇది.

పురాణ స్త్రీలు...

గాంధీ గురించి ఎక్కడ చదివినా, ఆయన ప్రసంగాలను పరిశీలించినా... శీలం, నడవడి, ధీరత, అంకిత భావం, విశ్వాసం లాంటి వాటి గురించి ఎప్పుడూ ప్రస్తావిస్తుండేవారు. శారీరక దార్ఢ్యం కన్నా మనసుకు సంబంధించిన ఇవే... మనిషిని అసలైన బలవంతుడిగా చేస్తాయని నమ్మేవారాయన. మహిళల విషయంలోనూ ఆయన అవే విలువల్ని ప్రామాణికంగా చెప్పేవారు. పురాణ స్త్రీ లైన సీత, ద్రౌపది, దమయంతిల గురించి గాంధీ ఎక్కువగా ప్రస్తావించేవారు. సీత సచ్ఛీలతే... రావణుడిని నిలువరించి, రాముడికి జయాన్ని చేకూర్చిందని అనేవారు. రకరకాల పనుల్ని ఒంటిచేత్తో చక్కబెడుతూ, క్లిష్ట సమయంలో కూడా చలించని ధీరత కలిగిన ద్రౌపదిని ఆయన గొప్ప వ్యక్తిగా అభివర్ణించేవారు. దమయంతి పాత్రనూ అపరిమిత విశ్వాసానికి, ప్రేమకు మారుపేరుగా భావించేవారు. నలుడి విషయంలో దమయంతి చూపిన ఔదార్యం, ప్రేమ, విశ్వాసాలు... మహిళల గొప్ప స్వభావానికి అద్దాలు అనేవారు. ధీరోదాత్తల కథలు ఆయన్ని అమితంగా ఆకట్టుకునేవి. 'మహిళలను బలహీన వర్గంగా లెక్కవేయడం అంటే వాళ్లను అవమానించడమే. మగవాళ్లు మహిళలకు చేస్తున్న అన్యాయాల్లో ఇదీ ఒకటి. శక్తి అనే దాన్ని నైతిక బలంగా తీసుకుంటే... అప్పుడు తప్పకుండా పురుషుల కన్నా మహిళలే బలవంతులవుతారు' అని ఎప్పుడూ చెప్పేవారు.



... ✍ లక్ష్మీహరిత ఇంద్రగంటి

నేటి బతుకమ్మ

ఎంగిలిపూల బతుకమ్మ

ప్రపంచమంతా పూలతో పూజిస్తే.. పూలనే పూజించే గొప్ప సంస్కృతి మనది. ప్రకృతిని ఆరాధించే మహోన్నత వారసత్వానికి ప్రతీక మన బతుకమ్మ పండుగ. అమావాస్య మొదలు దుర్గాష్టమి వరకు జరిగే మహోన్నత వేడుక. మొదటి రోజైన అమావాస్య నాడు 'ఎంగిలిపూల' బతుకమ్మను పేరుస్తారు. సాధారణంగా మహాలయ అమావాస్య నాడు ఎంగిలి పూల బతుకమ్మ మొదలవుతుంది. ఆనాడు ఇంటి యజమాని పితృదేవతలకు తర్పణాలు విడుస్తారు. పిండ ప్రదానం చేయలేని వాళ్లు పెద్దల పేరిట బ్రాహ్మణుడికి సాయిత్యం (వంట సామగ్రి) ఇస్తారు. ఈ సందర్భంగా పెద్దలకు ప్రీతిగా పెసరపప్పు గారెలు, పాయసం నైవేద్యంగా సమర్పిస్తారు. సాయంత్రం గుమ్మంలో నీళ్లు చల్లి, ముగ్గులుపెడతారు. ఉదయాన తెచ్చుకున్న తంగేడు పూలు, గుమ్మడి పూలు, గునుగు పూలతో తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మ పేర్చుతారు. వీధిలోని వారంతా బతుకమ్మ ఆడతారు. ఉదయం నానబెట్టిన (మిగిలిన వడపప్పు) పెసరపప్పు, దోసకాయ ముక్కలు నైవేద్యంగా పెడతారు. పెద్దలకు పెట్టగా మిగిలింది కనుక ఎంగిలి (వాడిన) పప్పుగా, భోజనాలయ్యాక పేర్చే బతుకమ్మ కనుక దీనిని ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తుంటారు. ఇవాళ్టి నుంచి మొదలయ్యే బతుకమ్మ సందడి తెలంగాణ వైభవాన్ని తొమ్మిది రోజులు చాటుతుంది.




• డా॥ ఆర్.కమల

తొమ్మిది రోజులు ఉయ్యాలో

తొమ్మిది రోజులు ఉయ్యాలో
పొన్న పూలతోను ఉయ్యాలో
ఆటపాటలు చూసి ఉయ్యాలో
నమ్మిక తోడుతో ఉయ్యాలో
ఇల్లును కప్పించి ఉయ్యాలో
ఆనందమొందిరి ఉయ్యాలో
అలరి గుమ్మడి పూలు ఉయ్యాలో
పసుపు ముద్దను చేసి ఉయ్యాలో
గౌరమ్మ వరమిచ్చె ఉయ్యాలో
అరుగులు వేయించి ఉయ్యాలో
తోరణాలు కట్టించి ఉయ్యాలో
కాంతలందరికి ఉయ్యాలో
గోరింట పూలతో ఉయ్యాలో
దోసపూలతోను ఉయ్యాలో
ఆడిన వారికి ఉయ్యాలో
గోడలు పెట్టించి ఉయ్యాలో
గౌరమ్మను నిలిపిరి ఉయ్యాలో
ఆరోగ్యము కల్గు ఉయ్యాలో
తామర పూలతో ఉయ్యాలో
చేమంతి పూలతోను ఉయ్యాలో
పాడిన వారికి ఉయ్యాలో
ద్వారాలు పెట్టించి ఉయ్యాలో
చెలియను పూజింతురు ఉయ్యాలో
పాడిపంటలు కల్గు ఉయ్యాలో
మొగిలి పూలతోను ఉయ్యాలో
సుందరాంగులెల్ల ఉయ్యాలో
విన్నట్టి వారికి ఉయ్యాలో
మొగురాలు ఎక్కించి ఉయ్యాలో
చుట్టూతా తిరిగిరి ఉయ్యాలో
విష్ణుపథము కల్గు ఉయ్యాలో
వాయిలి పూలతో ఉయ్యాలో
ఆటలు ఆడిరి ఉయ్యాలో
వాసాలు చేయించి ఉయ్యాలో
పాటలు పాడిరి ఉయ్యాలో

అమ్మల కోసం ఏఐ..

అన్నిటా మిన్నగా వినిపిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు.. కాబోయే అమ్మలు, పుట్టబోయే బిడ్డల కోసం పని చేయనున్నది. ఐటీలో అగ్రగామి, సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన బెంగళూరు నగరం ఇందుకు వేదిక అవుతున్నది. మాతాశిశు ఆరోగ్యాన్ని మెరుగుపరిచే దిశగా బెంగళూరు మహా నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం 'ఏఐ' సాయం తీసుకుంటున్నది. 'సేవ్‌మామ్' పేరుతో ఏఐ ఆధారిత పైలట్ ప్రాజెక్టు ఇటీవలే ప్రారంభమైంది. దీని ద్వారా నగరంలోని గర్భిణులు, నవజాత శిశువులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నది. సురక్షితమైన ప్రసవాలు జరిగేలా చూసుకోవడానికి ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 300 మంది గర్భిణులు పేర్లను నమోదు చేసుకోగా.. వీరిలో 15 మంది హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్నవారిని గుర్తించారు. వీరికి పూసల దండలను పోలిన ఏఐ ఆధారిత స్మార్ట్ గ్యాడ్జెట్లను అందించనున్నారు. ఈ స్మార్ట్ గ్యాడ్జెట్లు స్థానిక ఆశా కార్యకర్తలు మొదలుకొని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ క్లినిక్‌లతో అనుసంధానమై ఉంటాయి. ఇవి ప్రసవం అయ్యేవరకూ గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తాయి. వారు ఎప్పుడు డాక్టర్ దగ్గరికి వెళ్లాలో, ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలో చెబుతాయి. పరీక్షల ఫలితాలను కూడా ట్రాక్ చేస్తాయి. ఏదైనా ఇబ్బంది తలెత్తినప్పుడు స్థానిక ఆశా కార్యకర్తలు, వైద్యాధికారులకు సందేశాలు పంపుతాయి. ఇలా.. గర్భిణులతోపాటు వారికి పుట్టిన శిశువుల సంరక్షణ కోసం వెయ్యి రోజులపాటు ఫాలోఅప్ సేవలు అందిస్తాయి. డెలివరీ తర్వాత కూడా.. శిశువులను మానిటర్ చేస్తూ, ఎప్పుడెప్పుడు టీకాలు వేయించాలో కూడా చెబుతాయి. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా మొదలైన ఈ కార్యక్రమం సత్ఫలితాలను అందిస్తే.. మరింత విస్తృతంగా ఉపయోగించే యోచనలో ఉన్నారు అధికారులు.



భారత్ జయకేతనం

కాన్పూర్ టెస్టులో సంచలన విజయం • 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ • బంగ్లాకు తప్పని భంగపాటు

చివరి రోజు అదరగొట్టిన బౌలర్లు • ఛేదనలో దంచేసిన యశస్వీ, విరాట్ కోహ్లీ



రెండున్నర రోజుల ఆట తుడిచిపెట్టుకుపోయినా ఒక టెస్టులో మరో సగం రోజు మిగిలుండగానే విజయం సాధించొచ్చని ఎవరైనా ఊహించారా? ఆరు సెషన్లు మాత్రమే సాగిన మ్యాచ్‌లో ఫలితం రాబట్టొచ్చని ఎవరైనా అంచనా వేశారా? ఓ జట్టు 52 ఓవర్లలోనే టెస్టును గెలుచుకోవడం ఎప్పుడైనా చూశారా? కానీ కాన్పూర్‌లో భారత క్రికెట్ జట్టు ఆ అసాధ్యాలన్నింటినీ సుసాధ్యం చేసింది. తొలి రోజు 35 ఓవర్ల ఆట సాధ్యమైన తర్వాత రెండ్రోజుల్లో ఒక్క బంతీ పడకపోయినా నాలుగో రోజు అనూహ్య ఆటతీరుతో మ్యాచ్‌ను తమ వైపునకు లాగేసుకున్న టీమిండియా.. ఆట చివరి రోజు అసాధారణ ఆటతీరుతోఅద్భుతమే చేసింది. నాలుగో రోజు ప్రత్యర్థి జట్టును బ్యాట్‌తో చుక్కలు చూపించిన రోహిత్ సేన.. మంగళవారం బంతితో ఆటాడుకుంది. వీలైనంత త్వరగా బంగ్లాను ఆలౌట్ చేయాలన్న కసితో ఆడిన భారత్‌కు బుమ్రా, జడ్డూ రాణించడంతో తిరుగులేకుండా పోయింది. ఆ తర్వాత పర్యాటక జట్టు నిర్దేశించిన స్వల్ప లక్ష్యాన్ని 17 ఓవర్లలోనే ఛేదించి సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేయడమే గాక స్వదేశంలో వరుసగా 18వ టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది.

కాన్పూర్: అద్భుతం.. అసాధారణం.. అపూర్వం.. కాన్పూర్ టెస్టులో భారత ప్రదర్శన గురించి చెప్పడానికి ఇలాంటి ఉపమానాలెన్ని వాడినా సరిపోదు. వర్షం, ఇతరత్రా కారణాల రీత్యా రెండున్నర రోజుల ఆట కోల్పోయిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా.. ఐదో రోజు మరో సెషన్ మిగిలుండగానే సగర్వంగా విజయాన్ని ముద్దాడింది. ఆట చివరి రోజు బంగ్లాదేశ్ నిర్దేశించిన 95 పరుగుల ఛేదనను 17.2 ఓవర్లలోనే పూర్తిచేసింది. యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (45 బంతుల్లో 51, 8 ఫోర్లు, 1 సిక్సర్), స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (37 బంతుల్లో 29 నాటౌట్, 4 ఫోర్లు) వేగంగా ఆడారు. అంతకుముందు భారత బౌలర్లు చెలరేగడంతో రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 47 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ షద్మాన్ ఇస్లాం (50) అర్ధ సెంచరీతో ఆదుకోగా ముష్ఫికర్ రహీమ్ (37) ఫర్వాలేదనిపించాడు. బుమ్రా (3/17), జడేజా (3/34), అశ్విన్ (3/50) తలా మూడు వికెట్లతో పర్యాటక జట్టు వెన్ను విరిచారు. మ్యాచ్‌లో రెండు అర్ధ సెంచరీలు చేసిన యశస్వీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కగా సిరీస్ ఆసాంతం రాణించిన రవిచంద్రన్ అశ్విన్‌ను 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' వరించింది.

బుమ్రా, జడ్డూ ధాటికి బెంబేలు..

చివరి రోజు ప్రత్యర్థిని త్వరగా ఆలౌట్ చేయాలనే ఏకైక లక్ష్యంతో బరిలోకి దిగిన రోహిత్ సేన మూడో ఓవర్లోనే అందుకు శ్రీకారం చుట్టింది. ఓవర్‌నైట్ స్కోరు 26/2 వద్ద ఐదో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా.. ఫస్ట్ ఇన్నింగ్స్ సెంచరీ హీరో మొమినుల్ హక్ (2) వికెట్‌ను త్వరగా కోల్పోయింది. అశ్విన్ వేసిన బంతిని స్వీప్ చేయబోయిన అతడు.. లెగ్ స్లిప్‌లో రాహుల్ చేతికి చిక్కాడు. అయితే కెప్టెన్ శాంతో (19) తో కలిసి షద్మాన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు యత్నం చేశాడు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 55 పరుగులు జతచేసింది. కానీ డ్రింక్స్ తర్వాత రెండో ఓవర్‌లో జడేజా.. అద్భుతమైన బంతితో శాంతోను బోల్తా కొట్టించాడు. రివర్స్ స్వీప్ ఆడబోయిన శాంతో బంతి మిస్ అవడంతో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న షద్మాన్‌ను ఆ మరుసటి ఓవర్లోనే ఆకాశ్‌దీప్ పెవిలియన్‌కు పంపాడు. లిటన్ దాస్ (1), షకీబ్ సైతం జడ్డూ మాయాజాలానికి బలయ్యారు. మిరాజ్‌ను బుమ్రా బౌల్డ్ చేయడంతో బంగ్లా ఆశలు వదులుకుంది. లంచ్ విరామానికి వెళ్లేముందు బుమ్రా వేసిన 46వ ఓవర్ చివరి బంతికి ముష్ఫికర్ కూడా బౌల్డ్ అవడంతో బంగ్లా ఇన్నింగ్స్ ముగిసింది.



జడేజా 3/34

యశస్వీ దూకుడు..

బంగ్లా నిర్దేశించిన 95 పరుగుల ఛేదనను భారత్ ధాటిగానే మొదలుపెట్టింది. యశస్వీ రెండో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. కానీ రోహిత్ (8), శుభమన్ గిల్ (6) నిరాశపరిచారు. ఈ ఇద్దరూ మిరాజ్ బౌలింగ్‌లో ఔటయ్యారు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన కోహ్లీతో కలిసి యశస్వీ భారత్‌ను లక్ష్యం వైపునకు నడిపించాడు. ఈ జోడీ మూడో వికెట్‌కు 58 పరుగులు జోడించింది. తైజుల్ ఇస్లాం బౌలింగ్‌లో భారీ సిక్సర్‌తో ఫిఫ్టీకి చేరువైన యశస్వీ.. అతడే వేసిన 16వ ఓవర్‌లో సింగిల్ తీసి ఈ మ్యాచ్‌లో రెండో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. కానీ భారత విజయానికి 4 పరుగుల దూరంలో ఉండగా భారీ షాట్ ఆడబోయి షకీబ్ అల్ హసన్‌కు క్యాచ్ ఇచ్చాడు. కోహ్లీతో కలిసి పంత్ (4 నాటౌట్) గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశాడు.

స్వదేశంలో అజేయం

భారత్‌కు ఇది వరుసగా 18వ టెస్టు సిరీస్ విజయం. ప్రపంచ టెస్టు క్రికెట్ చరిత్రలో ఏ జట్టుకూ ఈ రికార్డు లేదు. 2012 తర్వాత టీమ్‌ఇండియా సొంతగడ్డపై ఒక్క టెస్టు సిరీస్ కూడా కోల్పోలేదు. చివరిసారిగా 2012-13లో ఇంగ్లండ్ చేతిలో ఓడాక గడచిన 12 ఏండ్లలో ఒకటి, అరా టెస్టు మ్యాచ్‌లు ఓడటం మినహా సిరీస్‌లు కోల్పోయిన దాఖలాల్లేవు. ప్రపంచ క్రికెట్‌లో దిగ్గజ జట్టుగా ఈ ఘనత ఉంది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా (10 టెస్టు సిరీస్‌లు- 1994-2000 దాకా, 2004-2008 దాకా), వెస్టిండీస్ (8, 1976-1986) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సుమారుగా 4,300 రోజులకు పైగా భారత్ స్వదేశంలో అజేయంగా కొనసాగుతోంది. 2013 నుంచి సొంతగడ్డపై 53 టెస్టులు ఆడిన మెన్ ఇన్ బ్లూ.. ఏకంగా 42 మ్యాచ్‌లలో గెలిచి 4 టెస్టులను మాత్రమే కోల్పోయింది. ఏడు డ్రా తేలాయి.

1 టెస్టు క్రికెట్ చరిత్రలో రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి ఓ జట్టు అత్యధిక రన్‌రేట్ (7.36 భారత్) నమోదు చేయడం ఇదే ప్రథమం. టెస్టులలో ఒక్క మెయిడిన్ కూడా లేకుండా గెలిచిన జట్టు భారత్. రెండు ఇన్నింగ్స్‌లలోనూ ఒక్క బంగ్లా బౌలర్ కూడా మెయిడిన్ ఓవర్ వేయలేదు.

4 ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక టెస్టు విజయాలు సాధించిన జట్లలో భారత్ (180) నాలుగో స్థానంలో ఉంది. ఆసీస్, ఇంగ్లండ్, విండీస్ మనకంటే ముందున్నాయి.

11 టెస్టుల్లో అశ్విన్ సాధించిన ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌లు. ఈ క్రమంలో అతడు మురళీధరన్ (శ్రీలంక)ను సమం చేశాడు.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లా తొలి ఇన్నింగ్స్: 233 ఆలౌట్
భారత్ తొలి ఇన్నింగ్స్: 285/9 డిక్లేర్డ్
బంగ్లా రెండో ఇన్నింగ్స్: 146 ఆలౌట్ (షద్మాన్ 50, ముష్ఫికర్ 37, బుమ్రా 3/17, జడేజా 3/34)
భారత్ రెండో ఇన్నింగ్స్: 98/3 (యశస్వీ 51, కోహ్లీ 29 నాటౌట్, మిరాజ్ 2/44)

డబ్ల్యూటీసీ బాటలో

బంగ్లాదేశ్‌తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడంతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 ఫైనల్ రేసుకు భారత్ మరింత చేరువైంది. ఈ విజయంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమ్‌ఇండియా.. 74.24 శాతంతో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ సైకిల్‌లో మరో 8 మ్యాచ్‌లు (స్వదేశంలో న్యూజిలాండ్‌తో 3, ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో 5) ఆడనున్న రోహిత్ సేన.. మూడింటిలో గెలిచినా వరుసగా మూడో సారి ఫైనల్స్ ఆడుతుంది.

పార్థ్ పసిడి జోరు

• భారత్ పతక మోత



లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ పార్థ్ రాకేశ్ మనె రెండు స్వర్ణాలు నెగ్గాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఈవెంట్‌లో పసిడి నెగ్గిన పార్థ్.. ఇదే విభాగంలోని టీమ్ ఈవెంట్‌లోనూ స్వర్ణం గెలిచాడు. వ్యక్తిగత ఫైనల్‌లో అతడు 250.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అజయ్ మాలిక్, అభినవ్ షాతో కలిసి టీమ్ ఈవెంట్‌లో పాల్గొన్న పార్థ్.. 1883.5 పాయింట్లతో మరో స్వర్ణాన్ని కొల్లగొట్టాడు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్‌లో భారత బృందం గౌతమి, సంభవి, అనోష్క త్రయం 1883.5 పాయింట్లతో తొలిస్థానంలో నిలిచి పసిడిని ముద్దాడింది. ఇదే విభాగంలో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో గౌతమి, అజయ్ ద్వయం కాంస్యంతో మెరిసింది. ఈ టోర్నీలో భారత్ 5 స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలు దక్కించుకుని పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచింది.


తిలక్ కెప్టెన్సీలో.. | రంజీ టోర్నీకి హైదరాబాద్ టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రానున్న రంజీ ట్రోఫీ కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సీనియర్ సెలెక్షన్ కమిటీ జట్టును ప్రకటించింది. మంగళవారం సమావేశమైన కమిటీ చైర్మన్, సెలెక్టర్లు టోర్నీ తొలి రెండు మ్యాచ్‌లకు(హైదరాబాద్, డెహ్రాడూన్) జట్టును ఎంపిక చేశారు. 15 మందితో కూడిన టీమ్‌కు యువ బ్యాటర్ తిలక్‌వర్మ కెప్టెన్‌గా, రాహుల్ సింగ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. వీరితో పాటు మిలింద్, తన్మయ్‌అగర్వాల్, రోహిత్‌రాయుడు, తనయ్ త్యాగరాజన్, అనికేత్‌రెడ్డి, నితేశ్, అభిరాత్, హిమతేజ, రాహుల్, రక్షణ్‌రెడ్డి, కార్తికేయ, సరను నిశాంత్, ధీరజ్‌గౌడ్ జట్టులో చోటు దక్కించుకున్నారు. హైదరాబాద్ జట్టుకు వినీత్ సక్సేనా చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

వామప్‌లో భారత్ విజయం

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్ సన్నాహాల్లో భారత్ వరుస విజయాలతో అదరగొడుతున్నది. ఇప్పటికే వెస్టిండీస్‌పై విజయం సాధించిన టీమ్‌ఇండియా..మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన మరో వామప్‌లో28 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత రీచా ఘోష్(36), దీప్తిశర్మ(35 నాటౌట్), రోడ్రిగ్స్(30) రాణించడంతో టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో144/7 స్కోరు చేసింది. ఓపెనర్ షెఫాలీవర్మ(0) డకౌట్‌తో నిరాశపర్చగా, మంధన(21) ఫర్వాలేదనిపించింది. కాకా(5/25) ఐదు వికెట్లతో విజృంభించింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన సఫారీలు 20 ఓవర్లలో 116/6 స్కోరుకు పరిమితమయ్యారు. కెప్టెన్ లారా వోల్వార్ట్(29), కోల్ ట్రయాన్(24) మినహా పెద్దగా ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. ఆశా శోభన(2/21) రెండు వికెట్లు తీసింది.

ఫైనల్‌లో సిన్నర్ X అల్కారజ్




బీజింగ్: టెన్నిస్ యువ సంచలనాలు జన్నిక్ సిన్నర్ (ఇటలీ), కార్లొస్ అల్కారజ్ (స్పెయిన్) చైనా ఓపెన్ టెన్నిస్ ఫైనల్‌లో ముఖాముఖి తలపడనున్నారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో రెండో సీడ్ అల్కారజ్.. 7-5, 6-3తో డేనియల్ మెద్వెదెవ్ (రష్యా)ను వరుస సెట్లలో ఓడించి ఫైనల్స్ చేరాడు. మరో సెమీస్‌లో ఒకటో సీడ్ సిన్నర్.. 6-3, 7-3(7/3)తో యుంచవొకెటె బు (చైనా)ను చిత్తుచేశాడు. ఈ ఇద్దరూ గతంలో 9 సార్లు తలపడగా అల్కారజ్ 5 మ్యాచ్‌లు గెలవగా సిన్నర్ నాలుగింటిలో గెలిచాడు.

రాణించిన రహానే, సర్ఫరాజ్



లక్నో: ప్రతిష్ఠాత్మక ఇరానీ కప్‌లో రంజీ చాంపియన్ ముంబై జట్టు తొలి రోజు నిలకడగా ఆడింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేస్తున్న ముంబై.. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే (86 బ్యాటింగ్), సర్ఫరాజ్ ఖాన్ (54 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. శ్రేయస్ అయ్యర్ (57) అర్ధ సెంచరీతో మెరిశాడు.

నిలకడగా రజనీ ఆరోగ్యం



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ అనారోగ్యానికి లోనయ్యారు అనే వార్త దేశవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులను కలవరానికి గురిచేసింది. సోషల్ మీడియా ద్వారా రజనీ కోలుకోవాలని ప్రార్థిస్తూ పోస్టులు కూడా పెడుతున్నారు. సోమవారం రాత్రి తీవ్ర కడుపునొప్పితో రజనీ చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జాయిన్ అయ్యారు. ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు హృదయ నాళంలో సమస్యను గుర్తించి, రజనీకి స్టెంట్ వేశారు. మంగళవారం ఉదయం ఆస్పత్రి వర్గాలు రజనీకాంత్ ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్ బులెటిన్‌ని విడుదల చేశాయి. హృదయ నాళానికి సంబంధించిన చికిత్స చేసినట్టు ఈ బులెటిన్‌లో వారు వెల్లడించారు. రజనీ ఆరోగ్యం నిలకడగానే ఉందనీ, మరో రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని వారు బులెటన్ ద్వారా పేర్కొన్నారు. మరోవైపు ఈ విషయంపై రజనీకాంత్ భార్య లత కూడా స్పందించారు. రజనీకాంత్ ఆరోగ్యం మెరుగుపడిందని, నిలకడగానే ఉన్నారని అభిమానులకు ఆమె తెలియజేశారు. రజనీకాంత్ నటించిన 'వెట్టయాన్' సినిమా ఈ నెల 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇదిగాక 'కూలీ' అనే సినిమా కూడా చేస్తున్నారాయన.

షరతులు లేని ప్రేమకు దర్పణం



'కె.బాలచందర్, కె.విశ్వనాథ్, దాసరి, కమల్‌హాసన్ లాంటి గొప్ప వారికి మనం థాంక్స్ చెప్పుకోవాలి. ఎందుకంటే.. చిన్నప్పుడే ఈ తరహా సినిమాలను మనకు వారు చూపించేశారు. ఈ కైండ్ ఆఫ్ సినిమాను మన లోపల పెట్టారు. ఇలాంటి ఎమోషన్స్‌ని మిస్ అవుతున్నామని, మళ్లీ ఆ ఎమోషన్స్‌ని తీసుకొచ్చారని అందరూ అంటుంటే చాలా ఆనందంగా ఉంది. షరతులు లేని ప్రేమను తెరపై ఆవిష్కరించిన డైరెక్టర్ ప్రేమ్‌కుమార్‌ని అభినందించకుండా ఉండలేకపోతున్నా' అని హీరో కార్తీ అన్నారు. ఆయనా, అరవింద స్వామి లీడ్ రోల్స్ చేసిన చిత్రం 'సత్యం సుందరం'. '96'ఫేం ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో జ్యోతిక, సూర్య నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో గత నెల 28న విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఇంకా దర్శకుడు సి.ప్రేమ్‌కుమార్, హీరోయిన్ శ్రీదివ్య, రచయిత రాకేందుమౌళి కూడా మాట్లాడారు.

ఛాలెంజ్‌గా తీసుకొని చేశా



'ఈ సినిమాకు ముందు 'స్వాగనిక వంశానికి సుస్వాగతం' అని టైటిల్ పెట్టాలనుకున్నాం. యూత్ పలకడానికి ఇబ్బందిపడతారని 'స్వాగ్' అని పేరు పెట్టాం. ఇది ఒక వంశానికి చెందిన కథ. 1500వ సంవత్సరంలో కథ మొదలవుతుంది. స్త్రీ గొప్పా? పురుషుడు గొప్పా? అనే అశంపై టిట్ ఫర్ టాట్ లాంటి అంశాలతో కథ నడుస్తుంది. కొత్త కథ చెబితే ప్రేక్షకులు ఆదరిస్తారనే ధైర్యంతో ఈ సినిమా చేశాం' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. ఆయన హీరోగా రూపొందిన ఈ చిత్రానికి హసిత్ గోలి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 4న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో శ్రీవిష్ణు విలేకరులతో ముచ్చటించారు. 'నేను డ్యూయల్ రోల్స్ ఇప్పటివరకూ చేయలేదు. ఈ సినిమాలో నాలుగు పాత్రలు చేశాను. ఒకే పోలికతో ఉన్న నాలుగు జనరేషన్స్ వ్యక్తులుగా కనిపిస్తా. ఛాలెంజ్‌గా తీసుకొని ఈ పాత్రలు చేశా. యూత్‌కే కాక, పెద్దవాళ్లకూ నచ్చే సినిమా ఇది. రెండున్నర గంటల్లో ఇంతపెద్ద కథ చెప్పారా? అంటూ సినిమా చూశాక దర్శకుడ్ని అభినందిస్తారు. నా కెరీర్‌లో వన్ ఆఫ్ ది టాప్ ఫిల్మ్ 'స్వాగ్'' అని తెలిపారు శ్రీవిష్ణు. కథానాయిక రీతూవర్మ ఇందులో కొత్తగా కనిపిస్తుందని, మీరాజాస్మిన్ అద్భుతంగా నటించారని, సినిమా చూస్తున్నంతసేపు నటులు కనిపించరని, పాత్రలే కనిపిస్తాయని, అందరికీ అర్థమయ్యేలా స్క్రీన్‌ప్లే ఉంటుందని, వివేక్‌సాగర్ మ్యూజిక్ క్రేజీ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని శ్రీవిష్ణు తెలిపారు. ఈ సినిమా తర్వాత ఓ థ్రిల్లర్ సినిమా, గీతా ఆర్ట్స్‌లో ఓ కామెడీ సినిమా చేస్తున్నామని శ్రీవిష్ణు చెప్పారు.


మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి



ప్రియాంక చోప్రా తనవారందరికీ ఓ ఫొటో ఛాలెంజ్ విసిరింది. తొమ్మిదేండ్ల వయసులో ఉన్న తన ఫొటోకు, 17ఏండ్ల వయసులో తాను మిస్ వరల్డ్ గెలుచుకున్న నాటి ఫొటోను జత చేసి తన ఇన్‌స్టాలో షేర్ చేసింది ప్రియాంక. 'ఈ ఫొటోల్లో ఒకటి నా తొమ్మిదేండ్ల నాటి ఫొటో. క్రాఫ్‌తో అబ్బాయిలా ఉన్నాను. స్కూల్లో చదువుతున్న రోజులవి. రెండోది నేను మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలిచిన నాటి ఫొటో. అప్పటికి నా వయసు 17ఏండ్లు. ఆ రోజులు ఇప్పటికీ జ్ఞాపకమే. అప్పుడప్పుడే జీవితంలో స్థిరపడుతున్న క్షణాలవి. వెనక్కి తిరిగి చూసుకుంటే నా జీవితంలో సంభవించిన మార్పులు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. మీకు మీరే స్ఫూర్తి. ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడి ఉంటాం. ఆ స్ఫూర్తే నేటికీ మనల్ని ముందుకు నడిపిస్తుంది. మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. మీ చిన్ననాటి ఫొటోకి రీసెంట్ ఫొటోతో పోలుస్తూ కామెంట్స్ పెట్టండి..' అంటూ ప్రియాంక అభిమానుల్ని కోరింది.

భిన్నమైన నాలుగు అవతారాల్లో

చిత్రం



మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో వరుణ్‌తేజ్ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మట్కా' ఒకటి. కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతున్నది. నవంబర్ 14న థియేటర్లలో సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సెకండ్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. వరుణ్ ఈ పోస్టర్‌లో రెట్రో అవతార్‌లో సిగరెట్ కాలుస్తూ మెట్లపై నడుస్తూ కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నది. 1958 నుంచి 1982 వరకూ అంటే.. 24ఏండ్ల పాటు సాగే పీరియాడిక్ డ్రామా ఇదని, ఇందులో వరుణ్ నాలుగు విభిన్న రూపాల్లో కనిపిస్తారని మేకర్స్ తెలిపారు. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నవీన్‌చంద్ర, అజయ్‌ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, పి.రవిశంకర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఎ.కిశోర్‌కుమార్, నిర్మాతలు: డాక్టర్ విజయేందర్‌రెడ్డి, తీగల, రజనీ తాళ్లూరి, నిర్మాణం: వైర ఎంటర్టైన్మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటర్టైన్మెంట్స్.

గోవిందాకు బుల్లెట్ గాయాలు




ప్రమాదవశాత్తు తుపాకీ పేలిన ఘటనలో బాలీవుడ్ నటుడు గోవిందా తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం ఉదయం ముంబయిలోని ఆయన స్వగృహంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను కప్‌బోర్డ్‌లో పెడుతుండగా ట్రిగ్గర్ ప్రెస్ కావడంతో బుల్లెట్ మోకాలిలోకి దూసుకెళ్లింది. వెంటనే ఆయన్ని కుటుంబ సభ్యులు దగ్గరలోని క్రిటీ కేర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శస్త్ర చికిత్స చేసి బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం గోవిందా ఆరోగ్యం నిలకడగా ఉందని, రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. కోల్‌కతాలో జరిగే ఓ షోలో పాల్గొనేందుకు గోవిందా మంగళవారం నాలుగు గంటల సమయంలో ఇంటి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరేముందు, తన లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను పరీక్షిస్తుండగా ఈ ఘటన జరిగిందని గోవిందా మేనేజర్ మీడియాకు తెలిపారు. 'తన్‌బదన్' (1986)చిత్రంతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన గోవిందా అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి కమర్షియల్ హీరోగా గుర్తింపు పొందారు. గత ఐదేళ్లుగా సినీ రంగానికి దూరంగా ఉంటున్నారు గోవిందా. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన శివసేన పార్టీలో చేరారు.

'కాంతార' ప్రీక్వెల్‌లో మోహన్‌లాల్



రిషబ్‌శెట్టి హీరోగా స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'కాంతార' చిత్రం దేశవ్యాప్తంగా అపూర్వ విజయాన్ని సాధించింది. డివోషనల్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. ప్రస్తుతం ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార-1' తెరకెక్కుతున్నది. 'కాంతార'కు ముందు జరిగే కథతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ కీలక పాత్రలో నటించనున్నారని తెలిసింది. ఇందులో ఆయన హీరో రిషబ్‌శెట్టి తండ్రి పాత్రలో కనిపిస్తారని అంటున్నారు. గత ఏప్రిల్‌లో మోహన్‌లాల్‌ను ఆయన స్వగృహంలో కలుసుకున్నారు రిషబ్‌శెట్టి. ఆ సమయంలోనే వారిమధ్య ప్రీక్వెల్‌కు సంబంధించిన చర్చలు జరిగాయని చెబుతున్నారు. 'కాంతార-1'లో మోహన్‌లాల్ నటించడానికి అంగీకరించారని, త్వరలో ఈ విషయమై అధికారిక ప్రకటన వెలువడుతుందని సమాచారం. 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో 'కాంతార' ఉత్తమ జనరంజక చిత్రంగా నిలిచిన విషయం తెలిసిందే.



జీరో సే రీస్టార్ట్

విధు వినోద్‌చోప్రా దర్శకత్వంలో రూపొందిన '12th ఫెయిల్' చిత్రానికి అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభించాయి. పేదరికాన్ని జయించి ఐపీఎస్ సాధించిన మనోజ్‌కుమార్ శర్మ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. విక్రాంత్ మస్సే, మేధా శంకర్ ప్రధాన పాత్రల్ని పోషించారు. ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈ చిత్రాన్ని వీక్షించి అభినందించారు. తాజాగా ఈ సినిమాకు ప్రీక్వెల్‌ను తెరకెక్కించబోతున్నట్లు దర్శకుడు విధు వినోద్‌చోప్రా తెలిపారు. 'జీరో సే రీస్టార్ట్' పేరుతో ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నామని, '12th ఫెయిల్'లోని తారాగణమంతా భాగమవుతున్నారని ఆయన వెల్లడించారు. అబుదాబిలో జరుగుతున్న 'ఐఫా' చిత్రోత్సవంలో పాల్గొన్న ఆయన ప్రీక్వెల్ తాలూకు విశేషాలను వెల్లడించారు. మనోజ్‌కుమార్ శర్మ బాల్యం మొదలుకొని అతని కాలేజీ రోజుల వరకు సాగే జీవిత ప్రయాణాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నామని పేర్కొన్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభించి రెండు నెలల్లో చిత్రాన్ని పూర్తి చేస్తామని, డిసెంబర్ 13న విడుదల చేస్తామని విధు వినోద్‌చోప్రా తెలిపారు.

కృతిసనన్ డ్యూయల్ రోల్



బాలీవుడ్ కథానాయిక కృతిసనన్ 'దో పట్టి' చిత్రంతో నిర్మాతగా మారుతున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె సీనియర్ నటి కాజోల్‌తో కలిసి నటిస్తున్నది. కవలలైన అక్కాచెల్లెళ్ల కథతో మర్డర్ మిస్టరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శశాంక చతుర్వేది దర్శకుడు. నటి కనికా థిల్లాన్ ఈ చిత్రానికి కథనందించింది. ఈ సినిమాలో కృతిసనన్ ద్విపాత్రాభినయంలో నటిస్తున్నది. కెరీర్‌లో తొలిసారి ఆమె డ్యూయల్ రోల్‌ను పోషిస్తుండటం విశేషం. నిర్మాతగా తన తొలి ప్రాజెక్ట్ కాబట్టి ఈ సినిమాపై కృతిసనన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదట. ఉత్తరాఖండ్‌లోని ఓ చిన్న టౌన్‌లో జరిగే హత్య నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, ప్రేమ, పగ, ప్రతీకారం వంటి అంశాలతో ఆద్యంతం ఉత్కంఠను పంచుతుందని, తన పాత్రలో భిన్న పార్శ్వాలుంటాయని కృతిసనన్ పేర్కొంది. ఈ నెల 25 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.